జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

సంపుటి : 55 సంచిక : 11 నవంబర్, 2022 పేజీలు : 24 వెల : రు. 10/-


మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే ప్రజలను టెర్రరిస్టుల బూచిని చూపి ప్రక్కదోవపట్టించటం

కేంద్రప్రభుత్వం పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పిఎఫ్ఐ)ను, దాని అనుబంధ సంస్థలను నిషేధించింది. రాజ్యాంగం ప్రవచించిన దేశ సమగ్రత, భద్రత, సార్వభౌమత్వం, సామాజిక క్రమాలకు వ్యతిరేకంగా టెర్రరిజం పేరుతో సాగుతున్న చర్యలకు ఈ నిషేధం వర్తిస్తుందని కేంద్రప్రభుత్వం ప్రకటించుకుంది. అత్యధిక లేదా అల్పసంఖ్యాక స్వభావం కల్గిన టెర్రరిస్టు సంస్థల మతరాజ్య స్థాపన ప్రయత్నాన్ని నిషేధమనేది అణచిపెట్టలేదని చరిత్ర నిరూపించింది. ఒక సంస్థను నిషేధిస్తే, అది మరోపేరుతో తిరిగి తలెత్తుతుంది. మత ఛాందసవాద సంస్థలకు మతోన్మాదాన్ని ప్రోత్సహించే వందలకొలది ముసుగు సంస్థలున్నాయి. హనుమాన్‌సేన, గో పరిరక్షణసేన, రామ్‌సేన, హిందూమహాసభ మొదలైన అనేక హిందూమతతత్వశక్తుల సంస్థలు దీనికి ఉదాహరణ. హిందూ సమూహంతో వలె ముస్లిం సమూహంలోనూ అనేక ముసుగు సంస్థలున్నాయి.

భారతదేశాన్ని ఒక మతపరమైన రాజ్యంగా మలిచే లక్ష్యాన్ని సాధించేందుకు సాగించే టెర్రరిస్టు కార్యకలాపాల కారణంగా ఈ సంస్థలను తరచుగా నిషేధించటం జరుగుతోంది. అయితే, నిషేధం విధించినప్పటికీ, ఈ మతతత్వ సంస్థలు మరో పేరుతో ముందుకొస్తున్నాయి. అతివాద మత-మతతత్వ సంస్థలను అదుపుచేసి, నిరోధించటానికి భారత న్యాయగ్రంధాలు, రాజ్యాంగంలలో ఎన్నో చట్టాలున్నాయి. నిష్కర్షగా, నిష్పక్షపాతంగా ఈ చట్టాలను అమలుచేసేట్లయితే ఈ సంస్థలు మతోన్మాదాన్ని వ్యాప్తిచేయకుండా కొంతమేరకు నిరోధించవచ్చు. ప్రజల మెదళ్ళనిండా దట్టిస్తున్న జాత్యహంకార విషాన్ని తటస్థీకరించేందుకు, చర్చలు, భావజాల ప్రచారాలు సాగించాల్సిన అవసరముంది. లౌకికవాద రాజ్యస్థానంలో మతపరమైన రాజ్యాన్ని ప్రోత్సహించే మతఛాందసవాద భావజాలాన్ని పూర్వపక్షం చేయటానికి-లౌకికవాద, ప్రజాస్వామిక భావజాలాన్ని ఒక ఆయుధంలా ఉపయోగించటంద్వారా మాత్రమే సాధ్యం.

అయితే, నేడు సంఘ్‌పరివారశక్తుల నాయకత్వంలో నడుస్తున్న బిజెపి, దేశాన్ని పాలిస్తూ, భారతదేశాన్ని హిందూరాజ్యంగా మార్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇస్లాం మతతత్వశక్తులు బలం పుంజుకున్నపుడే సంఘ్‌పరివారశక్తుల కల ఫలిస్తుంది. విదేశీ వస్తు విముఖతపై ప్రచారం ద్వారానే ఒక విద్వేష భావజాలం పెరగగలుగుతుంది. హిందూమత అతివాద సంఘ్‌పరివారశక్తులూ ఇస్లామ్ మత అతివాద సంస్థ పాపులర్ ఫ్రంటూ పుంజుకొని, బలపడటమనేవి ఒకదానిపై ఒకటి ఆధారపడి వుంటుంది. హిందూ మతతత్వాన్ని తన ఎరువుగా వుపయోగించుకొని ముస్లిమ్ మతోన్మాదం పెరిగి, బలపడుతుంది. ముస్లిం మతోన్మాదం సమాజంలో గుమ్మరించిన మతతత్వ విషాన్ని జుర్రుకొని హిందూ మతతత్వం భయంకర రాక్షస రూపాన్ని చేపడుతుంది. వాస్తవానికి భారతదేశంలోని అల్ప సంఖ్యాక మతస్థులలో కొద్ది విభాగం మాత్రమే టెర్రరిస్టు సంస్థలలో వున్నారు. అత్యధిక సంఖ్యలోని ముస్లిములు లౌకికవాద-ప్రజాస్వామిక భావజాలాన్నే అనుసరిస్తున్నారు. అయితే, భారతదేశంలోని ముస్లిములందర్నీ టెర్రరిస్టులుగా చిత్రీకరిస్తూ సంఘ్ పరివారశక్తులు విస్తృత ప్రచారాన్ని సాగిస్తున్నాయి. రెండు శతాబ్దాల కాలం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారతదేశంలో భుజం భుజం కలిపి పోరాడిన మంచి సాంప్రదాయం ముస్లిములకుంది. హిందూమతతత్వవాదుల నీచమైన దాడులు సాగుతున్నప్పటికీ దేశంలోని 11 శాతం ముస్లిం జనాభాలోని ఒక్కశాతం ముస్లింల మద్దతును కూడా ముస్లిం టెర్రరిస్టు సంస్థలు పొందలేకపోయాయనే వాస్తవం, ముస్లిం జనాభా ఎత్తిపట్టిన లౌకికవాద, ప్రజాస్వామిక విలువల గొప్పతనాన్ని సూచిస్తోంది.

ఇరువైపులానున్న మతతత్వ సంస్థల వెనుక ప్రపంచాధిపత్యంకోసం అర్రులుచాస్తున్న, సూపర్‌లాభాలాశించే కార్పొరేట్‌శక్తులను, సామ్రాజ్యవాద శక్తులను మనం చూడగలం. మోడీ ప్రభుత్వం అమలుచేస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు ఫలితంగా సృష్టించబడుతున్న



భారత విప్లవోద్యమ నాయకులు

కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డికి జోహార్లు

నవంబర్ 9

కా॥ సి.పి.

వర్ధంతి

జనశక్తి

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 55
సంచిక : 11

లోపలి పేజీల్లో

వెల : విడిప్రతి..................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :
ఎస్.శేషమ్మ ఎడిటర్
32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,
ఎం.ఆర్.పురం, విజయవాడ-10.

నిరుద్యోగం, పేదరికాలతో అత్యధిక ప్రజానీకం అసంతృప్తితోనున్నారు. నయా ఉదారవాద విధానాలలో అంతర్భాగమైన ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో కార్పొరేట్లకు అధికారం కట్టబెడుతున్నారు. భారతదేశ చరిత్రలో మున్నెన్నడూ కనీవినీ ఎరుగని స్థాయిలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయాయి. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో భాగంగా ప్రపంచంలోని అత్యంత ధనికులలో ఆదానీ మూడవస్థానంలో నిలువగా, ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశ స్థితి 132వ స్థానానికి పడిపోయింది. రైతాంగ ఆత్మహత్యల సంఖ్య పెరుగుతోంది. అత్యధిక సంపన్నుల పన్నుబకాయిలు, రుణబకాయిలను రద్దుచేస్తుండగా, 'సర్ఫేసి' చట్టం ద్వారా సామాన్య ప్రజల కొద్దిపాటి ఆస్తులను సైతం జప్తుచేస్తున్నారు. మనదేశంలోని నిరుపేద ప్రజానీకం దయనీయమైన జీవితాన్ని గడుపుతున్నారని 'యుఎన్‌డిపి'కి చెందిన మానవవనరుల సూచీ, 'ది సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీస్ అన్ ఎంప్లాయిమెంట్' నివేదిక, 'వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్‌కు చెందిన ప్రపంచ అసమానతల నివేదిక'లు తెలుపుతున్నాయి. మతరాజ్యం, మతతత్వాలపై కేంద్రీకరించి సాగే చర్చలను, మోడీ పాలనకు వ్యతిరేకంగా సాగే ప్రజా నిరసనలను నీరుగార్చేందుకు సాధనాలుగా ఉపయోగిస్తారు.

మతోన్మాదం, అది అల్పసంఖ్యాకులదైనా, అత్యధిక ప్రజలదైనప్పటికీ, అది సంపూర్తిగా దేశంలోని బహుళత్వాన్ని, లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయటానికే దోవతీస్తుంది. ఆధునిక ప్రపంచ చరిత్రలో కూడా మత-ప్రాంతీయ-వేర్పాటువాద చర్యలలో భాగంగా సంకుచిత లక్ష్యాలతో విదేశీ వస్తు విముఖత, విద్వేషం, అసహ్యతలను పెంపొందించిన ఆయా దేశాలలోని ప్రజాస్వామిక క్రమాలు పూర్తిగా కుప్పకూలిపోయిన ఉదాహరణలు అనేకం వున్నాయి. ప్రజాస్వామ్య శిఖరంగా అభివర్ణించే అమెరికాలో జాతి కారణంగా నల్లజాతి ప్రజానీకం నిరంతరాయ దాడులకు గురవుతుండగా, ఇరాన్ వంటి మతరాజ్య వ్యవస్థలో మహిళలు తమకు నచ్చిన దుస్తులు ధరించినందుకుగానూ చంపబడుతున్నారు. కనుక మత, ప్రాంతీయ ఆధిపత్యాలనేవి లౌకిక, ప్రజాస్వామిక దృక్పథాలకు విరుద్ధమైనవని ఈ విషయాలు తెలియజేస్తున్నాయి. మతోన్మాదులు-వారు మెజారిటీకి చెందినా, మైనారిటీకి చెందినా-సమాజానికి హాని చేకూర్చేవారే కాగా, సామాజిక వెనుకబాటుతనంలో నున్న భారతదేశంలో హిందూమతతత్వం మరింత ప్రమాదకరంగా వుంది. భారతదేశ జనాభాలో 15 శాతం కంటే తక్కువగా వుండి, ఏవిధంగానూ ప్రమాదకరంగా లేని అల్ప సంఖ్యాక మతస్థులపై సంఘపరివారశక్తులు నిరంతరాయంగా బలమైన దాడులు సాగిస్తున్నారు. ఈ దాడులు అల్పసంఖ్యాక మతస్థులను రెచ్చగొడుతూ, అందులోని ఉన్మాదులు మతపరమైన టెర్రరిస్టు సంస్థలను ఆశ్రయించేలా తయారుచేస్తున్నాయి. బాబిరీమసీదు కూల్చివేత, జమ్ముకాశ్మీర్ విభజన, గోపరిరక్షణ, పౌరసత్వ చట్టం, అల్పసంఖ్యాకుల ప్రార్థనా స్థలాల కూల్చివేత, మసీదులు, చర్చీలు మొదలైన వాటిపై హక్కుల ప్రకటనలు మొదలైనవన్నీ దీనిలో భాగమే. 2023లో జరిగే 'ధర్మ సంసద్'లో ఆమోదం పొందేందుకు మనస్మృతిపై ఆధారపడి 750 పేజీల రాజ్యాంగాన్ని తయారుచేశామని, వారణాసిలో 'ధర్మ సంసద్' నిర్వాహకులు ప్రకటించారు. ఈవిధంగా హిందూ మతతత్వశక్తులు అల్పసంఖ్యాక మతస్థులకు వ్యతిరేకంగా తీవ్రంగా రెచ్చగొట్టే నినాదాలతో ముందుకు వస్తున్నారు. దేశ ఉనికికే ప్రమాదకారిగా దాపురించిన ఈ హిందూమతతత్వాన్ని అణచివేయటం ద్వారా మాత్రమే ప్రజాస్వామ్య, లౌకిక భారతదేశం సాధ్యమౌతుంది. పిఎఫ్ఐ అల్పసంఖ్యాక మతస్థుల మతతత్వాన్ని ప్రోత్సహించేదే అయినప్పటికీ కూడా, హిట్లర్ ప్రచారశాఖా మంత్రి గోబెల్స్‌లాగా, పిఎఫ్ఐ హిందూమతాన్ని తుడిచిపెడుతుందంటూ ప్రచారంచేసి నిషేధం విధించారు. సంఘ్‌పరివార్ శక్తుల తెరమాటు ఎజెండాను పసిగట్టి, దానిని ఓడించటంలో మనమంతా మెలకువగా వుండాలి. భారత రాజ్యాంగాన్ని మనుస్మృతిలోకి మార్చివేసి చాతుర్వర్ణ వ్యవస్థలోకి దేశాన్ని తీసుకెళ్ళాలని వారు ప్రయత్నిస్తున్నారు. హిందూ బ్రాహ్మణీయ సామాజిక వ్యవస్థ కారణంగా మైనారిటీలు, దళితులు, ఆదివాసులు అణచివేతకు గురవుతున్నారు. ఒక కమ్యూనిస్టు లేదా ప్రజాస్వామికవాది లేదా ఒక లౌకికవాదిగా ఈ ప్రజానీకంపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనటం, సంఘ్‌పరివారశక్తులకు వ్యతిరేకంగా సాగించే ఆందోళనలకు మద్దతుగా నిలవటం-మన కర్తవ్యం. ★

"పాత క్యాలెండర్ ప్రకారంగా అక్టోబరు రష్యా విప్లవం కొత్త క్యాలెండర్ ప్రకారం నవంబరు రష్యా విప్లవంగా పిలువబడుతున్నది. కనుక నవంబర్ రష్యా విప్లవం, అక్టోబర్ చైనా విప్లవం (దీనికి పాత క్యాలెండర్ లేదు), మానవజాతి చరిత్రలో రెండూ రెండు మైలురాళ్లు.

ఈ రెండు దేశాల కమ్యూనిస్టు పార్టీలు పుట్టినప్పటి నుండి మార్క్సిజం - లెనినిజాలకు వ్యతిరేకంగా అనేక పెడధోరణులకు చెందిన ప్రతినిధులు ఆటంకాలు కల్పిస్తూనే వున్నారన్న నగ్నసత్యం అందరకూ తెలిసిందే. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన శ్రామిక ప్రభుత్వాలేర్పడిన తర్వాత గూడ ఆ శక్తులు మార్క్సిజాన్ని తొలిచే కార్యక్రమం వదులు కోలేదు. వాళ్లు మార్క్సిజం ముసుగులోనే దాగివున్న పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల ఏజంట్లు. కనుకనే రెండు కమ్యూనిస్టు పార్టీలలో ఎన్ని పేర్లు పెట్టుకున్నా మౌలికంగా రెండు విధానాల మధ్య పోరాటాలుగానే సాగాయి. అయితే రష్యాలో స్టాలిన్ మరణానంతరం, చైనాలో మావో మరణానంతరం అవి తిరిగి విజృంభించడం, ఆధిక్యతను సంపాదించడం ఎలా జరిగింది? అంత దీర్ఘకాల పోరాటాలలో రాటుదేలిన కార్యకర్తలు, ప్రజలు వీరి అధిక్యతను ఎందుకు ఆమోదించారు? ఎందుకు కొనసాగిస్తున్నారు? యింకా యిలాంటి ప్రశ్నలే వున్నాయి. ఎన్ని ప్రశ్నలున్నా యీ పెట్టుబడిదారీ విద్రోహశక్తులు ఈ మహావిప్లవాలనే మైలురాళ్ళను పెళ్ళగించలేవు. ఇంకా మిగిలివున్న; దాగివున్న విప్లవ శక్తులు పుంజుకొని తిరిగి విజృంభించే రోజొస్తుంది.

మానవ సమాజ చరిత్ర, దాని పరిణామ చరిత్ర వయస్సు షుమారు 10 లక్షల సంవత్సరాలు. రష్యా కమ్యూనిస్టు విప్లవోద్యమ వయస్సు 100 సంవత్సరాలయితే, చైనా విప్లవోద్యమ వయస్సు 70 సంవత్సరాలే. మానవజాతి నడచిన కోట్లాది యోజనాలలో రష్యా, చైనా ప్రజలు నడచింది అతికొద్ది యోజనాలే. పది లక్షల సంవత్సరాల వయస్సు గల మానవ సమాజ చరిత్రలో రష్యా, చైనా కమ్యూనిస్టు ఉద్యమాల వయస్సు నూరు సంవత్సరాలే. కనుక అప్పుడే ఏమీ అయిపోలేదు. రివిజనిస్టులు, పెట్టుబడిదారీ మార్గీయులు నిజమైన విప్లవకారులను, కమ్యూనిస్టు యోధులను తాత్కాలికంగా ఓడించవచ్చు, ప్రక్క నుంచవచ్చుగాక, వారెన్నటికీ పైచేయి కాలేరు."

- కా॥ విశ్వం.... 'అంతిమ విజయం వర్గ పోరాటానిదే' పుస్తకం నుండి

★ ★ ★ ★ ★

"మొదటినుండి విప్లవ వ్యతిరేకతను ప్రదర్శించకుండా, విప్లవ భావాలను, విప్లవ విజయాలను, విప్లవోద్యమాన్ని పొగడుతూ, దాని చాటున విప్లవ వ్యతిరేక అభిప్రాయాలను చలామణీ చేసుకోవటం చాలా తేలిక. మార్క్సిస్టు వ్యతిరేక భావాలను మార్క్సిజం పేరుతో ఈ రోజుల్లో చక్కగా చలామణి చేయవచ్చును. కానీ, మార్క్సిజం వ్యతిరేకత పేరుతో ఆ భావాలు చలామణీలోకి రావటం చాలా కష్టం. ప్రజల్లో, మేధావుల్లో మార్క్సిజం పట్ల అభిమానం చాలా ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో మార్క్సిజం పేరుతోనే మార్క్సిస్టు వ్యతిరేక అభిప్రాయాలను చలామణీ చేస్తున్నారు. అదేవిధంగా, ఈ రోజుల్లో విప్లవాలన్నా, విప్లవోద్యమాలన్నా ప్రజల్లో, మేధావుల్లో చాలా అభిమానం పెరిగింది. వాటిని నగ్నంగా, సూటిగా వ్యతిరేకిస్తే ఎవ్వరూ దాన్ని పట్టించుకోరు. అలాంటివారిని విప్లవ వ్యతిరేకులని కొట్టిపారేస్తారు. వాటిని సూటిగా వ్యతిరేకించకుండా, పొగడుతూనే, విప్లవానికి అభిమానులుగా నటిస్తూనే, విప్లవ వ్యతిరేక అభిప్రాయాలు చలామణీ చేయటం సౌకర్యంగా ఉంటుంది. పూర్వపు విప్లవ వ్యతిరేక భావాలకు, ఈనాటి విప్లవ వ్యతిరేక భావాలకు ఉన్న ఈ మౌలికమైన భేదాన్ని గమనిస్తే విప్లవ కారులమని, లేదా విప్లవాన్ని అభిమానించే వారమని చెప్పుకునేవారు చాలామంది ఏ విధంగా విప్లవ వ్యతిరేకంగా పని చేస్తున్నారో, ఏ విధంగా వారి అభిప్రాయాలు విప్లవ వ్యతిరేకంగా మార్క్సిజం - లెనినిజానికి వ్యతిరేకంగా ఉన్నవో మనం స్పష్టంగా అర్థం చేసుకోవచ్చును."

- కా॥ దేవులపల్లి వెంకటేశ్వరరావు.... అదే పుస్తకం నుండి

మహత్తర రష్యా, చైనా విప్లవాలకు జేజేలు

వర్గ సమాజంలో రాజ్యనిర్బంధ బాధితులకు నిష్పక్షన్యాయం అసంభవం

ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబాపై కేసు కొట్టివేతను నిలుపుదల చేయటానికి సుప్రీంకోర్టు ప్రదర్శించిన అసాధారణ ఉత్సుకత, అత్యంత తొందరలను గమనిస్తే, న్యాయం వాస్తవంగా ఎవరికైతే అవసరముందో ఈ వ్యవస్థలో వారికది ఎండమావిలాగానే మిగులుతుందని మరోసారి వెల్లడైంది. మన రాజ్యాంగ పవిత్ర స్వభావాన్ని గూర్చి గొప్పగా చెప్పే మాటలుగానీ; రాజ్యాంగంలో జొప్పించిన ఆదేశిక సూత్రాల సుగుణశీలతలుగానీ; ఎలాంటి దురభిప్రాయాలు లేకుండా అందిరికీ నిష్పక్షపాత సమన్యాయం అందించే స్వతంత్ర స్వభావం మనదేశ న్యాయ వ్యవస్థ కలిగివుందని చెప్పే విషయాలుగానీ-ప్రజలను మోసగించటానికి చెప్పే కపట మాటలుగా మరోసారి రుజువైంది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రాథమికహక్కులు, భావవ్యక్తీకరణ స్వేచ్ఛవంటివన్నీ కేవల పదాడంబరాలుగా ప్రజల్ని భ్రమల్లో ముంచే డొల్లమాటలుగా మరోసారి నిరూపితమైంది. కనీసం మానవత్వం, లేదా మానవతా ప్రాతిపదికన పరిగణలోకి తీసుకోవటం వంటివి కూడా నిరర్థకంగా మిగిలిపోయాయి.

ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా శారీరకంగా 90శాతం అంగవైకల్యం కలిగివున్నాడు. చక్రాల కుర్చీలో మరొకరి సాయంతో మాత్రమే కదల గలిగే పరిస్థితిలో వున్నాడు. అంతేగాక అనేక అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందుల నెదుర్కొంటున్నాడు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణపై 2014 సం॥లో ఆయన్ను అరెస్టుచేసి 2015లో ఛార్జిషీటు దాఖలు చేశారు. సెషన్స్ కోర్టు ఈ కేసును విచారించి సాయిబాబాకు జీవిత ఖైదు విధించింది. గత 8 సం॥లుగా క్రూరమైన 'ఉపా' చట్టంక్రింద ఆయన ఖైదు చేయబడివున్నాడు.

కనీసం బెయిలు పొందటానికి అనేకమార్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ముంబయి హైకోర్టులో ఈ కేసు అప్పీలుపై విస్తారంగా వాదోపవాదాలు జరిగాయి. అనంతరం హైకోర్టు సాయిబాబాపై 'ఉపా' కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. అయితే, హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం, గంటల వ్యవధిలోనే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. నాగపూర్ కేంద్ర కారాగారం నుండి సాయిబాబాను వెంటనే విడుదల కానీయకుండా చేయడానికే ఇంత త్వరపడింది. సుప్రీంకోర్టు కూడా వెనువెంటనే కేసును విచారణకు స్వీకరించటమేగాకుండా ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయటంతోపాటు, మర్నాడు శలవు రోజైనప్పటికీ 'బెంచ్' అసాధారణంగా సమావేశమై బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును నిలువరిస్తూ ఆదేశమిచ్చింది.

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్న గత 75 సం॥లుగా ప్రజల ప్రయోజనాలతో ముడిపడివున్న ఏ కేసుల సందర్భంగానూ సుప్రీంకోర్టు ఇంతటి ఉత్సుకతను, అసాధారణ వేగాన్ని చూపలేదు.

దేశంలో ఎమర్జన్సీ విధించి, ప్రజల వాక్, సభా స్వాతంత్ర్యాలతో సహా హక్కులన్నీ కాలరాచి వేయబడినప్పుడు కూడా ప్రజలను కాపాడేందుకు సుప్రీంకోర్టు ముందుకు రాకపోగా మౌనంగా వుండటాన్ని దేశప్రజలు గమనించారు.

హిందూమతతత్వశక్తులు శతాబ్దాలనాటి బాబరీమసీదును ఘోరంగా కూల్చివేయటంతో పాటు దేశంలో హిందూ, ముస్లిం ప్రజా సమూహాల నడుమ ఎన్నటికీ పూడని అఖాతాన్ని, విభజనను, తీవ్ర ద్వేషాన్ని సృష్టించిన సందర్భంలో కూడా సుప్రీంకోర్టు వేరే దిక్కు చూస్తుండటాన్ని ప్రజలు గమనించారు.

భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ కంపెనీ సృష్టించిన ఘోర పారిశ్రామిక విపత్తులో ఈనాటికీ బాధితులుగా వున్న వారి కుటుంబాలకు కనీస న్యాయాన్ని అందించకపోవటాన్ని, చరిత్రలో అతిపెద్ద ప్రమాదానికి కారకులైన యూనియన్ కార్బైడ్ అధినేతను కనీసం అరెస్టు కూడా చేయలేకపోవటాన్ని ప్రజలు చూస్తూనే వున్నారు.

మనదేశ సముద్ర జలాలలోకి ప్రవేశించి మనదేశ మత్స్యకారులను కాల్చిచంపిన ఇటలీ నావికులను విచారణకోసం తిరిగి మనదేశం రప్పించకుండా, వారు మన దేశంలో విచారణ నెదుర్కోకుండా, చివరికి సుప్రీంకోర్టు ఆ కేసును మూసివేయటం ప్రజానీకం దృష్టిలో లేకపోలేదు.

బొంబాయి టెర్రరిస్టు దాడుల వెనుకనున్న డేవిడ్‌హెడ్లీని ఈనాటికీ అరెస్టు చేయకపోవటం, అతను అమెరికాలో భోగవిలాసాలలో గడుపుతూ వున్నాడని తెలిసినప్పటికీ మనదేశ న్యాయవ్యవస్థ అతన్ని తీసుకొనివచ్చి విచారణ జరిపించకుండా మౌనంగా వుండి పోవటాన్ని ప్రజలు గమనించారు.

మాలెగావ్ ప్రేలుళ్ళ వెనుక సూత్రధిరి, కుట్రదారు అయిన సాధ్విప్రజ్ఞాసింగ్‌ను బెయిల్‌పై బయటకు పంపటమేగాక, ఆమె ఎన్నికలలో పోటీచేసి పార్లమెంటు సభ్యురాలిగా వుంటూ మత విద్వేష జ్వాలలను రగులుస్తూ వున్నా మనదేశ న్యాయవ్యవస్థ మౌన ప్రేక్షకునిగా వుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారు.

తాజాగా, బల్కిన్‌బానో కేసులో అత్యాచారాలకు పాల్పడిన నేరస్థులైన 11 మందిని కేంద్రప్రభుత్వ ఆమోదంతో గుజరాత్ ప్రభుత్వం జైలునుండి విడుదల చేసినపుడు, గ్యాంగ్‌రేప్, హత్యల కేసులో శిక్షలుపడిన ఆ నేరస్థుల విడుదలను వెనక్కు తీసుకునేందుకు, వారి విడుదలను రద్దుచేసేందుకు సుప్రీంకోర్టు సిద్ధపడకపోగా దానిని సవాల్ చేసిన కేసు విచారణను దీర్ఘకాలం పొడిగించే వైఖరి తీసుకోవటాన్ని ప్రజలు గమనిస్తున్నారు.

హిందూ మతతత్వశక్తుల జ్ఞానవాపి వ్యాజ్యం, హిజాబ్ ధరించటం గురించిన కేసు తదితరాలను ఉన్నత న్యాయస్థానాలు స్వీకరిస్తున్న తీరును కూడా పరిశీలించకుండా లేరు.

నోకియా వంటి బడా బహుళజాతి కంపెనీలు దేశంలో చెల్లించవలసిన వేలకోట్ల రూ॥లను ఎగవేయగా అటువంటి కేసులలో సైతం ఉన్నత న్యాయస్థానం వారిని ఆయా కేసుల నుండి హాయిగా బంధవిముక్తుల్ని చేయటాన్ని ప్రజలు చూశారు.

తమ యూనియన్ గుర్తింపును అడిగిన నేరానికి మారుతి కంపెనీ కార్మికులపై తప్పుడు నేరాలు మోపి కేసులు పెట్టగా, విదేశీ పెట్టుబడి ప్రయోజనాల కోసమే మనదేశ న్యాయవ్యవస్థ ఆ కార్మికులకు అత్యంత కఠినమైన శిక్షలు విధించటాన్ని మనం చూశాం.

'న్యాయవ్యవస్థ స్వతంత్రమైనది, నిష్పాక్షిక మైనద'నే భావనపైన ఈ క్రమంలో ప్రజలకు ఏర్పరచిన గుడ్డి నమ్మకాలు చెదిరిపోవటంతో పాటుగా, మనదేశ న్యాయవ్యవస్థ కూడా, తమ పాలనను కొనసాగించుకునేందుకు ప్రజలపై క్రూరనిర్బంధాన్ని ప్రయోగించే దోపిడీవర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవస్థలో భాగమేననే విషయాన్ని గ్రహిస్తున్నారు. రాజ్యం, పాలకవర్గాలు, ప్రభుత్వాధికారంలోనున్న పాలకుల చేతిలో న్యాయవ్యవస్థ కూడా నిర్బంధం, అణచివేతలకు ఒక ఆయుధమనే

అంశాన్ని అర్థంచేసుకుంటున్నారు. పాలకవర్గాల, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజావ్యతిరేక భావజాలాల కనుగుణంగానే న్యాయవ్యవస్థ కూడా వ్యవహరిస్తుందనే అంశాన్ని గమనిస్తున్నారు. కొందరు న్యాయమూర్తులు కూడా ఏవిధంగా తమ స్వార్థ, స్వీయ ప్రయోజనాలను చూసుకుంటున్నారో, పదవీ విరమణ అనంతరం ఏవిధంగా అసాధారణ సౌకర్యాలు, బహుమానాలు, సదుపాయాలు, ఉన్నత హోదా పదవులు, భారీ భత్యాలు పొందుతున్నారో, వీటిని ఆశించి తమ పదవీ కాలంలో తీర్పులను ఏవిధంగా ఇస్తున్నారో ప్రజలు అర్థంచేసుకుంటున్నారు. అలాగే దోపిడీ, నిర్బంధం, బలప్రయోగాలతో కూడిన ప్రజావ్యతిరేక పాలక వర్గ సిద్ధాంతాని కనుగుణంగా మలచబడిన వర్గదృక్పథమే, అనేకమంది న్యాయమూర్తులు ఇస్తున్న తీర్పులకు పునాదిగా వున్నాయనే అంశాన్ని ప్రజలు గుర్తిస్తున్నారు.

లేకుంటే, పూర్తిగా అంగవైకల్యం కలిగిన ప్రొఫెసర్ సాయిబాబా దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు ప్రమాదకారి అని విద్యావంతులైన సుప్రీంకోర్టు న్యాయవాదులు ఏవిధంగా భావంచ గలుగుతారో ఎవరైనా ఊహించవచ్చు. అంతేగాక, ఎన్ఐఏ అధికారులు ఆరోపణ చేసిన విధంగా మోదీ ప్రభుత్వాన్ని తన ప్రమాదకరమైన 'మెదడు'తో కూలదోయగలుగుతాడని ఏవిధంగా భావించగలుగుతారు?

కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్‌లు 1848 నాటి కమ్యూనిస్టు ప్రణాళికలో స్పష్టంగా ఈవిధంగా వివరించారు: "గతంలో ప్రజల భక్తి గౌరవాలకు పాత్రమైన వృత్తులకున్న గౌరవ స్థానాన్ని బూర్జువావర్గం పటాపంచలు చేసింది. వైద్యులను, న్యాయవాదులను, పురోహితులనూ, కవులనూ, శాస్త్రవేత్తలనూ అది, తన కింద పనిచేసే **వేతన కూలీలుగా** మార్చివేసింది. (కమ్యూనిస్టు ప్రణాళిక నుండి....వక్కాణింపు మాది) కనుక న్యాయమూర్తులను, న్యాయ వ్యవస్థను పాలకవర్గాల వేతన కూలీలుగా మలుచుకుందని స్పష్టమౌతున్నది.


ఇంకా ఈ అంశంపైనే కమ్యూనిస్టు ప్రణాళికలోనే విపులంగా, స్పష్టంగా ఇలా పేర్కొన్నారు: "....మీ న్యాయశాస్త్రం కూడా మీ వర్గం యొక్క ఇచ్ఛయే. **అదే సమస్తజనులూ అనుసరించవలసిన చట్టంగా రూపొందించబడి, న్యాయశాస్త్రమైంది. ఆ ఇచ్ఛ ప్రధాన స్వభావమూ గమ్యమూ మీ వర్గం (బూర్జువావర్గం) బతకడానికి అవసరమైన ఆర్థిక పరిస్థితులచేత నిర్ణయింపడుతున్నాయి**". (పై పుస్తకం.... వక్కాణింపు మాది)

పైన పేర్కొన్న అంశాలతో, ప్రస్తుతం జిఎన్ సాయిబాబా విడుదలను నిలిపివేసిన సుప్రీంకోర్టు చర్యలతో పోల్చి చూసినపుడు అందరి చట్టంగా రూపొందించబడిన పాలక వర్గాల ఇచ్ఛయే న్యాయవ్యవస్థగా చెలామణి అవుతూ, ఆ సిద్ధాంతం, చట్టాల కనుగుణంగానే రాజ్య నిర్బంధ బాధితులకు వ్యతిరేకంగా న్యాయమూర్తుల తీర్పులు వుంటున్నాయని స్పష్టమౌతోంది.

న్యాయవ్యవస్థ స్టాన్‌స్వామికి బెయిల్ మంజూరుచేయకుండా కఠినంగా వ్యవహరించి, ఆయన ఒక అనాథగా జైలులోనే మరణించ టానికి పరోక్షంగా ఏవిధంగా కారణమైందో మనం చూశాం.

దేశంలో న్యాయవ్యవస్థ, న్యాయపాలనా యంత్రాంగంలోని ఈ ప్రజావ్యతిరేక స్వభావాన్ని గమనంలో వుంచుకోవాలి. వ్యవస్థీకృతమైన ప్రజావ్యతిరేక విధానాలతో విభేదించే వారికి, లేదా వాటిని ప్రశ్నించే ప్రజానీకానికి నిష్పాక్షిక న్యాయం జరుగుతుందనే భ్రమలకు లోను కారాదు. ✸

సిపిఐ (ఎం-ఎల్) సీనియర్ కామ్రేడ్ విప్లవ కార్మిక యోధుడు కామ్రేడ్ షేక్ మదార్‌కు నివాళి



సిపిఐ(ఎం-ఎల్) సీనియర్ కామ్రేడ్ షేక్ మదార్, తన 92వ ఏట, తుదిశ్వాసను విడిచారు. 16-10-2022న విజయవాడ, గిరిపురంలో, తన స్వగృహమందు మరణించిన షేక్ మదార్ తన చిన్నతనంలోనే కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడై; పార్టీ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో ఏర్పడిన చీలికల అనంతరం ఆయన కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావుల నాయకత్వంలో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ విప్లవకారుల (కమ్యూనిస్టు) సమన్వయ కమిటీలో చేరి, అప్పటినుండి తన జీవితాంతం, తదనంతర కాలంలో సిపిఐ (ఎం-ఎల్)గా పరిణామం చెందిన విప్లవ కమ్యూనిస్టు పార్టీలో సభ్యులుగా వుంటూ, పార్టీ కార్యకలాపాలలో చురుకైన పాత్ర నిర్వహించారు.

ప్రైవేటు బస్సుల్లో మెకానిక్‌గా పనిచేస్తున్న మదార్, 1956లో రోడ్డు రవాణా జాతీయం చేయబడటంతో ఆర్‌టిసిలో మెకానిక్ అయ్యారు. అప్పటినుండి ఆయన ఆర్‌టిసి కార్మికోద్యమంలో చురుకైన పాత్రను నిర్వహించారు. కార్మికులకు కేవలం ట్రేడ్ యూనియన్ చైతన్యాన్ని మాత్రమే కాక, వర్గ చైతన్యం అవసరమన్న విషయాన్ని అర్థం చేసుకొన్న మదార్, తన సీనియర్ సహచర మెకానిక్ అయిన 'పిల్లలమర్రి'గా పిలవబడే కామ్రేడ్ వెంకటేశ్వరరావుతో కలిసి కార్మికులను వర్గ రాజకీయాలలో చైతన్యపరిచే కృషిని ఎంతో ఓపికతో జరిపారు.

1974లో జరిగిన అఖిల భారత రైల్వే సమ్మెలో కార్మికులపై తీవ్రమయిన నిర్బంధం ప్రయోగించబడినప్పుడు, రైల్వే సమ్మెలో కార్మికులపై నిర్బంధానికి గురికాకుండా రహస్యంగా యితర ప్రాంతాలకు తరలించి ఆదుకొనేవారు. రైల్వే కార్మికుల కుటుంబాల వారికి ధైర్యం చెబుతూ వారికి అవసరమైన సహాయాన్ని ఏర్పాటు చేసే కృషిని జరిపారు. ఎమర్జెన్సీ కాలంలో గూడ పార్టీ కార్యకలాపాలలో పాల్గొన్నారు.

ప్రజలపై నిర్బంధం, అణచివేతలు జరిగిన ప్రతి సందర్భంలోనూ ఆయన స్పందించి, వాటిని ఖండించే, ప్రతిఘటించే కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు.

వృద్ధాప్యం మీద పడి, వినికిడి తగ్గిపోయిన అనంతరం కూడా ఆయన, పార్టీ పట్ల విశ్వాసం, రాజకీయ నిబద్ధత ఏమీ సడలలేదు. కా॥ మదార్ నిరాడంబరంగా, మృదుభాషిగా ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ వుండేవారు. పార్టీలో పనిచేస్తున్న కామ్రేడ్స్ పట్ల అత్యంత ప్రేమాభిమానాలు కలిగి వుండేవాడు.

ఆమరణాంతం ఆయన అనన్యమైన నిబద్ధతతో, క్రమశిక్షణతో ఒక ఆదర్శ కమ్యూనిస్టు విప్లవకారుడిగా, ఒక ఆదర్శ కార్మికవర్గ ప్రతినిధిగా తన జీవితాన్ని కొనసాగించారు.

కామ్రేడ్ మదార్ మరణం సిపిఐ (ఎం-ఎల్) పార్టీకి ప్రజా ఉద్యమానికి పెద్దలోటు. కామ్రేడ్ షేక్ మదార్ మరణానికి 'జనశక్తి' తన నివాళిని, విప్లవ జోహార్లను అర్పిస్తోంది. వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలుపుతోంది. ✸

సాంకేతిక నవ కల్పనలు - అభావమవుతున్న శ్రమ, శ్రామికులు - బలపడుతున్న ఆర్థిక సంక్షోభం

ప్రొ. తోట జ్యోతిరాణి

అపారమైన సంపద సృజనకు శ్రమశక్తి మూలమని మనకు తెలుసు. అదే సందర్భంలో అనూహ్యమైన, కనీవినీ ఎరుగని రీతిలో గొప్ప విలాసవంతమైన వినియోగ శైలి వాస్తవం కావటానికి, నిరంతరాయంగా కొనసాగుతున్న అద్భుతమైన సాంకేతిక నవకల్పనలే (Technological Innovations) కారణం అన్న వాదన బలపడింది. అంతరిక్ష యాత్ర (Space Tourism), అధునాతనమైన సూపర్ యాట్స్‌లో సముద్రం మధ్యలో రోజులతరబడి సంపన్నవర్గం ఎంజాయ్ చేయటం, వాటిని చూస్తున్న సామాన్యజనం ఆశ్చర్యంతో నివ్వెరపోవాల్సిందే. ఇవి అరుదైన వినియోగ అనుభవాలని పెద్దఎత్తున ప్రచారమైంది. అయితే మెజారిటీ ప్రజల జీవన విధ్వంసంతో ఈ వింత వినియోగాల వాస్తవీకరణ బలంగా ముడిపడివుందన్న నిజం కోవిడ్-19 విపత్తుతో స్పష్టంగా రుజువైంది. అసలు 'టెక్నాలజీ' అన్నది దానంతటదే అమూర్తమైనదేమీ కాదు. పరిశోధనలు ఏ దిశగా సాగాలో, ఎటువంటి సాంకేతిక పద్ధతులు ఆవిష్కరించబడాలో ఎవరు నిర్ణయిస్తారు? నిర్ణయించేది ఫైనాన్స్ క్యాపిటల్ ఆధిపత్యంలో నడుస్తున్న గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థనే కదా! స్వాధీనం చేసుకునే మిగులు ఉత్పత్తిని అధికం చేయటమే ఈ నవకల్పనల లక్ష్యం. నిరపేక్ష మిగులు ఉత్పత్తికి శ్రామికులకు పని గంటల పరిమితి ఉంటుంది. టెక్నాలజీ అభివృద్ధి వల్ల శ్రామికుల ఉత్పాదక శక్తి పెరుగుతుంది. కనీస గంటలు స్థిరంగా వున్నా ఉత్పత్తి పరిమాణం పెరుగుతుంది. ఫలితంగా సాపేక్ష మిగులు ఉత్పత్తి పెరుగుతుంది. టెక్నాలజీలో నవకల్పనల వల్ల ఉత్పత్తిలో శ్రమ వాటా తగ్గుతూ ఉంటుంది.

ప్రస్తుతం ఉనికిలో వున్న నాలుగవ పారిశ్రామిక విప్లవ దశలో కంప్యూటర్లు, రోబోలు, ఆటోమేషన్ సర్వసాధారణం అయ్యాయి. కృత్రిమ మేధ (Artificial Intelligence), డ్రైవర్లు లేని కార్లు, డ్రోన్లతో వస్తువులను డెలివరీ చేయటం మొదలైన ప్రక్రియలతో ఉత్పత్తిలో శ్రమ అభావం అయినట్లు కనిపిస్తుంది. ఉత్పత్తి క్రమాన్ని మూలధనమే మొత్తంగా ఆక్రమించుకున్నట్లు కనిపిస్తుంది. ఉత్పత్తి క్రమం నుండి శ్రమను మూలధనం తరిమివేస్తున్నది. మూలధనం అంటే ప్రస్తుత పెట్టుబడిగా కనిపిస్తున్న గతంలోని శ్రమే. ఇది ప్రధానమైన అంశం అవుతున్నది. సజీవంగా వున్న ప్రస్తుత శ్రమ అప్రధానమవుతున్నది. ఈ ప్రక్రియ వల్ల శ్రామికులను అణచివుంచడం గుత్త పెట్టుబడులకు సులభమవుతుంది. హక్కుల గురించి, వేతనాల గురించి, పని పరిస్థితుల మెరుగుదల గురించి మాట్లాడే పరిస్థితి శ్రామికులకు ఒక వుండదు. దీనిని బలంగా కొనసాగించటానికి ప్రభుత్వాలు నయా ఉదారవాద విధానాలతో, వ్యూహాలతో సిద్ధంగా వున్నాయి.

ప్రతి దేశమూ ప్రజలందరికీ ఫలవంతమైన ఉద్యోగాలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను, సంపూర్ణ ఉద్యోగితను కల్పించే దిశగా సీరియస్‌గా కృషి చేయాలని అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ILO) రూపొందించిన 'ఎంప్లాయిమెంట్ పాలసీ కన్వెన్షన్-1964' బలంగా చెప్పింది. ఈ సంస్థ 'గ్లోబల్ కమిషన్ ఆఫ్ ఫ్యూచర్ ఆఫ్ వర్క్' అందరికీ గౌరవప్రదమైన, సుస్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించాలని చెబుతుంది. 2025లో సాధించవలసిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు కూడా ఇవే. నిజానికి సాంకేతిక నవకల్పనల వల్ల అందరికీ గౌరవప్రదమైన ఉపాధి లభించాలి, పేదరిక నిర్మూలన జరగాలి, సమ్మిళిత వృద్ధికి పునాదులు పడాలి. కానీ అందుకు విరుద్ధంగా నిరుద్యోగిత, పేదరికం పెరుగుతున్నాయి. అనియతీకరణ, కాంట్రాక్టు ఉద్యోగాలు ముమ్మరమైనాయి. దుర్భరమైన పని పరిస్థితులు బలపడ్డాయి. ఆదాయ, సంపద పంపిణీలలో అసమానతలు శిఖర స్థాయికి చేరుకున్నాయి.

టెక్నాలజీ అభివృద్ధి వల్ల నిరుద్యోగిత ఏర్పడే ప్రమాదాన్ని (Technological Un employment), 1930లలోనే జె.ఎం.కీన్స్ గుర్తించాడు. కానీ మెరుగైన టెక్నాలజీతో ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని, ఇటువంటి నిరుద్యోగిత తాత్కాలికంగానే వుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. టెక్నాలజీ ప్రగతిని లాభాలను పెంచుకొనే ప్రక్రియగా గుర్తించలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి క్రమంలో ఈ ప్రక్రియ బలపడుతుందని, ఫలితంగా నిరుద్యోగ సమస్య తీవ్రం అవుతూ శాశ్వతంగా వుంటుందని గుర్తించటంలో విఫలమైనాడు. గౌరవప్రదమైన ఉపాధులను కల్పించటంలో ఈ అభివృద్ధి క్రమం వైఫల్యం చెందిందని 1969లోనే పియర్‌సన్ ఆందోళన వ్యక్తం చేశాడు. నిరుద్యోగిత, పేదరికంతోపాటు అసమానతలు తీవ్రమవుతాయని, అభివృద్ధి రేటు కంటే మూలధనానికి లభించే ప్రతిఫలం రేటు అధికంగా వుండటమే ఇందుకు కారణమని 2014లో పికెట్టీ, 2017లో జోసెఫ్ స్టిగ్లిజ్ స్పష్టంగా చెప్పారు. ఆటోమేషన్ వల్ల ప్రజల సంపాదించే శక్తి అదృశ్యమవుతున్నదని స్టీఫెన్ హాకింగ్స్ విచారం వ్యక్తం చేశాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి క్రమంలో ఒకవైపు అపారమైన సంపద సృష్టించబడుతుంది. మరొకవైపు నిరుద్యోగ రిజర్వు ఆర్మీ శిఖర స్థాయికి చేరుకుంటుందని, ఇదే తీవ్రమైన ఆర్థిక సంక్షోభ స్థితి అని, ఈ స్థితిలో ఉత్పత్తి శక్తుల ఎదుగుదలకు, ఉత్పత్తి సంబంధాలు అనుకూలంగా వుండకపోవడంతో ఉత్పత్తి విధానంలో అస్థిరత తీవ్రమవుతుంది. శ్రామిక వర్గ విప్లవ పోరాటాలతో దోపిడీ వ్యవస్థ అంతం అవుతుందని ఒకటిన్నర శతాబ్దాల క్రితమే 'దాస్ క్యాపిటల్'లో కార్ల్ మార్క్స్ స్పష్టంగా అంచనా వేశాడు.

గ్లోబల్ నిరుద్యోగిత - ఆటోమేషన్

1991 నుండి 2019 మధ్యకాలంలో గ్లోబల్ నిరుద్యోగిత 69.73 శాతం పెరిగింది. 1991లో నిరుద్యోగుల సంఖ్య 68.08 మిలియన్లు వుండగా, 2019 నాటికి 111.08 మిలియన్లకు పెరిగింది. ఇందులో మహిళల నిరుద్యోగిత తీవ్రంగా వున్నది. 1991లో మహిళా నిరుద్యోగులు 43.97 మిలియన్లు. ఈ సంఖ్య 2019 నాటికి 74.63 మిలియన్లకు పెరిగింది. ఇందులో స్వయం ఉపాధి శ్రామికులు, సహాయకులుగా ఉన్న కుటుంబ శ్రామికులు బహుళకోణ దుర్భర స్థితికి బలవుతున్నారు. UNDP-2020 అంచనాల ప్రకారం 2018లో 107 వర్ధమాన దేశాలలో ఇటువంటి దుర్భర స్థితిలో బతుకుతున్నవాళ్ళు

1292 మిలియన్లు. ఇందులో సబ్ - సహారా ఆఫ్రికా వాటా 55 శాతం. కాగా, దక్షిణ ఆసియా వాటా 29.2 శాతం. యువత నిరుద్యోగం 10 నుండి 25 శాతం వున్న దేశాలు 1991లో 68 వుండగా, ఆ దేశాల సంఖ్య 85కు పెరిగింది.

The Mckinsey Global Institute, 2017 అంచనాల ప్రకారం ప్రపంచంలో ఆటోమేషన్ వల్ల 50 శాతం ఉద్యోగావకాశాలు తగ్గాయి. మధ్య, క్రింది స్థాయి నైపుణ్యాలలో ఆటోమేషన్ ప్రవేశించడం వల్ల శ్రమ మార్కెట్‌లో పోలరైజేషన్, వేతనాలలో అసమానతలు తీవ్రమైనాయి. ప్రపంచ ఆర్థిక వేదిక, ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ 2018 అంచనాల ప్రకారం 2022 నాటికి సంస్థ నిర్మాణం, సమాచారం, డేటా ప్రాసెసింగ్, ట్రాన్స్‌మిషన్ రంగాలలో ప్రస్తుతం వున్న యాంత్రీకరణ 42 శాతం నుండి 62 శాతానికి పెరుగుతుంది. ఈ నివేదిక ప్రకారమే ఎక్కువమంది పనిచేసే కమ్యూనికేటింగ్ పరస్పర చర్యలో 30 శాతం, సమన్వయపరచటం, అభివృద్ధిచేయటం, నిర్వహించటంలో 29 శాతం, రీజనింగ్, నిర్ణయాలు తీసుకొనే టాస్క్‌లలో 27 శాతం పనులలో ఆటోమేషన్ జరుగుతున్నది. వ్యవసాయరంగం, అనియత రంగం ప్రధానంగా వున్న దక్షిణ ఆసియా, సబ్ - సహారా ఆఫ్రికాలో సాంకేతిక ప్రగతి వల్ల 70 శాతం ఉద్యోగాలు కోల్పోవడం సంభవిస్తుందని మరొక అధ్యయనం స్పష్టం చేసింది. ప్రపంచ ఆర్థిక వేదిక, 2016లో భారీఎత్తున నిర్వహించిన సర్వే ప్రకారం ఆటోమేషన్, సాంకేతిక ప్రగతి వల్ల శ్రమ మార్కెట్ మార్పులలో విఘాతం కలుగుతుందని, అందువల్ల 5.1 మిలియన్లకు పైగా ఉద్యోగాలను కోల్పోవలసి వస్తుందని, సమీప భవిష్యత్తులో 7.1 మిలియన్ల ఉద్యోగాలు అదృశ్యం అవుతాయని అంచనా.

భారతదేశంలో నిరుద్యోగిత - ఆటోమేషన్

ఆటోమేషన్, సాంకేతిక ప్రగతి వల్ల మన దేశంలో అన్ని రంగాలలో శ్రమ సాంద్రత తగ్గిపోతున్నది. 2011-12 నాటికి ఉద్యోగ వ్యాకోచత్వం సున్నాకు పడిపోయింది. ఆ తరువాత ఉద్యోగ కల్పన కంటే ఉద్యోగాలు కోల్పోవటం అధికం కావటం తీవ్రమైంది. అంటే ఉద్యోగ వ్యాకోచత్వం ఋణాత్మకం అయిందన్నమాట. వృద్ధిలో దూసుకుపోతున్నట్లున్న రంగాలలో కూడా ఉద్యోగకల్పన శూన్యమే. ఉద్యోగాలు కోల్పోతున్న రంగాలలో ప్రధానంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, మైనింగ్, క్వారీయింగ్ కార్యకలాపాలు, తయారీ రంగం వున్నాయి. కోల్పోయిన ఉద్యోగాలలో 95 శాతం ఈ రంగాలలోనే. వ్యవస్థీకృత తయారీ రంగంలో ప్రధానంగా ఆటోమొబైల్, స్టీలు పరిశ్రమలలో సాంకేతిక ప్రగతి వల్ల ఉద్యోగాలు పోవటం అధికం అయింది. మెకిన్సే రిపోర్ట్, 2017 ప్రకారం భారతదేశంలో ప్రస్తుతం ఉనికిలో ఉన్న టెక్నాలజీతో 52 శాతం ఉద్యోగాలు ఆటోమేట్ అవుతాయి. 2013లో ఫ్రే, 2017లో ఆస్ బోర్న్ అధ్యయనాల ప్రకారం మన తయారీ రంగంలో 69 శాతం ఉద్యోగాలను ఆటోమేషన్ చేసే ప్రమాదం వున్నది. యువతలో నిరుద్యోగిత పెరుగుతున్నది. 2012లో 8.98 శాతం వుండగా, 2018 నాటికి 22.53 శాతానికి పెరిగింది. వేతనాలు తక్కువగా ఉండటం వల్ల బ్రతుకు భారమై, వలసలు తీవ్రమైనాయి. ఐఎల్ఓ అంచనాల ప్రకారం మన స్థూల దేశీయోత్పత్తిలో శ్రమ వాటా 2004లో 60.7 శాతం నుండి 2017లో 49 శాతానికి పడిపోయింది. అత్యధిక శ్రమసాంద్రత గల మన రెడీమేడ్ వస్త్రాల తయారీ రంగంలో రోబోల వాడకంతో 80 శాతం ఉద్యోగులను తరిమివేస్తారు. దక్షిణ ఆసియా దేశాలలో స్థూల దేశీయోత్పత్తిలో పారిశ్రామిక ఉద్యోగిత వాటా కనిష్టంగా వున్నది భారతదేశంలోనే. ఈ అంశాన్ని 1970లోనే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం'లో గణాంకాలతో నిరూపించారు. టెక్నాలజీలో వచ్చిన నవకల్పనలు మనదేశంలో పని పరిస్థితులను మెరుగు పరచలేదు, జీవన ప్రమాణాలు పెరగలేదు, గౌరవప్రదమైన ఉపాధుల గురించే మాట్లాడడానికి వీలులేదు. పైగా నిరుద్యోగిత, అల్పోద్యోగిత పెరిగింది. పారిశ్రామికీకరణ జరగకుండానే పారిశ్రామిక ఉపసంహరణ జరుగుతున్నది. జాతీయ గ్లోబల్ విలువ గొలుసులో తయారీ రంగం వాటా 2011-12లో 17.40 శాతం వున్నది. 2019-20లో 17.1 శాతానికి తగ్గింది. 2020-21లో ఈ వాటా 16.9 శాతానికి తగ్గింది. ఈ అంశం కూడా పారిశ్రామిక ఉపసంహరణనే సూచిస్తుంది. పైగా తయారీరంగం వల్ల ఉద్యోగ కల్పన జరగాలి. కానీ ఈ రంగం, ఉద్యోగాలను వినాశనం చేసే స్థాయికి దిగజారింది. 2010-11 నుండి 2017-18 మధ్యకాలంలో నికరంగా కోల్పోయిన ఉద్యోగాలు 14,70,000. ఉపాధి అవకాశాలు మెండుగా వున్న రెడీమేడ్ దుస్తులు, తోలు, పాదరక్షలు, వజ్రాలు, ఆభరణాల తయారీ రంగంలో స్థూలంగా కోల్పోయిన ఉద్యోగాలు 17,30,000. భారతదేశంలో ఉద్యోగాలు నష్టపోయే వృద్ధి స్థిరపడింది.

ఆసియా అభివృద్ధి బ్యాంకు, "Asia's Journey to Prosperity: Policy, Market, Technology over 50 years" నివేదికలో గున్నార్ మిర్డాల్ 'ఏషియన్ డ్రామా'లో చెప్పిన దానికి విభిన్నంగా, ఆసియా ఖండంలో గ్లోబలైజేషన్ వల్ల సంపద పెరిగిందని చెప్పింది. కానీ 2019లో దీపక్ నాయర్ మొదలగు వారి అధ్యయనం, "Asian Transformation: On Inquiry into the Development of Nations" విమర్శనాత్మకంగా పరిశీలించి, భారతదేశంలో పారిశ్రామికీకరణ జరగనే లేదు. సరికదా పారిశ్రామిక ఉపసంహరణ జరిగిందని తేల్చిచెప్పింది. తయారీ రంగంలోని వస్తూత్పత్తిలో దిగుమతుల మీద ఆధారపడటం విశృంఖలంగా పెరిగిందని, అత్యధిక శ్రమసాంద్రత కలిగిన వస్తువులతో పాటు టెలికాం, పవర్ పరికరాలు, ఔషధ తయారీలోని కీలకమైన దినుసుల విషయంలో కూడా దిగుమతుల మీదనే ఆధారపడటం స్పష్టంగా కనిపిస్తుంది. ఎగుమతులు కూడా టెక్నాలజీ - సాంద్రత గల వస్తువులు ప్రధానంగా ఉండటం వల్ల దక్షిణ ఆసియా దేశాలు, ప్రత్యేకించి భారతదేశం గ్లోబలైజేషన్ వల్ల నష్టపోయిందని ఈ అధ్యయనం వెల్లడి చేసింది.

గ్లోబల్ ఉత్పత్తి గొలుసు 4వ పారిశ్రామిక విప్లవ దశకు చేరుకున్నది. వర్ధమాన దేశాలలో, అందులో భాగంగా భారతదేశంలో మితిమీరిన టెక్నాలజీ వినియోగం వల్ల ఉద్యోగకల్పన అడుగంటింది. ఇక గౌరవప్రదమైన ఉద్యోగాలన్నది ఎజెండాలోనే లేకుండా పోయింది. వేతనాలను తక్కువ స్థాయిలో వుంచడానికి, శ్రామికులను గుప్పిట్లో పెట్టుకోవటానికి, అధిక జనాభా లేదా అధిక వేతనాలున్న దేశాలలో ఆటోమేషన్‌ను కేంద్రీకరించాలన్నదే గుత్త పెట్టుబడుల వ్యూహం. అందుకే ఆటోమేషన్‌కు భారతదేశం ప్రాధాన్యత గల దేశం అవుతుంది. మన పారిశ్రామిక రంగంలో కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, విడిభాగాలు, రవాణా పరికరాలు, యంత్రాలు మొదలైన పరిశ్రమలలో ఆటోమేషన్ శీఘ్రంగా పెరుగుతూ వున్నది.

2000 సంవత్సరం నుండి మనదేశంలో రోబోలను ఉపయోగించడం పెరుగుతూ వున్నది. ఆటోమోటివ్, మెటల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, రబ్బరు, ప్లాస్టిక్ పరిశ్రమలలో రోబోల వినియోగం అధికం అయింది. అంతర్జాతీయ ధోరణులకు అనుగుణంగానే మన దేశంలో పరిణామాలు జరుగుతున్నాయి. బహుళజాతి సంస్థల గుప్పిట్లో

వున్న మన ఆటోమొబైల్ పరిశ్రమలో ఆటోమేషన్ అత్యధిక స్థాయిలో వున్నది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పత్తి అవసరాల కోసం టాటా మోటార్స్ అనుబంధ సంస్థ అయిన TAL మాన్యుఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్ ద్వారా TAL Brabo రోబో రూపొందింది. దీనితో అధిక శ్రమసాంద్రత గల చిన్న పరిశ్రమల రంగంలో ఆటోమేషన్ వేగం పుంజుకుంటుంది. అంతే కాకుండా చౌక ధరకే చైనా రోబోలను సప్లై చేయటం మొదలైంది. ఆటోమేషన్ మరింత తీవ్రం కాగల ప్రమాదం వున్నది.

గుత్త పెట్టుబడులు - టెక్నాలజీ - శ్రామికుల విభజన

దోపిడీని నిరంతరం అధికం చేసుకోవటానికి గుత్త పెట్టుబడులకు టెక్నాలజీ ఒక శక్తివంతమైన సాధనం. ఇక ఆ దోపిడీ నిరాటంకంగా, ఎటువంటి వ్యతిరేకత లేకుండా సాఫీగా కొనసాగాలంటే శ్రామిక వర్గాన్ని విభజన, పునర్విభజనతో ముక్కలు ముక్కలు చేయాలి. శ్రామికుల మధ్య సాధారణ ప్రయోజనం వుండకూడదు. నిర్వహణ, ఫైనాన్స్ రంగాలలో అత్యున్నత స్థాయిలో ఉన్న ఉద్యోగులు, మేనేజర్లు, ఆఫీసర్ల ప్రయోజనాలు దోపిడీ వ్యవస్థ ప్రయోజనాలతో ముడిపడి వుంటాయని భావించే పరిస్థితులను కల్పించాలి.

ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీలో (ICT) వచ్చిన విప్లవాత్మక సాంకేతిక ప్రగతి వల్ల ఒకవైపు గ్లోబల్ మార్కెట్ కోసం పెద్దఎత్తున ఉత్పత్తి సాధ్యమైంది. మరొకవైపు గుత్త పెట్టుబడుల లాభం కోసం బహుళజాతి సంస్థలు సమర్థవంతమైన వ్యూహంతో ఉత్పత్తి ప్రక్రియను అడ్డంగా, నిలువుగా, సంక్లిష్టంగా అనుసంధానం చేస్తాయి. చౌక శ్రమ, వనరుల లభ్యత దృష్ట్యా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడానికి వివిధ దేశాలకు విస్తరిస్తాయి. ఉత్పాదకాలను సమీకరిస్తాయి. అధిక వేతనాలు వున్న అభివృద్ధి చెందిన దేశాలలో ఏఏ ప్రక్రియలు వుండాలో, చౌక శ్రమ లభించే వెనుకబడిన/ వర్ధమాన దేశాలలో ఏయే ప్రక్రియలు వుండాలో నిర్ణయిస్తాయి, స్థాపిస్తాయి. ఉదాహరణకు, ఆటోమొబైల్ పరిశ్రమలో కీలకమైన ఆటో ఉత్పత్తి, పరిశోధన, అభివృద్ధి, డిజైన్లకు సంబంధించిన హబ్‌ల కేంద్రీకరణ ఉత్తర అమెరికా, ఐరోపా, తూర్పు ఆసియా దేశాలలో వున్నది. ఇక విడిభాగాల తయారీ, చౌకశ్రమ లభించే వెనుకబడిన దేశాలలో వుంటుంది. గ్లోబలైజేషన్ వల్ల ఈ దేశాలకు కొత్త ఉద్యోగ అవకాశాలు వచ్చినట్లు కనిపిస్తుంది. కానీ అవి శాశ్వతంగా తక్కువ గ్రేడ్ పనులకే పరిమిత మవుతాయి.

ప్రపంచ శ్రామిక వర్గాన్ని నియంత్రిస్తూ, లాభాలను పెంచుకొని, ఆధిపత్యాన్ని బలపరుచుకోవాలన్న లక్ష్యంతో గుత్త పెట్టుబడులు అనుసరిస్తున్న ఈ వ్యూహం వల్ల అమెరికా, బ్రిటన్‌లలో 1982లోనే 1.2 మిలియన్ల ఉద్యోగాలను కోల్పోవటం జరిగింది. సామ్రాజ్యవాద దేశాలలో కార్మిక వర్గాన్ని నియంత్రించటానికి గుత్త పెట్టుబడులు అనుసరించే మరొక వ్యూహం ఏమిటంటే, తమకు అవసరమైన నైపుణ్యాలు తమ దేశాలలో చాలినంతగా లభించడం లేదని వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేసి వర్ధమాన దేశాల యువతను ఆకర్షించటం. ఇక వర్ధమాన దేశాలలో విదేశీ సంస్థల నేతృత్వంలో ఈ నైపుణ్యాలలో శిక్షణనిచ్చే కోచింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా ఏర్పడతాయి. లక్షల రూపాయల ఫీజులు కట్టి మన యువత ఇబ్బడి ముబ్బడిగా ఈ సెంటర్లలో చేరుతారు. వీసాలు సంపాదించి, విదేశాలకు పోవటానికి వెంపర్లాడటం; ఇది నిరంతరం కొనసాగుతూనే వుంటుంది.

టెక్నాలజీ వేగంగా మారుతూనే వుంటుంది. నిరంతరం కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాల్సిందే. పాత నైపుణ్యం శీఘ్రంగా పనికిరానిదవుతుంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న మన ఉన్నత విద్యా వ్యవస్థ ఇక కాలం చెల్లినదవుతుంది. అందుకే నూతన జాతీయ విద్యా విధానం, విదేశీ పెట్టుబడులతో, నిర్వహణ, ఫైనాన్స్, కృత్రిమ మేధ మొదలైన అంశాలకు సంబంధించి గ్లోబల్ ప్రమాణాలతో అతిపెద్ద విద్యా సంస్థలు కావాలంటుంది. ఆడంబరంగా, ఉన్నత ప్రమాణాలతో, అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ, ఎటువంటి ప్రభుత్వ నియంత్రణ లేకుండా స్వేచ్ఛగా ఇవి నడవాలంటుంది. అట్టడుగు వర్గం మాట పక్కకుపెట్టినా, మధ్యతరగతి వర్గానికి కూడా ఈ విద్య అందుబాటులోకి రాదు. ఉన్నతస్థాయి ఉద్యోగాలలో ఇక సంపన్నవర్గమే ఉంటుంది.

భారతదేశంలో అనియత రంగమే మెజారిటీ ప్రజలకు జీవనోపాధిని కల్పిస్తున్నది. దుర్భరమైన పనిపరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. టెక్నాలజీలో త్వరత్వరగా వస్తున్న మార్పులకు అనుగుణంగా, కోచింగ్ సెంటర్లలో నైపుణ్యాలు నేర్చుకుంటూ, ఉద్యోగం కోసం పరుగెత్తడం, అడ్వాన్స్‌డ్ నైపుణ్యాలతో గొప్ప ఉద్యోగాలు వస్తాయని ఆశించటం, ఈ పోటీ క్రమం నిరంతరం కొనసాగటం వల్ల శ్రామికులు పర్‌ఫెక్టుగా విభజించబడతారు.

కోవిడ్-19 విపత్తు సమయంలో లాక్‌డౌన్ తదనంతర పరిణామాల క్రమంలో కార్పొరేటు సంస్థలు డెలివరీ ఆధారిత గిగ్ సర్వీసుల కోసం డిజిటల్ ప్లాట్‌ఫాంలను సృష్టించాయి. బతకటం కోసం యువత ఈ ప్లాట్‌ఫాంల మీద పనుల కోసం ఎదురుచూస్తూ వుంటుంది. పని కొన్ని నిమిషాలు దొరకవచ్చు, గంటలు దొరకవచ్చు, అసలు పని వుండకపోవచ్చు. ఆహార పదార్థాలను, వస్తువులను వినియోగదారులకు డెలివరీ చేయడం వల్ల ప్రతిఫలం లభిస్తుంది. గిగ్ వర్కర్ల పరిస్థితి అనియతరంగం కంటే హీనం. ఏ హక్కులూ వుండవు. స్మార్ట్ ఫోన్‌తో ఈ శ్రామికులను మానిటర్ చేస్తారు. వినియోగదారులు, కార్పొరేట్ సంస్థలకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తారు. కోవిడ్ -19 బలోపేతం చేసిన ఆన్‌లైన్ ఆర్డర్లకు డెలివరీల కోసం కార్పొరేట్ సంస్థలు డిజిటల్ టెక్నాలజీతో రూపొందించిన గిగ్ వ్యవస్థ నిజంగా శ్రామికుల పాలిట శాపమే.

భారతదేశానికి విదేశీ టెక్నాలజీ బదిలీ అయిందా?

రెండవ పంచవర్ష ప్రణాళిక కాలం నుండి కూడా విదేశీ టెక్నాలజీతో పారిశ్రామిక అభివృద్ధిని సాధించాలన్న లక్ష్యంతో విదేశీ టెక్నాలజీ మిలాఖత్‌లను ప్రోత్సహించటం సీరియస్‌గానే జరిగింది. టెక్నాలజీ బదిలీ జరిగిన దాఖలాలు లేవు. కానీ లాభాలు, రాయితీలు, రకరకాల రెమ్యూనరేషన్‌ల పేరిట మన సంపద గుత్త పెట్టుబడులకు తరలివెళ్ళింది. అంతేకాకుండా మన పారిశ్రామిక రంగం మీద గుత్తపెట్టుబడుల ఆధిపత్యం స్థిరపడి, బలపడింది. ఈ అంశాన్ని ఖచ్చితమైన గణాంకాలతో 1970లలోనే 'తాకట్టులో భారతదేశం'లో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి నిరూపించారు.

ప్రపంచీకరణ ప్రవేశించిన 1990-91 నుండి విదేశీ టెక్నాలజీ బదిలీ లక్ష్యంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించటం తీవ్రం అయింది. విదేశీ టెక్నాలజీ మిలాఖత్‌లకు కొత్త కొత్త రాయితీలు, ప్రోత్సాహకాలు నిరంతరం ప్రకటించటం సాధారణమైంది. ఆధిపత్య దేశాలకు చెందిన వాణిజ్య దిగ్గజాలే ఈ టెక్నాలజీ యజమానులు. శక్తివంతమైన గుత్త పెట్టుబడులతో బేరమాడే శక్తి మన దేశానికి వుంటుందా? టెక్నాలజీ ఒప్పందంలోని అంశాలన్నీ ఆ కార్పొరేటు శక్తులకి అనుకూలంగా వుంటాయి. ఎంతకాలం, ఎవరు, ఎట్లా వుపయోగించాలి? ధరలు వాళ్లే నిర్ణయిస్తారు. టెక్నాలజీ బదిలీ వుండనే వుండదు. కానీ మన అధీనత్వం పెరుగుతూనే వున్నది. విదేశీ టెక్నాలజీ వల్ల దేశీయ టెక్నాలజీ ఎదగటానికి ఎటువంటి

అవకాశం వుండదు. రాయల్టీలు, చెల్లింపులు పేరిట మన మీద వ్యయ భారం అధికం, ప్రయోజనం రుణాత్మకం.

భారతదేశ "National Manufacturing Competitiveness Council (NMCC)కి చెందిన PM's Group నివేదిక, 2008 విదేశీ పెట్టుబడుల ద్వారా విదేశీ టెక్నాలజీ బదిలీ వల్ల టెక్నాలజీ వ్యయం చాలా ఎక్కువగా వుంటున్నదని, విదేశీ పెట్టుబడుల ద్వారా పాత టెక్నాలజీ వస్తున్నదని, భారతదేశ వనరులు, అవసరాలు, భవిష్యత్తు అభివృద్ధి, మొదలైన అంశాల ప్రస్తావన ఇందులో వుండదని, పైగా సంస్కరణల దశలో సరళీకృత విధానాల వల్ల టెక్నాలజీకి సంబంధించిన చెల్లింపుల పేరిట పెద్ద మొత్తంలో విదేశాలకు ప్రవహిస్తున్నదని చెప్పింది.

ప్రభుత్వ ఉన్నతస్థాయి కమిటీ ఈ విషయాలను స్పష్టంగా చెప్పిన తర్వాత కూడా ఆశ్చర్యకరంగా 2009లో విదేశీ టెక్నాలజీ ఒప్పంద సరళీకరణ విధానాన్ని ప్రకటించారు. ఇందులో టెక్నాలజీకి సంబంధించిన రాయల్టీ చెల్లింపు గరిష్ట పరిమితి 2 మిలియన్ల అమెరికన్ డాలర్లు (16 కోట్ల రూ॥లు) పరిమితిని తొలగించారు. మన దేశానికి ఏ ప్రయోజనం లేకున్నా ఈ మార్గం ద్వారా మన సంపద విదేశాలకు ప్రవహించటాన్ని మన ప్రభుత్వమే స్వయంగా విధానాలను రూపొందించి ప్రోత్సహించటం సీరియస్ వైరుధ్యమే. అందువల్లనే ఏప్రిల్, 2017లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్, రాయల్టీల ద్వారా విదేశాలకు పెరుగుతున్న మన సంపద ప్రవాహాన్ని పరిశీలించటానికి, Inter Ministerial Panelను ఏర్పాటు చేసింది. ఈ ప్యానల్ సంవత్సరానికి 100 బిలియన్ల అమెరికన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను ఏ విధంగా ఆకర్షించాలో చర్చించింది. కానీ, టెక్నాలజీ బదిలీ నిబంధనలు, వ్యయాలు, మన నియంత్రణకు సంబంధించిన విషయాలలో మౌనంగానే వున్నది. టెక్నాలజీ మీద విదేశీ నియంత్రణ మరింత బలంగా కొనసాగటాన్ని మన ప్రభుత్వమే స్వయంగా ప్రోత్సహిస్తున్నది. 2017లో 65 వర్ధమాన దేశాలు, విదేశీ పెట్టుబడులకు సంబంధించి రూపొందించిన 126 విధానాలలో 84 శాతం విదేశీ పెట్టుబడి దారులకే అనుకూలంగా వున్నాయి. సామ్రాజ్యవాద దోపిడీ శక్తులకు తమ సంపదను తరలించడం వర్ధమాన దేశాల ప్రభుత్వాలకు ఆమోదయోగ్యమే అన్నమాట.

2011లో ప్రకటించిన నేషనల్ మ్యానుఫ్యాక్చర్ పాలసీ, 2014లో ప్రకటించిన 'మేకిన్ ఇండియా' రెండింటిలో 2022 (ప్రస్తుత సంవత్సరం) నాటికి, స్థూల దేశీయోత్పత్తిలో తయారీరంగం వాటాను 25 శాతానికి పెంచటం, 100 మిలియన్ల ఉద్యోగాలను కల్పించటం లక్ష్యాలు. కాగా పారిశ్రామిక విధానం, 2017లో విదేశీ పెట్టుబడుల ద్వారా టెక్నాలజీ బదిలీ మీదనే ఫోకస్. రెండు దశాబ్దాల పాటు సంవత్సరానికి 100 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువ గల విదేశీ పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యం. తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, తద్వారా 100 మిలియన్ల ఉద్యోగాలను కల్పించడం, ప్రాధాన్యత లేని అంశాలైనాయి. అందుకే ప్రధానమంత్రి 70 వేల ఉద్యోగాలను కల్పించాడని, ఈ మధ్య మన ప్రసార మాధ్యమాలు గొప్పగా చెబుతున్నాయి. ఇక 100 మిలియన్ల ఉద్యోగాల ఊసే లేదు. విదేశీ పెట్టుబడుల వల్ల టెక్నాలజీ బదిలీ వుండదు. ఉద్యోగ కల్పన వుండదు సరికదా ఉద్యోగాలను కోల్పోవటం వుంటుంది. ఆ పెట్టుబడులు మన దేశీయ పరిశ్రమలను కొంటాయి. దేశీయ పెట్టుబడిని, దేశీయ టెక్నాలజీని తరిమివేస్తాయి. మన అధీనత్వం బలపడుతుంది. అయినా విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి వాణిజ్య సౌలభ్యం పేరిట విధానాలను రూపొందించి మన ప్రభుత్వం పకడ్బందీగా అమలుచేస్తుంది. అందులో భాగంగా 'పారిశ్రామిక సంబంధాల కోడ్, 2020' ప్రకటించారు. ఇది శ్రామికుల సమ్మెను రద్దు చేస్తుంది. శ్రామికుల బేరమాడే శక్తి మరింత దిగజారిపోతుంది. యజమానుల నియంత్రత్వాన్ని ప్రోత్సహిస్తుంది. పారిశ్రామిక సంబంధాలలో అంతిమ తీర్పు చట్ట ప్రకారం యజమానిదే అవుతుంది. ఇక సోషల్ సెక్యూరిటీ కోడ్, 2020 వివక్షాపూరిత ప్రయోజనాల నిరాకరణను చట్టబద్ధం చేస్తుంది. ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్, 2020 అనియత రంగంలో 13 గ్రూపులను రక్షణ పరిధి నుండి తొలగిస్తుంది. టెక్నాలజీ పేరుతో శ్రామికులను గుత్త పెట్టుబడులు అణిచివేస్తూ ఉంటే, ఆ అణిచివేతకు మన ప్రభుత్వం చట్టబద్ధ ప్రోత్సాహాన్నిస్తుంది.

సాధారణమైన పనులకు కూడా రోబోలను ఉపయోగిస్తూ ఆధిపత్య దేశాలు, ప్రధానంగా అమెరికాలో శ్రామికులను నోరెత్తకుండా చేస్తున్నాయి. ఉదాహరణకు, Baxter అనే పారిశ్రామిక రోబోను చిన్న పరిశ్రమలు కూడా ఉపయోగించగలవు. ఈ రోబోకు పనులు నేర్పటం సులభం. సగటు శ్రామికుని వార్షిక జీతంతో ఈ రోబోను కొనుక్కోవచ్చు. విధేయతతో, రాత్రనకా పగలనకా, అలుపనేది లేకుండా పనిచేస్తుంది. సెలవులు, వైద్య అవసరాలు వుండవు. జీతభత్యాలు, హక్కుల ప్రశ్న రాదు. రోబోలు, కంప్యూటర్లు చౌకగా లభించడం జరిగింది. శ్రమ సంపద అధికంగా వున్న భారతదేశం వంటి వర్ధమాన దేశాల్లో కూడా వేతనాల చెల్లింపుల కంటే రోబోల వల్ల వ్యయం తక్కువగా వున్నప్పుడు గుత్త పెట్టుబడులు చాలా సులభంగా మన దేశంలో రోబోల వాడకాన్ని పెంచుతాయి. శ్రామిక వర్గ ప్రజల బతుకును దుర్భరం చేస్తాయి.

ముగింపు

అభివృద్ధి చెందిన వెనుకబడిన దేశాలలో సామ్రాజ్యవాద దోపిడీ శక్తులు టెక్నాలజీ పేరిట శ్రమ విలువను, అవసరాన్ని తగ్గిస్తున్నాయి. శ్రామికవర్గం నుంచి, పీడితదేశాల నుంచి పిండుకుని తరలించిన అదనపు శ్రమవిలువనే కొంతవాటా ఈ టెక్నాలజీ అభివృద్ధికి కేటాయించి అదే పెట్టుబడితో తిరిగి శ్రామికుల బతుకుని అభావం చేస్తున్నాయి. ప్రభుత్వ విధానాలు, ఒప్పందాలు, అంతర్జాతీయ సంస్థల ఒత్తిడులు అన్నీ కూడా ఈ టెక్నాలజీ అమలుకు కావలసిన బలమైన ప్రాతిపదికను ఏర్పరచటానికి నిరంతరం కృషి చేస్తూనే వున్నాయి. తద్వారా తమ లాభాలను పెంచుకోవడం అన్నది తమ హక్కుగా భావిస్తున్నాయి. కానీ అపరిమితంగా, విశృంఖలంగా పెరుగుతున్న టెక్నాలజీ వ్యక్తులుగా, సంస్థలుగా ఆ పెట్టుబడిదారులకు తాత్కాలికంగా అదనపు లాభాలను పోగుపెట్టవచ్చును గానీ వ్యవస్థను అది మరింత సంక్షోభంలోకి నెడుతుంది. శ్రామికవర్గం కోల్పోతున్న పని గంటలు, తద్వారా కోల్పోతున్న వారి నిజవేతనాలు, తగ్గుతున్న విశాల ప్రజారాసుల కొనుగోలు శక్తి మరొకవైపు నుంచి పెట్టుబడిదారులకు వస్తువులను విక్రయించలేని తీవ్రమైన మాంద్యాన్ని సృష్టిస్తాయి. ఈ క్రమంలోనే తీవ్రమవుతున్న వ్యవస్థ అస్థిరతను, బలపడుతున్న సంక్షోభాన్ని దాచిపెట్టటానికి ఫైనాన్స్ క్యాపిటల్ ప్రయత్నిస్తూనే వున్నది. ఈ కారణంగానే మెజారిటీ ప్రజల బతుకును నాశనం చేసే ఈ వ్యవస్థ కొనసాగటం ఇక అసాధ్యం అవుతుంది. పీడిత ప్రజలందరినీ సంఘటితపరచడానికి ఇలాంటి సంక్షోభపు భౌతిక పరిస్థితులే సరియైన సందర్భాలు. ప్రజలందరూ గౌరవప్రదమైన ఉపాధితో, ఆత్మగౌరవంతో బతికే పరిస్థితులు ఏర్పడాలంటే బలమైన విప్లవ పోరాటాలే ఏకైక మార్గం. ★

హైతీ


నాలుగు సంవత్సరాలకాలంగా నిరంతరాయంగా సాగుతున్న ఆందోళనలు

విజయ్‌ప్రసాద్

2018 జులై నుండి హైతీలో ప్రారంభమైన నిరసనలపర్వం-కోవిడ్-19 విపత్తు పరిస్థితులతో సహా-ఆనాటి నుండి కొనసాగుతూనే వుంది. 2018 నాటి నిరసనకు ప్రధాన కారణమేమంటే, ఆ సంవత్సరం మార్చిలో వెనిజులా ప్రభుత్వం, అమెరికా తమపై విధించిన అన్యాయమైన ఆంక్షల కారణంగా, 'పెట్రోకరీబి' పథకం ద్వారా తక్కువ ధరలకు హైతీకి చమురును సరఫరా చేయలేకపోయింది. దీనితో చమురు ధరలు 50శాతం వరకు పెరిగాయి.

2018 ఆగస్టు 14న సినీ దర్శకుడు గిల్‌బర్ట్ మిరాబు జూనియర్ తన కళ్ళకు గంతలు కట్టుకొని, చేతిలో ప్లకార్డు పట్టుకున్న ఫోటో నొకదానిని ట్విటర్‌లో వుంచాడు. 'పెట్రోకరీబి' పథక నిధులు ఎక్కడికి వెళ్ళాయి?' అని దానిపై వ్రాసి వుంది. ఈ పథకం ద్వారా పొందే డబ్బును హైతీలోని ధనిక వర్గాలు లూటీ చేస్తున్నాయన్న దేశంలోని విస్తృత ప్రజానీకపు భావోద్వేగాన్ని ఆయన అందులో ప్రతిబింబించాడు. 1991లో ఒకసారి, 2004లో తిరిగి మరొకసారి రెండు సార్లుగా ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రెసిడెంట్ జీన్, బెర్‌ట్రాండ్ అరిస్టైడ్‌లకు వ్యతిరేకంగా జరిగిన సైనిక తిరుగుబాట్ల తర్వాత దేశంపై హైతీలోని ధనికవర్గాలకు మరింతగా పట్టు దొరికింది. చమురు ధరలు పెరగటంతో, అత్యధిక ప్రజానీకానికి జీవితం దుర్భరంగా మారిపోయింది. హైతీలోని ధనిక వర్గానికి వీరి నిరసనాందోళనలు రాజకీయ చట్టబద్ధత సంక్షోభాన్ని సృష్టించాయి.

ఇటీవలి వారాలలో హైతీ వీధులన్నీ సుదీర్ఘ ప్రదర్శనలు, రోడ్డు దిగ్బంధనాలతో నిండి వున్నాయి. బ్యాంకులు, క్యాథలిక్ సేవాసంస్థలతో సహ ప్రభుత్వేతర సంస్థలన్నీ నిరసనకారుల ఆగ్రహాన్ని చవిచూశాయి. నిరసనకారులు కొల్లగొట్టిన, తగులబెట్టిన భవనాలపై 'అమెరికా నశించాలి' అని రాశారు. 'సమూలంగా పెకిలించటం' అనే పదం 1986లో జరిగిన ప్రజాస్వామిక ఉద్యమాలలో మొదటిసారిగా ఉపయోగించగా, ఆ పదమే ఈ నిరసనలను నిర్వచించేదిగా ఉపయోగించారు. హైతీ మాజీ పోలీసు అధికారి జిమ్మి బెబ్క్యూ నాయకత్వంలోని 'జి-9' వంటి గుంపులపై నిరసనకారులు సాగించిన హింసను ప్రభుత్వం తప్పుపట్టింది. ఈ గుంపులు కూడా వాస్తవానికి నిరసనోద్యమంలో భాగంగానే వున్నప్పటికీ, ఆ స్ఫూర్తిని వారు ప్రదర్శించలేదు.



కార్యనిర్వాహక అధ్యక్షుడైన ఏరియల్ హెన్రీ నాయకత్వంలోని హైతీ ప్రభుత్వం ఈ సంక్షోభ సమయంలో చమురు ధరలు పెంచాలనే నిర్ణయించటం-రవాణా యూనియన్లనుండి తీవ్ర నిరసనలను వెను వెంటనే ఎదుర్కొంది. 'హైతీయన్ టైమ్స్'తో రవాణా యూనియన్ల అధ్యక్షుడు జాక్వస్ ఆండర్‌సన్ డిస్రోషెస్ మాట్లాడుతూ, "చమురు కంపెనీల కనుగుణంగా చమురు మార్కెట్‌ను సరళీకరించే విధానాలకు ప్రభుత్వం ముగింపు పలికి, వాటిని అదుపు చేయకుంటే, దానివలన ఎటువంటి ప్రయోజనమూ జరగదని" ప్రకటించాడు. అలాగే ఏరియల్ హెన్రీ చేపట్టిన చర్యలన్నీ అలంకారప్రాయమైనవేనని చెప్పాడు. సెప్టెంబర్ 2న ట్రేడ్ యూనియన్‌లన్నీ ఇచ్చిన సమ్మె పిలుపుతో హైతీ రాజధానీ నగరంతో సహ దేశమంతా స్థంభించింది.

ఈ క్రమంలో ఐక్యరాజ్యసమితి అవసరానికి మించివున్న తన సిబ్బందిని దేశం నుండి బయటకు పంపింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సమితి ప్రత్యేక ప్రతినిధి హెలెన్ లా లైమ్ మాట్లాడుతూ "హైతీ దేశం ఆర్థిక సంక్షోభం, ముఠాల సంక్షోభం మరియు రాజకీయ సంక్షోభాలతో" స్థంభించిపోయిందంటూ "అది మానవత్వపు విపత్తుగా పరిణమించిందని" పేర్కొన్నారు. హైతీలో ఐక్యరాజ్యసమితికి వున్న చట్టబద్ధత పరిమితం కాగా, హైతీలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని శాంతిస్థాపన కార్యక్రమాలను లైంగిక దుర్భాషల కుంభకోణాలు చుట్టుముట్టాయి.కాగా, ఐక్యరాజ్యసమితి హైతీ ప్రజల కందించిన రాజకీయ నిర్ణయం, పశ్చిమ దేశాల ప్రయోజనాలను కాపాడేదిగా, హైతీ దేశ అవినీతికర, సంపన్నవర్గాల ప్రయోజనాలను పరిరక్షించేదిగా వుంది.

అమెరికా, యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్యసమితి, ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ నాయకత్వంలోని ఆరు దేశాల 'కోర్‌గ్రూప్' ప్రస్తుత హైతీ అధ్యక్షుడు ఏరియల్ హెన్రీకి ఆ పదవిని కట్టబెట్టారు. అప్రతిష్టపాలైన అధ్యక్షుడు జొవెనల్ మొయిసీ హత్యకేసు ఇంకా అపరిష్కృతంగా వున్న తర్వాత హెన్రీ, హైతీ నూతన అధ్యక్షుడయ్యాడు. (కొలంబియా కిరాయి సైనికులు, హైతీలోని అమెరికన్లు మొయిసీని హత్యగావించారనే స్పష్టత మాత్రమే ఇప్పటికుంది.) ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి లా లైమ్ ఫిబ్రవరిలో భద్రతామండలిలో మాట్లాడుతూ దేశంలో అనుమానం, అపనమ్మకంతో పుకార్లు రాజుకొని ముమ్మరమైన ఒక పరిస్థితిలో "మొయిసీ హత్యపై జాతీయ దర్యాప్తు నిలిపివేయబడింది" అని ప్రకటించింది.

హైతీలో సంక్షోభం

హైతీ సమీప గతానికి చెందిన నాలుగు పరిణామాలను స్పష్టంగా చూడకుంటే ప్రస్తుత నిరసనలపర్వాన్ని అర్థంచేసుకోవటం సాధ్యం కాదు. **మొదటిది** - 2004లో అరిస్టైడ్‌కు వ్యతిరేకంగా జరిగిన రెండవ సైనిక తిరుగుబాటు తర్వాత దేశంలో అస్థవ్యస్థ పరిస్థితులేర్పడ్డాయి. 2010లో ఘోరమైన విపత్తు సృష్టించిన భూకంపం తర్వాత హైతీ రాజ్యాన్ని విడగొట్టటానికి దోవతీసింది.

ఆరు దేశాలతో ఏర్పడిన 'కోర్‌గ్రూప్' హైతీలోని ఈ గంభీరమైన సమస్యలను అవకాశంగా తీసుకొని దీనికి ప్రత్యామ్నాయ అనిపించే విధంగా విస్తృతస్థాయిలో పశ్చిమ దేశాలకు చెందిన ప్రభుత్వేతర సంస్థలను (ఎన్‌జిఒ) దేశంలోకి దింపింది. ప్రభుత్వ

సేవారంగాలలో 80శాతాన్ని ఎన్‌జిఓలు కైవసం చేసుకున్నాయి. భూకంపం తర్వాత దేశంలోకి సహాయ పునరావాసాల నిమిత్తం వచ్చిన నిధులలో పరిగణించదగిన మొత్తాలను వారు కొద్దికొద్దిగా విభజించుకున్నారు. అపరిష్కృత సంక్షోభ పరిష్కారానికి మిగిలిన కొద్దిపాటి సాధనాలతో ప్రభుత్వ సంస్థలు బలహీనంగా మిగిలిపోయాయి.

రెండవది - అన్యాయంగా వెనిజులాపై అమెరికా విధించిన ఆంక్షలు హైతీలోని పెట్రోకరీబి పథకాన్ని దెబ్బతీశాయి. ఈ పథకం ద్వారా రాయితీతో కూడిన చమురు అమ్మకాలతో 2008-2016 సం॥ల నడుమ 200 కోట్ల డాలర్ల లాభాన్ని హైతీ పొందగలిగింది. హైతీ దేశానికి చెందవలసిన ఈ లాభాలన్నీ ఉన్నత వర్గాలకు చెందిన బ్యాంకు ఖాతాల్లోకి చేరిపొయ్యాయి.

మూడవది - 2009లో దేశంలో కనీస వేతనాలను రోజుకు 5 డాలర్లుగా పెంచటానికి హైతీ పార్లమెంటు ప్రయత్నించింది. కానీ భారీ జౌళి, దుస్తుల పరిశ్రమలద్వారా అమెరికా ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆ బిల్లును నిరోధించింది. "హైతీ ప్రభుత్వం కనీస వేతనాన్ని పెంచాలనే (ప్రయత్నం" ఆర్థిక వాస్తవికతను పరిగణలోకి తీసుకోలేదు. అయితే "ఇది నిరుద్యోగులను, తక్కువ వేతన ఉద్యోగులను కేవలం బుజ్జగించటానికి చేసిన ప్రయత్నం మాత్రమే"నని పోర్టు-ఏ-ప్రిన్స్‌లో అమెరికా నిర్వహించే మిషన్‌కు మాజీ డిప్యూటీ చీఫ్ అయిన డేవిడ్ లిండ్‌వాల్ పేర్కొన్నాడు. అమెరికా ప్రభుత్వ ఒత్తిడితో ఈ బిల్లు వీగిపోయింది. "నిరుద్యోగులు, తక్కువ వేతనాలు పొందే ప్రజానీకమే" ప్రస్తుతం వీధుల్లోకి వచ్చి ఆందోళనలు నిర్వహిస్తుండగా, వీరినే కోర్‌గ్రూప్ 'గుంపులు' అని పేర్కొంటోంది.

నాల్గవ అంశం - ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న అధ్యక్షుడు ఏరియల్ హెన్రీ తాను వృత్తిరీత్యా రాజకీయ నాయకుడిని కాదని న్యూరో సర్జన్-డాకర్టునని చెప్పుకోవటానికి ఇష్టపడతారు. ఏమైనా, 2000 సంవత్సరం వేసవిలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అరిస్టైడ్ ప్రభుత్వాన్ని కూలదోయాలనే పిలుపునివ్వటానికి ఏర్పడిన 'కన్వర్జెన్స్ డెమోక్రటిక్' (సిడి) సమూహంలో హెన్రీ భాగస్వామ్యం కూడా వుంది. అమెరికా రిపబ్లికన్ పార్టీ రాజకీయ విభాగమైన ఇంటర్నేషనల్ రిపబ్లికన్ ఇన్‌స్టిట్యూట్ అలాగే అమెరికా ప్రభుత్వ 'నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమోక్రసి' సంస్థలు కలిసి ఈ 'సి.డి.'ని హైతీలో ఏర్పాటు చేశాయి.

2022 సెప్టెంబర్ 19న ఆందోళనకారు లందరినీ శాంతించవలసిందిగా కోరుతూ హెన్రీ పిలుపునిచ్చిన తర్వాత మరిన్ని బ్యారికేడ్ల నిర్మాణం జరిగి నిరసనోద్యమం మరింత ఉధృతమైంది. తిరుగుబాటుకు కేంద్రంగానున్న ఉత్తర కోస్తా ప్రాంతంలోని 'పాటిట్ గోవ్' అనే పట్టణంలో ప్రజల మాటలకు చెవిఒగ్గటంకంటే, వాషింగ్టన్ మాటలకే హెన్రీ చెవివొగ్గుతున్నాడు.

ఆక్రమణల అలలు

"మా భాగస్వాముల గట్టి మద్దతుతో మాత్రమే ఈ అనిశ్చిత పరిస్థితి పరిష్కార మౌతుంది" అని హైతీ విదేశాంగశాఖా మంత్రి జీన్‌విక్టర్ ఐక్యరాజ్యసమితి వేదికపై ప్రకటించాడు. హైతీలో చోటుచేసుకుంటున్న పరిణామాలను దగ్గరగా పరిశీలిస్తున్న అనేకమందికి "గట్టి మద్దతు" అంటే అర్థం పశ్చిమ దేశాలశక్తులను మరోసారి సైనిక జోక్యం చేసుకోమనటంగా అర్థమౌతోంది. వాస్తవానికి, 'వాషింగ్టన్ పోస్ట్' తన సంపాదకీయంలో "బయటశక్తుల బల ప్రయోగానికి" పిలుపినిచ్చింది కూడా.

హైతీ విప్లవం 1804లో ముగిసినప్పటి నుండి హైతీ ఎన్నో ఆక్రమణల అలలను ఎదుర్కొంటోంది. (1915 నండి 1930 వరకు దీర్ఘకాలం అమెరికా ఆక్రమణలో ఉండటంతో సహా, అమెరికా దన్నుతో 1957-1986ల మధ్య సాగిన నియంతృత్వ పాలన వరకు) ఈ దురాక్రమణలు ఈ ద్వీప దేశం సార్వభౌమత్వాన్ని నిరోధించటమేగాక, దేశ ప్రజల గౌరవ జీవన నిర్మాణాన్ని కూడా నిరోధించాయి. అమెరికా సైనిక బలగాల ఆధ్వర్యంలో కానీ లేదా ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ దళాల ఆధ్వర్యంలోకానీ సాగే మరో దురాక్రమణ, ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేస్తుంది.

ఐక్యరాజ్యసమితి సాధారణసభ సమావేశాల సందర్భంగా సెప్టెంబర్ 21న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాట్లాడుతూ "తమ ప్రభుత్వం పొరుగుదేశమైన హైతీతో కలిసి నిలుస్తామ"నే దాన్ని కొనసాగిస్తామని ప్రకటించాడు. అమెరికాలో హైతీకి చెందిన శరణార్థులు ఎదుర్కొంటున్న జాత్యహంకార దూషణలను నమోదుచేసిన నూతన అమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక దీని అర్థమేమిటో చాలా చక్కగా విశదపరుస్తుంది. అమెరికా, కోర్‌గ్రూపులు ఏరియల్ హెన్రీ వంటి వారి పక్షాన నిలవవచ్చు. అయితే వారు అమెరికా వలసవెళ్ళిన హైతీయులతో సహా హైతీ ప్రజల పక్షాన నిలబడేవిధంగా కనిపించటంలేదు.

నిరసనోద్యమంలోకి ట్రేడ్ యూనియన్ల ప్రవేశం గురించిన ప్రతిపాదనలు హైతీ ప్రజల ముందుకు వస్తున్నాయి. ఈ యూనియన్లు, విద్యార్థి సంఘాలతోసహా ప్రజా సంస్థలన్నీ కలిసి తిరిగి ముందుకు రాగలగటంద్వారా, వీధుల్లో నేటికీ వ్యక్తమౌతున్న ప్రజాగ్రహాన్ని క్రియాశీలకమైన మార్పుగా మలచగలగటం సాధ్యమౌతుంది.

('న్యూస్‌క్లిక్' 2022 సెప్టెంబర్ 28 నుండి అనువాదం)★


(చివరి పేజీనుండి) తెలియజేశారు. అమరుల స్ఫూర్తితో ప్రజాఉద్యమాన్ని నిర్మించడమే వారికిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ దంతులూరు వర్మ మాట్లాడుతూ, "ప్రజలు తీవ్రమైన కరువు, పేదరికం, పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతుంటే, ఈ సమస్యలను పరిష్కరించటానికి పూనుకోకుండా ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య గొడవలు పెడుతూ, కుల, మతాల మధ్య చిచ్చులు పెడుతూ, రాజకీయాలు చేయడానికి పాలకులు పూనుకుంటున్నారని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ధ్వంసం చేయడానికి రణస్థలం వద్ద కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం, భావనపాడు వద్ద పోర్టుల పేరుతో రైతులను భూముల నుండి ఖాళీ చేయిస్తున్నారని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో కనీసం ఐటిడిఏ పెట్టడానికి చర్యలు చేపట్టలేదని, రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలుచేయడానికి కూడా పాలకులు సిద్ధంగా లేరని విమర్శించారు.

ఇంకా ఈ సభలో స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు జి. అమ్మాజీ, పిడిఎస్‌ఓ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. గౌతమి, బొబ్బిలి పట్టణ కళాసీ సంఘం అధ్యక్షులు భోగాది అప్పలస్వామి, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు పి. పోలారావు, వివిధ ప్రాంతాల నుండి 300 మంది ప్రజలు హాజరై సభను విజయవంతం చేశారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) **పార్వతీపురం** మన్యంజిల్లా కమిటి ఆధ్వర్యంలో జిల్లా నాయకులు కా॥ ఎం. భాస్కరరావు అధ్యక్షతన సంఘం కార్యాలయంలో కామ్రేడ్స్ కోరన్న మంగన్నల వర్ధంతిసభ జరిగింది. ఈ సభలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పి. శ్రీనునాయుడు, జిల్లా అధ్యక్షులు కా॥ పూయక ముత్యాలు మాట్లాడుతూ అమరుల స్ఫూర్తితో సంఘటిత గిరిజనోద్యమ నిర్మాణానికి పూనిక వహించాలని పిలుపునిచ్చారు. సభ అనంతరం ప్రదర్శనగా గిరిజనుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఐటిడిఏ కార్యాలయం చేరుకొని అధికారులకు వినతిపత్రాన్ని ఇచ్చారు. ★

యెమెన్ దురాక్రమణ సైనిక దిగ్బంధం ఫలితంగా తీవ్రమైన దుస్థితి



యెమెన్ దేశ ప్రజలు తమ దేశ స్వతంత్రం కొరకు తమ దేశాన్ని ఆక్రమించిన దురాక్రమణశక్తులకు వ్యతిరేకంగా పోరాడు తున్నారు. సౌదిఅరేబియా నేతృత్వంలోగల దురాక్రమణ సంకీర్ణ సైనికశక్తులు యెమెన్ దేశాన్ని సముద్ర భూ, ఆకాశ మార్గాలను ముట్టడించి, దురాక్రమణ జరిపాయి; గత ఏడు సంవత్సరాలుగా బాంబుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. నివాస ప్రాంతాలపై అవి అప్పుడప్పుడు బాంబులు వేయటంవలన వేల సంఖ్యలో ప్రజలు ఆ బాంబుదాడులకు గురవుతున్నారు. నివాస ప్రాంతాలు, మార్కెట్లు, ప్రాథమిక సౌకర్యాలు విధ్వంసమవుతున్నాయి. ప్రత్యేకించి బాలలు యీ బాంబుదాడులకు బాధితులవుతున్నారు. ఈ రకంగా బాంబుల దాడులకు గురయిన వారి సంఖ్య 47,000కి చేరింది.

యెమెన్ యొక్క సముద్రపు ప్రాంతాన్ని దురాక్రమణ సైన్యాలు దిగ్బంధించి, ప్రజలకు అందవలసిన ఆహార, మందుల సరఫరాలు నిరోధించారు. 2021 నవంబరు 18 నాటికి అమెరికా-సౌదీ దురాక్రమణ సైన్యాల దాడులలో 3825 మంది మరణించారు. 2015 నుండి 2021 నవంబరు నెలాఖరు నాటికి 4175 మంది బాలలు యీ బాంబుదాడుల్లో తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికి యిలా గాయపడ్డ బాలలసంఖ్య 5,559 మందికి చేరింది. 30 లక్షలమందికి పైగా బాలలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. పౌష్టికాహార లోపంవలన రోజుకు 300 మందికంటే ఎక్కువ మందే చనిపోతున్నారు. 3000 మంది బాలలు పుట్టుకతో సంక్రమించే వ్యాధులకు గురయ్యారు.

ఈ దాడులలో 1,128 ప్రాథమిక పాఠశాలలు-విద్యాకేంద్రాలూ, 8326 వ్యవసాయ క్షేత్రాలూ, 136 క్రీడాకేంద్రాలూ విధ్వంస మయినట్లు, యుఎన్‌డిపి (ఐక్యరాజ్యసంస్థ అభివృద్ధి ప్రోగ్రాం సంస్థ) తన రిపోర్టులో యిటీవలనే ప్రకటించింది. ఈ దురాక్రమణ పరోక్ష యుద్ధపు బాధితులైన వారిలో 2,26,200 మంది ప్రజలు తిండిలేక ఆకలితోనూ, రోగాల వాతబడి, మందులు-వైద్యసౌకర్యాలు అందక మరణించారు. ఆహారపు కొరతవలన 5 లక్షల మంది బాలలు ప్రమాదంలో వున్నట్లు ఆ రిపోర్టు పేర్కొంది. ఆ రిపోర్టు ప్రకారం యెమెన్ దేశపు ఉత్తరరాష్ట్రమైన, మారుమూలపు అల్-ముఘరాబా జిల్లాలోని కుటుంబాల వారు ఆకలిబాధలు తాళలేక ఏదోవిధంగా ప్రాణాలు నిలబెట్టుకోవటం కోసం, స్థానికంగా పెరిగే ఒక రకమైన చెట్ల ఆకులను (ఇవి చేదుగా వుంటాయి) ఉడకబెట్టుకొని, గుజ్జుగా చేసుకొని, ఆ గుజ్జును తింటున్నారు. పసిపిల్లల తల్లులైతే, తిండిలేక ఆకలితో మాడటంవలన రొమ్ములు ఎండి పోయి, పిల్లలకు పాలివ్వలేకపోతున్నారు.

ఇంతటి దారుణం జరుగుతున్నా నిరంతరం "మానవహక్కులను" పరిరక్షించే యోధులుగానూ, యుద్ధనేరాలపై దర్యాప్తులు జరిపి నేరస్థులను శిక్షిస్తామని ఘనంగా ప్రకటించే పాశ్చాత్యదేశాలైన స్వీడన్, జర్మనీ, బెల్జియం, నెదర్లాండ్స్‌లాంటి దేశాలు కానీ, యీరకంగా ఒక దేశాన్ని చుట్టుముట్టి, అన్నిరకాలా దిగ్బంధించి, ఆ దేశపు ప్రజలకు ఆహారం, మందులూ, తదితర సదుపాయాలూ అందకుండా, వారిని పరోక్షంగా చంపివేస్తున్న యీ దారుణాన్ని గమనించనట్లే, ముఖం ప్రక్కకు తిప్పి వ్యవహరిస్తున్నారు. ఇక పశ్చిమదేశాల కార్పొరేటు మీడియా యీ దారుణానికి సంబంధించిన వార్తలను ప్రకటించదు-ప్రకటించటల్లేదు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో, ఉక్రెయిన్‌లోని శరణార్థుల విషయంపై ఎంతగానో తన వ్యతిరేకతను ప్రకటించే ఐక్యరాజ్యసమితి, యెమెన్‌లోని యీ ప్రజల దారుణ స్థితిని గురించి ఒక్క మాట అనదు. యెమెన్‌ను నిర్బంధించిన దురాక్రమణ సైనిక శక్తులను ప్రక్కకు తప్పించి, తిండి-మందులు లేక అలమటించి, దారుణంగా మరణిస్తున్న యెమెన్ ప్రజలకు ఆహారం-మందులు సరఫరా చేసే ప్రయత్నాలను చేయదు. నిరంతరం "మానవహక్కుల" గురించి, యితర దేశాల్లో (తనకు నచ్చని) మానవహక్కుల ఉల్లంఘన గురించీ గగ్గోలుపెట్టే అమెరికా సామ్రాజ్యవాదం యీ దారుణాల గురించి ప్రస్తావించనే ప్రస్తావించదు.

'అన్సారుల్లా సంఘటన' నాయకత్వాన యెమెన్ ప్రజలు యీ చుట్టవేత, నిర్బంధాలకు వ్యతిరేకంగా స్వతంత్రంకోసం పోరాడుతున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో సంభవిస్తున్న భౌగోళిక-రాజకీయ పరిస్థితులు అమెరికన్ సామ్రాజ్యవాదం -యూరోపియన్(పశ్చిమ) దేశాలూ విధించిన ప్రపంచ వ్యవస్థను బ్రద్దలుకొట్టే పరిణామాలవైపు సాగుతున్నందువలన, యీ పరిస్థితులైనా ప్రపంచంలో మార్పులు తీసుకువచ్చి, తమకు మేలు చేస్తుందనే తమ స్వంతంత్రసాధనకు మార్గం కల్పిస్తుందనే ఆశతో యెమెన్ దేశ ప్రజలున్నారు.

ప్రస్తుతం ఇరాన్‌లాంటి కొద్ది దేశాలు మాత్రమే యెమెన్ దేశంలో స్వాతంత్ర్యంకోసం జరిగే పోరాటానికి మద్దతును యిస్తున్నాయి.

యెమెన్ ప్రజలను యింతటి దారుణ, తీరని దురవస్థకు గురిచేసిన సైనిక దురాక్రమణశక్తుల దుర్మార్గాన్ని 'జనశక్తి' ఖండిస్తోంది!

(లేబర్ పార్టీ ఆఫ్ ఇరాన్ యొక్క అధికార పత్రిక 'తౌఫాన్' జూన్, 2022 సంచికలో ప్రచురించిన వివరాల ఆధారంగా) ★

ఇరాన్

దుస్తుల నిబంధనలను ధిక్కరిస్తూ మహిళల నిరసనాందోళనలు

ఇరాన్ 'నైతిక పోలీసులు' నిర్బంధంలోకి తీసుకున్న ఒక యువతి మరణించటంతో ఇరాన్‌లో నిరసనలు తీవ్రమయ్యాయి. సెప్టెంబర్ 16న జరిగిన ఈ ఘటనతో ఇరాన్ వ్యాపితంగా ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు వ్యాపించాయి. కుర్దిష్ మూలాలు కలిగిన 22 సం॥ల మాషా అమిని కుర్దిస్థాన్‌లోని వాయవ్య ప్రాంతానికి చెందిన మహిళ. ఆమె దేశ రాజధాని నగరం టెహరాన్‌ను సందర్శించటానికి రాగా, నైతిక పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. 'అసభ్యకర వేషధారణ' కలిగివుందనే నేరారోపణపై 'ఘతాష్ట్-ఏ-అషబ్'గా పిలవబడే ఈ నైతిక పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజులపాటు కోమాలోవున్న తర్వాత ఆమె ఆసుపత్రిలో మరణించారు. అరెస్ట్‌చేసిన వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించామని చెబుతున్నారు.

వందలాది మంది నిరసనకారులు– ప్రత్యేకించి మహిళలు వెంటనే వీధుల్లోకి వచ్చారు. భద్రతాబలగాల, ప్రభుత్వ పోలీసు దళాలతో తలపడే క్రమంలో మరి కొందరు ఆందోళనకారులు మరణించారు. నార్వేకి చెందిన ఇరాన్ హ్యూమన్‌రైట్స్ (ఐహెచ్ఆర్) అనే ప్రభుత్వేతర సంస్థ కథనం ప్రకారం, మాషా అమిని మరణానంతరం దేశవ్యాపితంగా పెల్లుబికిన, వారాల తరబడి సాగుతోన్న నిరసనాందోళనల్లో 100 మంది పైగా హత్య గావించబడ్డారు.

హిజాబ్ చట్టం, నైతిక పోలీసు

అనేకమంది ఇరాన్ ప్రజలు ప్రత్యేకించి పట్టణ ప్రాంతాలలోని ప్రజలు హిజాబ్‌ను చాలాకాలం క్రితమే తిరస్కరించారు. ఇటీవలి సంవత్సరాలలో, పెద్దసంఖ్యలో ఇరానీ మహిళలు హిజాబ్ నియమాలను పరిహసించటం ప్రారంభించారు. కాగా 'చెడు హిజాబ్' నియమాలను కొన్నింటిని ప్రత్యేకించి ఎంచుకొని నైతిక పోలీసులు వాటిని అమలుచేయటం ద్వారా మహిళలను నిరోధించబూనుకున్నారు. గతంలో దుస్తుల నిబంధనలను నిరసించిన మహిళపట్ల మరింత కఠినంగా వ్యవహరించటమేగాక జైలు శిక్షలను కూడా విధించారు.

ప్రస్తుత నిరసనలు ప్రాథమికంగా నైతిక పోలీసుల చర్యలపైనా, దుస్తుల నిబంధనలను అమలుచేయ బూనుకునే వారి ప్రయత్నాలపైన కేంద్రీకరించబడి సాగాయి. మాషా అమిని మరణం తర్వాత మొట్టమొదటి మహిళల భారీ నిరసన ప్రదర్శన టెహరాన్‌లో జరిగింది. నివేదికల ప్రకారం, 1979లో ఇస్లామిక్ రిపబ్లిక్ స్థాపన తదనంతరం దుస్తుల నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిన అతిపెద్ద ప్రదర్శన ఇది. నిరసనల ప్రారంభ దినాలలో కొందరు మహిళలు ధైర్యంగా ముందుకు అడుగువేసి తలకు ధరించే తమ వస్త్రాలను అధికారులందరూ చూస్తుండగానే తగలబెట్టగా మరికొందరు టెలివిజన్ కెమెరాల సాక్షిగా తమ జుట్టును కత్తిరించుకోవటం జరిగింది.

ఇరాన్ మహిళల జీవితం, స్వాతంత్ర్యాల కోసం వారు చేస్తున్న ఆందోళనలకు ప్రపంచ ప్రజానీకమంతా సంఘీభావం తెలపాలి. అదే విధంగా ఇరాన్ ప్రభుత్వం మహిళలపై సాగిస్తున్న ఘోరమైన చర్యలను కూడా ఖండించాలి. ★

పాకిస్తాన్

రైతాంగ ఆందోళన

పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో సెప్టెంబర్ 28న ప్రారంభించి దాదాపు వారం రోజుల పాటు సాగించిన బైఠాయింపు, ధర్నాల అనంతరం, పాకిస్తాన్ ప్రభుత్వం దిగివచ్చి వారి డిమాండ్లపట్ల సానుకూలంగా స్పందించటంతో అక్టోబర్ నాల్గవ తేదీ నుండి తలపెట్టిన ఆందోళనను వారు విరమించు కున్నారు.

సెప్టెంబర్ 21వ తేదీనుండి పదుల వేల సంఖ్యలో రైతాంగం రాజధానీ నగరానికి రెండుసార్లుగా వచ్చారు. అయినా, పరస్పరం అంగీకృతమైన తమ అభ్యర్థనలను పాలనా యంత్రాంగం పట్టించుకోలేదు. పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రం నుండి 25వేల మందికి పైగా రైతులు వారంపాటు సాగిన ఈ నిరసనల్లో పాల్గొన్నారు. కిసాన్ ఇత్తెహాద్ పాకిస్తాన్ (కెఐపి)పేరున వివిధ రైతాంగ సంఘాలన్నీ ఒక దగ్గరకు వచ్చి ఈ ఆందోళనను సాగించారు. వారి డిమాండ్లు:

1. యూరియా, డిఏపిలతో సహా ఎరువుల ధరలను తగ్గించాలి.
2. ఇటీవల పెంపు చేసిన గొట్టపుబావి విద్యుత్తు ధరను యూనిట్ 36 రూ॥ల నుండి పాత ధర అయిన యూనిట్‌ను 5.35కు తగ్గించాలి.
3. 40 కేజీల గోధుమ బస్తాకు కనీస మద్దతు ధరను 2400 రూ॥లుగాను, చెరకుకు 280 రూ॥లుగాను నిర్ణయించాలి.
4. పురుగుమందుల ధరలను తగ్గించాలి.
5. ఎరువుల బ్లాక్‌మార్కెట్‌ను నిరోధించటానికి గట్టి చర్యలు చేపట్టాలి.
6. తక్కువ వడ్డీరేట్లకు రైతాంగానికి రుణ సౌకర్యం కల్పించాలి.
7. ఇంధన సర్దుబాటు ఛార్జీల(ఎఫ్ఏసి)పేరున యూనిట్‌కు రూ॥11.37 పైసల పెంపును రద్దుచేయాలి.
8. పంటకాల్వలలో నిరోధాల్ని తొలగించి, వ్యవసాయానికి వెంటనే నీటిని సరఫరా చేయాలి.

ఈ సమస్యలన్నింటినీ పరిగణలోకి తీసుకొని రానున్న రోజులలో ప్రభుత్వం రైతాంగానికి ఓ ప్రత్యేక ప్యాకేజీ అందిస్తామని ప్రకటించింది.

వ్యవసాయం రాష్ట్రాల అంశమైనందున, సమాఖ్య ప్రభుత్వం రైతాంగానికి సంబంధించిన కొన్ని అంశాలలో జోక్యం చేసుకోలేకపోయినప్పటికీ విద్యుత్తు, ఎరువుల ధరల వంటి వాటిని సమాఖ్య ప్రభుత్వమే అదుపుచేస్తుంది.

రైతాంగం లేవనెత్తిన డిమాండ్లలో అత్యధికం కొత్తవి కాదు. విద్యుత్తు ధరలు, కనీస మద్దతు ధర, కాలువ నిరోధాలు, విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు వంటివి ప్రతి సంవత్సరమూ ముందుకొచ్చే సమస్యలే. రైతాంగం ఆందోళనలు సాగించటం, ప్రభుత్వాలు ప్యాకేజీలు ప్రకటించటం జరుగుతోంది. అయితే అత్యధిక వాగ్దానాలు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి. అయితే ఈసారి భారీసంఖ్యలో సమీకృతులై, ఢిల్లీలో రైతాంగం సాగించిన ఆందోళన తరహాలోనే రాజధానీ నగరంలో బైఠాయించి రైతులు ఆందోళన సాగించారు. విద్యుత్తు ఛార్జీలు పెంచాలనే, సబ్సిడీలను తగ్గించాలనే ఐఎంఎఫ్ వత్తిడుల నడుమ, ప్రభుత్వం తన వాగ్దానాలను ఏమేరకు నెరవేరుస్తుందో, నెరవేర్చకుంటే భారీ రైతాంగ సమూహం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే. (పాకిస్థాన్‌లో ఐఎంఎఫ్ పాత్ర గురించిన వ్యాసం 2022 'మే' 'జనశక్తి' సంచికలో అందించాం) ★

ఫ్రెంచ్ వలసవాద వ్యతిరేక పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ

భారత ఉపఖండంలో ఫ్రెంచి వలసవాద విస్తరణ సుమారు 1664 సంవత్సరం నుండి ప్రారంభమైందని చెప్పవచ్చు. ఆనాటి ఫ్రెంచ్ దేశ పాలకుడైన లూయిస్-14 కాలంలో మంత్రిగా వున్న కోల్బెర్ట్ నేతృత్వంలో ఫ్రెంచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రారంభించబడింది. 1667వ సంవత్సరంలో ఒక ఫ్రెంచ్ గవర్నర్ సూరత్ పట్టణం చేరి తమ మొదటి వ్యాపార కేంద్రాన్ని స్థాపించాడు. 1669వ సంవత్సరంలో మచిలీ పట్టణం (ఆం.ప్ర)లో ఫ్యాక్టరీ ప్రారంభించ బడింది. 1673వ సంవత్సరంలో కలకత్తా సమీపంలోని చాదర్ నాగోరెను స్వాధీనం చేసుకున్నారు. అదే సంవత్సరంలో బీజాపూర్ సుల్తాన్ నుండి పాండిచ్చేరిని తమ ఆధీనంలో తెచ్చుకుని 1674 సం॥లో పాండిచ్చేరి కేంద్రంగా తమ వలసను స్థాపించారు. 1741 సం॥ కల్లా యానాం, మాహె, కారైకాల్‌లను ఆధీనంలోకి తెచ్చుకున్నారు. 1769 సం॥లో ఫ్రెంచ్ ప్రభువు ఫ్రెంచ్ ఈస్ట్ ఇండియా కంపెనీని రద్దు చేసి భారత ఉపఖండంలో వలస ప్రాంతాలను తన పరిపాలనలోకి తీసుకున్నాడు.

1816 సం॥లో నెపోలియన్ బోనాపార్టీ ఓడిపోయిన నాటికి భారత ఉపఖండంలో i పాండిచ్చేరి ii చందర్ నాగోరె iii కారైకాల్ iv మాహె v యానాం vi మచిలీపట్నం, కోజికోడ్ మరియు సూరత్‌లలో స్థావరాలు ఫ్రెంచి వలసలుగా వున్నాయి.

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఫ్రెంచి ఇండియా నాయకత్వంలో వివిధ పరిశ్రమల కార్మికులు ట్రేడ్ యూనియన్లలో సంఘటితమై తమ కోర్కెల సాధనకు పోరాడారు. వివిధ తరగతుల ప్రజలను వాళ్ళ సమస్యల పరిష్కారానికి సమీకరించి, వలసవాద వ్యతిరేక పోరాటం ప్రారంభించారు. ఫ్రెంచి వలసవాద ప్రాంతం కమ్యూనిస్టుల చేతుల్లోకి పోతుందనే భయంతో ఫ్రెంచి ప్రభుత్వం తన స్వాధీనంలోని వలసను భారత ప్రభుత్వానికి అప్పగించింది.

మచిలీపట్టణం, కోజికోడ్, సూరత్ స్థావరాలను అక్టోబర్, 1947 సం॥లో అప్పగించారు.

మే 2, 1950లో చందర్ నాగోరెను అప్పగించగా అది అక్టోబర్ 2, 1954 నాడు పశ్చిమ బెంగాల్‌లో భాగమైంది. పాండిచ్చేరి, యానాం, మాహె, కారైకాల్‌లను నవంబర్ 1, 1954 సం॥ వదులుకున్నారు. 1962 సం॥లో భారత్, ఫ్రెంచి ప్రభుత్వాలు ఈ వలస ప్రాంతాల బదిలీ ప్రక్రియను ఒక ఒడంబడికతో ఆమోదించడంతో, భారత ఉపఖండంలో 300 సంవత్సరాల ఫ్రెంచి వలసపాలన ముగిసింది.

ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు

భారత ఉపఖండంలో ఫ్రెంచ్ వలస వాదం, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని ట్రేడ్ యూనియన్‌ల ద్వారా కార్మిక వర్గ పోరాటాల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్నది. ఫ్రెంచ్ గవర్నర్ తమ వలస ప్రాంతాలలో తీవ్ర నియంతృత్వాన్ని చలాయించినప్పటికీ, ఆనాటి దారుణమైన పని పరిస్థితులు కార్మికవర్గం సంఘటితమయేందుకు పురిగొల్పాయి. పాండిచ్చేరిలో ట్రేడ్ యూనియన్‌ల స్థాపనలో కామ్రేడ్ వరదరాజులు కైలాశ సుబ్బయ్య కీలక పాత్ర పోషించాడు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఫ్రెంచ్ ఇండియాకు ఆయన ప్రధాన కార్యదర్శిగా పనిచేసేవారు.

పాండిచ్చేరిలో టెక్స్‌టైల్ కార్మికుల నివాస ప్రాంతాలైన ముదలియార్ పేట, అరియన్ కుప్పం, ఔలగరెట్‌లలో మొదటగా ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు మొదలయ్యాయి. అతి తక్కువ వేతనాలతో రోజుకు 12 నుండి 14 గంటల పాటు ఆ కార్మికులు పనిచేస్తూ దారుణ దోపిడీకి గురయ్యేవారు. అదే సమయంలో బ్రిటిష్ ఇండియాలో పనిగంటలు 10 గంటలలోపే ఉండేవి. బడా కంపెనీలైన రోడిర్, సావన, గెబెల్స్‌లలో కార్మికులను డిపార్ట్మెంటల్ గ్రూపులుగా సంఘటితం చేశారు.

ఫిబ్రవరి 4, 1935న ఈ క్రింది డిమాండ్లతో సావన మిల్లు కార్మికులు సమ్మె ప్రారంభించారు.

సమ్మె డిమాండ్లు

1) పని దినాన్ని 10 గంటలకు పరిమితం చేయాలి.
2) వేతనాలను 3 అణాల నుండి 6 అణాలకు పెంచాలి.
3) పధ్నాలుగు సంవత్సరాల పిల్లలను పనిలో పెట్టుకోవడాన్ని నిషేధించాలి.
4) అర్ధ వేతనంతో కూడిన నెల రోజుల ప్రసూతి సెలవులను మహిళలకు ఇవ్వాలి.
5) రాత్రి షిఫ్టులలో మహిళలను పని చేయించడం నిలిపి వేయాలి.

ఆ సమ్మె 84 రోజులపాటు సాగింది. ఫ్యాక్టరీకి తాళాలు పడ్డాయి. చిట్టచివరకు యాజమాన్యం దిగొచ్చి ఏప్రిల్ 29, 1935న నాయకులను చర్చలకు పిలిచింది. పని గంటలను 10 గంటలకు తగ్గించడం, వేతనాలను 6 అణాలకు పెంచడం, అర్ధ వేతనంతో నెలరోజులు ప్రసూతి సెలవులు ఇవ్వడానికి అంగీకరించింది.

సావన కార్మికుల సమ్మె విజయం తర్వాత జూన్ 1935 సం॥లో బ్రిటిష్ ఇండియాలో మొట్టమొదటిసారిగా టెక్స్‌టైల్ కార్మికుల బహిరంగ సభ నిర్వహించారు. ఆ సభ ఫ్రెంచ్ ప్రభుత్వం ముందు ప్రధానంగా రెండు డిమాండ్లను ఉంచింది. 1) ఫ్రెంచ్ ఇండియాలో ట్రేడ్ యూనియన్‌లకు చట్టబద్ధత కల్పించాలి. 2) ఐఎల్ఓ నిబంధనలకు ఫ్రెంచ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కాబట్టి, కార్మిక చట్టాలు చేయాలి. ఐఎల్ఓ వద్ద కూడా ఒత్తిడి తేవడంతో ఆ డిమాండ్లలో కొన్నిటికి అంగీకరించిన ఫ్రెంచ్ ప్రభుత్వం, ట్రేడ్ యూనియన్‌లకు చట్టబద్ధత కల్పించడానికి మాత్రం ఒప్పుకోలేదు.

కార్మికుల పోరాటాలకు తలొగ్గిన ఫ్రెంచ్ ప్రభుత్వం 12 సం॥లలోపు పిల్లలతో పనిపై నిషేధం, వారానికి ఒక రోజు సెలవు, పండుగ సెలవులు, మహిళలకు 8 వారాలు వేతనంతో కూడిన సెలవులు, 15 సం॥లలోపు మగ పిల్లలు, 18 సం॥లలోపు ఆడపిల్లలకు పనిగంటలపై 10 గంటల పరిమితి, ఫ్యాక్టరీలో భద్రత, ఆరోగ్య ప్రమాణాల పాటింపులను నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జులై 1936 సం॥లో ట్రేడ్ యూనియన్ హక్కులు కల్పించాలని కోరుతూ ఎలీ, రోడిర్, సావనలకు చెందిన .కార్మికులు పరిశ్రమల ప్రాంగణంలో బైఠాయింపు (సిట్-ఇన్) సమ్మె పోరాటం మొదలెట్టారు. జులై 29న కామ్రేడ్ వరదరాజులు సుబ్బయ్య రహస్యంగా మిల్లు ప్రాంగణంలోకి ప్రవేశించి సమ్మె చేస్తున్న కార్మికులనుద్దేశించి ప్రసంగించాడు. ఆ మరుసటి రోజే ఫ్రెంచ్ ప్రభుత్వం సమ్మె చేస్తున్న కార్మికుల మీద ప్రత్యక్ష చర్యకు పోలీసులను ఆదేశించింది. పోలీసుల కాల్పులలో 12 మంది కార్మికులు అమరులయ్యారు. నేరపూరిత కుట్రకు పాల్పడ్డాడనే అభియోగాన్ని మోపి కామ్రేడ్ సుబ్బయ్యపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు.

ఫ్రెంచ్ పార్లమెంట్‌లో ప్రకంపనలు

ఈ కాల్పుల సంఘటనను ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీ ఫ్రెంచ్ పార్లమెంటులో లేవనెత్తింది. బ్రిటిష్ ఇండియాలోని ట్రేడ్ యూనియన్ నాయకులను కలవడానికి ఒక ప్రతినిధిని పంపారు. ఆగష్టు 19న ఫ్రెంచ్ గవర్నర్‌తో సమావేశానికి సమయం నిర్ణయించారు.

కార్మికుల డిమాండ్లలో ఐదింటికి గవర్నర్ ఆమోదం తెలిపాడు. i. కార్మికులపై కక్ష సాధింపు చర్యలుండవు. ii. అంగీకరించిన నిబంధనలను వెంటనే అమలులోకి తేవడం. iii. ప్రభుత్వం - ఉద్యోగుల మధ్య ఫ్రెంచ్ ఇండియా లేబర్ యూనియన్ మధ్యవర్తిత్వం చేయడానికి అంగీకారం. iv. కాల్పుల ఘటనపై విచారణకు ఒక లేబర్ కమీషన్ ఏర్పాటు. v. సంప్రదింపుల అనంతరం ఫ్రెంచ్ ఇండియాలో, ఐఎల్ఓ కార్మిక నియమావళి, ఫ్రెంచ్ లేబర్ కోడ్‌ల ఆమోదం.

కార్మిక వర్గ పోరాటాల ఘనవిజయం

1936 సం॥లో ఫ్రెంచ్ కార్మిక వర్గం ఒక ఒప్పందం ద్వారా ట్రేడ్ యూనియన్ హక్కులు సాధించుకుంది. ఆ ప్రేరణతో అదే సంవత్సరం జూన్ నెలలో పాండిచ్చేరి కార్మికవర్గం, తమకు కూడా ఆ హక్కులు అమలు చేయాలని సమ్మెకు దిగింది. దాని ఫలితంగా అక్టోబర్ 31, 1936 సం॥లో ఒక కొత్త ఒప్పందం కుదిరింది. ఆసియా ఖండంలోని కార్మికోద్యమంలో అది ఒక విశేషమైన విజయంగా నిలిచిపోయింది.

i. వేతనానికి భంగం కలగకుండా 8 గంటల పనిదినం. ii. 25 సం॥లు లేదా అంతకన్నా ఎక్కువ సర్వీస్ చేసిన కార్మికులకు వాళ్ళు పొందుతున్న జీత భత్యాలలో 40 శాతం పెన్షన్ సదుపాయం. iii. మహిళా కార్మికులకు 5 వారాలపాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు. పాలిచ్చే తల్లులకు పని గంటలలో 30 నిమిషాలపాటు విరామం. iv. మరణించిన కార్మికుల పిల్లలకు మద్దతుగా నిధి ఏర్పాటు. వాళ్లకు ఉద్యోగ హక్కు. v. ఓవర్ టైం పనికి మరియు రాత్రి షిఫ్ట్ చేసినందుకు రెగ్యులర్ జీతానికి 150 శాతం మరియు 200 శాతం చెల్లింపు. vi. ప్రమాదానికి నష్ట పరిహారం చెల్లించడం, ఉచిత వైద్య సంరక్షణ కల్పించడం. vii. వారానికి ఒక రోజు సెలవు. viii. ట్రేడ్ యూనియన్ హక్కు కల్పించటం. ట్రేడ్ యూనియన్ ఏర్పాటుకు ఎటువంటి ఫీజు చెల్లించడం కానీ, అధికారుల నుండి ఆమోదం కానీ అవసరం లేదు. ix. ఆ రోజుల్లో ఫ్రాన్స్‌లో మాత్రమే అమలులో వున్న 'ఉమ్మడి కార్మిక ఒప్పందం (కలెక్టివ్ కాంట్రాక్టు అఫ్ లేబర్)' విధానం మంజూరు చేయబడింది. దానివలన కార్మిక ప్రతినిధులు, యాజమాన్య ప్రతినిధులు కూర్చొని చర్చల ద్వారా ఒప్పందాలు చేసుకోవచ్చు. వివాదం తలెత్తినప్పుడు లేబర్ ఇన్‌స్పెక్టర్ ముందు రాజీ చర్చలు (కౌన్సిలేషన్), మధ్యవర్తిత్వం (ఆర్బిట్రేషన్)కు అవకాశం కల్పించబడింది. తర్వాత కాలంలో రూపొందిన ఫ్రెంచ్ లేబర్ కోడ్‌లో ఇవన్నీ పొందుపరచబడ్డాయి. ఈ విజయాలందించిన ప్రేరణతో సమాజంలోని ఇతర వర్గాల ప్రజలు కూడా ట్రేడ్ యూనియన్‌లు ఏర్పాటు చేసుకుని తమ కోర్కెల సాధనకు ప్రభుత్వాన్ని డిమాండు చేయసాగారు. నిరుద్యోగభృతి, ప్రమాద నష్టపరిహారం, పెన్షన్ ప్రయోజనాలు మొదలైన డిమాండ్లతో కల్లుగీత కార్మికులు, మత్స్య కార్మికులు ఉద్యమించారు. తమ ఉత్పత్తులకు విదేశీ మార్కెట్ కల్పించాలనే డిమాండ్‌తో చేనేత కార్మికులు ఒక ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. కట్ పీస్ వ్యాపారులు, షాపు పనివాళ్ళు, లాగుడు బండి కార్మికులు యూనియన్‌లు పెట్టుకున్నారు. భారతీయ ఉపాధ్యాయులకు యూరోపియన్ టీచర్లతో సమానంగా పని పరిస్థితులు, అధిక జీతాలు ఉండాలని టీచర్స్ ట్రేడ్ యూనియన్ డిమాండ్ చేసింది. పాండిచ్చేరిలో ట్రేడ్ యూనియన్ సంఘటనలకు యూనియన్ ఆఫీస్‌లు, 64 సాంస్కృతిక కేంద్రాలు లేదా రీడింగ్ రూమ్‌లు, సామాజిక సేవా కేంద్రాలు ఉండేవి.

కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం

1937 సం॥లో అరియంకుప్పం తీరాన మొట్టమొదటి రైతాంగ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ఫ్రెంచ్ ఇండియా కిసాన్ సభ ఏర్పాటు చేసి దానికి అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఆ విధంగా కార్మికవర్గ నాయకత్వంలో ఫ్రెంచ్ వలసవాదానికి వ్యతిరేకంగా రైతాంగాన్ని, ఇతర తరగతుల ప్రజలను సంఘటితం చేసారు. ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని నింపడానికి శిక్షణ పొందిన కళా బృందాలు గ్రామ గ్రామానా పర్యటించాయి.

1937 సం॥లోనే ట్రేడ్ యూనియన్ నాయకుల నేతృత్వంలో మహాజన సభ పేరిట ఒక రాజకీయ పార్టీ ఏర్పాటయింది. చేనేత పరిశ్రమకు చెందిన 50,000 మంది కార్మికుల సమస్యను ఆ పార్టీ చేబట్టింది. మలేసియా దేశానికి ఎగుమతులు సంక్షోభంలో పడడంతో మహాజనసభ కో ఆపరేటివ్ సొసైటీలు ప్రారంభించి చేనేత ఉత్పత్తులకు స్థానికంగానే మార్కెట్ కల్పించింది.

1938 సం॥లో ఫ్రెంచ్ ఇండియా పాలన వ్యవస్థలో నాజీ అనుకూల శక్తులు ఆధిపత్యంలోకి రావడంతో అన్ని బహిరంగ సభలను నిషేధించడం, పత్రికా సెన్సార్‌షిప్ విధించడం, ట్రేడ్ యూనియన్ నాయకులందరినీ అరెస్ట్ చేసి వెల్లూర్ జైలుకు పంపడం చేశారు. పాండిచ్చేరిలో ఎటువంటి ప్రతిఘటననైనా అణచివేసేందుకు ఒక ఫ్రెంచ్ సైనిక పటాలాన్ని దించారు.

అయినప్పటికీ 1939 సం॥లో రెండవ ప్రపంచ యుద్ధం మొదలైనప్పుడు కార్మికవర్గ నాయకత్వంలో ఫ్రెంచ్ వలసల్లో యుద్ధ వ్యతిరేక ప్రచారోద్యమం చేపట్టారు. 1942 సం॥లో ట్రేడ్ యూనియన్ నాయకులను జైళ్ల నుండి విడుదల చేశారు. జైలు నుండి విడుదలైన, పాండిచ్చేరి ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్ వరదరాజులు సుబ్బయ్య కార్యదర్శిగా కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఫ్రెంచ్ ఇండియా శాఖ ప్రారంభించబడింది. దానికి ప్రతిగా అధికార వర్గం 1944 సం॥లో కామ్రేడ్ సుబ్బయ్యను ఫ్రెంచ్ ఇండియా నుండి బహిష్కరించింది. ఆ కామ్రేడ్ తన ఉద్యమ కాలమంతా అయితే జైలులోను లేదా అజ్ఞాతంలోను గడిపాల్సి వచ్చింది.

1945 సం॥లో కా॥ సుబ్బయ్య మీద విధించిన బహిష్కరణ ఉత్తర్వు రద్దు చేయ బడింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిశాక పాండిచ్చేరిలోని కమ్యూనిస్టు కార్యకలాపాలన్నిటిని నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ అనే పేరిట ఏర్పాటు చేయబడిన ఒక రాజకీయ పార్టీ కిందకు తేబడ్డాయి. ఈ ఎన్‌డియఫ్ ఫ్రెంచ్ ఇండియా విముక్తికి సాధనంగా పనిచేసింది. ఫ్రెంచ్ ఇండియాలో వలసవాదానికి వ్యతిరేకంగా విద్యార్థులు, మహిళలు, రైతులు, మత్స్యకారులు, గీత కార్మికులు మొదలైన వారిని ఐక్యం చేయడంలో కార్మిక వర్గం నాయకత్వ పాత్ర పోషించింది. ప్రారంభ దశలో వలసవాద వ్యతిరేక భావజాలం పెంపొందడానికి ట్రేడ్ యూనియన్ ఉద్యమమే తోడ్పడింది. అంతిమంగా ట్రేడ్ యూనియన్ ఉద్యమమే కమ్యూనిస్టు పార్టీ ఏర్పడటానికి దారితీయడమే కాక తమ శ్రేణుల నుండి నాయకత్వాన్ని కూడా అందచేసింది. ఆ పరిణామమే ఫ్రెంచ్ ప్రభుత్వం తన వలసను వదులుకుని ఖాళీ చేసి పోవడాన్ని వేగిర పరిచింది.

ఫ్రెంచ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష చర్యకు దిగిన కమ్యూనిస్టు పార్టీ

తీవ్ర నిర్బంధం, గూండాల దాడులలో కార్యకర్తల హత్యలు, పార్టీపై నిషేధం, నాయకులను బహిష్కరించడం, అరెస్టులు సాగినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఫ్రెంచ్

ఇండియా తన కార్యకలాపాలను కొన సాగించింది. స్టూడెంట్ ఫెడరేషన్, యూత్ లీగ్ వంటి ప్రజాసంఘాలలోకి వివిధ రకాల ప్రజలను సంఘటిత పరిచింది. ఎన్నికలలో పాల్గొంది.


1954 సం॥లో భారతదేశంలో ఫ్రెంచ్ వలసను విముక్తి చేయడానికి, ఫ్రెంచ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష కార్యాచరణకు దిగాలని పిలుపునిస్తూ సన్నాహాలు చేయసాగింది. నిరసన ప్రదర్శనలలోకి ప్రజలను సమీకరించ సాగింది. భారత దేశంలో శరణార్థులుగా వున్నవారు తిరిగి వచ్చి విముక్తి పోరాటంలో పాల్గొనాలని పిలుపు నిచ్చింది.

కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఏప్రిల్ 6, 1954న 'తిరుభువనన్'ను విముక్తి చేశారు. ఫ్రెంచ్ ఇండియా సోషలిస్ట్ పార్టీ, మెర్జర్ కాంగ్రెస్‌లతో కలిసి ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీ ఈ చర్యను సమర్ధించింది. ఈ సంఘటన అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించింది. కమ్యూనిస్టుల చేతిలోకి పాండిచ్చేరి వెళ్లిపోవచ్చని న్యూయార్క్ టైమ్స్ ఫ్రెంచ్ గవర్నమెంట్‌ను హెచ్చరించింది.

దానితో ఫ్రెంచ్ ప్రభుత్వం తాను ఇక ఎక్కువ కాలం ఇండియాలో వలసను కొనసాగించలేమని అర్థం చేసుకుంది. నవంబర్, 1954 సం॥లో తన వలసను భారతదేశానికి అప్పగించడానికి అది తొందరపడింది.

ఆ విధంగా మన దేశానికి బ్రిటిష్ వారి నుండి, ఫ్రెంచ్ వారి నుండి స్వాతంత్రం లభించడంలో కమ్యూనిస్టు పార్టీ కీలకపాత్ర పోషించిందనే విషయాన్ని నమోదిత చరిత్ర చూపిస్తోంది. భారతదేశం కమ్యూనిస్టుల చేతుల్లోకి పోతుందనే భయంతోనే బ్రిటిష్ వారు, ఫ్రెంచ్ వారు కాంగ్రెస్ పార్టీతో రాజీపడి వాళ్లకు అధికారాన్ని అప్పగించి వెళ్లిపోయారు. ✱

జోహార్ కామ్రేడ్ మారుతి



దీర్ఘకాల అనారోగ్యంతో పోరాడుతూ కామ్రేడ్ మారుతి (74 సం॥లు) 28-8-22న విజయవాడలో మరణించారు. విశాల హృదయంతో పెద్ద మనస్సున్న మనిషి కామ్రేడ్ మారుతి. కాకినాడ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఆమె ఇంజనీరింగ్ విద్యనభ్యసించారు. వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకు రాలిగా పనిచేస్తున్న కాలంలో, ఆమె ప్రగతిశీల కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారు. అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా ఆమె తీవ్రంగా స్పందించటమేగాక, రాజీలేకుండా నిలిచారు. ఆమె అనేకమందికి తన ఇంటిలో వసతి కల్పించి, అనేకమంది విద్యార్థులకు ఆత్మీయంగా, ఆర్థికంగా తోడ్పడుతూ వారి చదువులకు సహకరించారు. ఆమె వారందరికీ సంరక్షకురాలిగా నిలిచారు. ఒక్కమాటలో, ఆమె వారందరినీ తన సన్నిహితులుగా పరిగణించేవారు.

విప్లవోద్యమక్రమంలో కామ్రేడ్ డా॥ఘంటా వెంకటరావు, మారుతిల వివాహం జరిగింది. విద్యార్థిసంఘం రాష్ట్ర కన్వీనర్ బాధ్యతలను డా॥వెంకటరావు చేపట్టగా, కా॥మారుతి తన చదువును వదలి జిల్లా నాయకత్వ నిర్ణయం ప్రకారం తూర్పుగోదావరి ఏజన్సీ ప్రాంతానికి ఒక కార్యకర్తగా వెళ్ళింది. కొద్దిరోజుల తర్వాత ఆమె రంపచోడవరం దగ్గరలోని సోకులగూడెం వద్ద అరెస్ట్ అయ్యారు. కేసు నుండి బయటకొచ్చిన పిదప ఆమె తన చదువును కొనసాగించారు. కా॥వెంకటరావును హైదరాబాద్ కుట్రకేసులో నేరారోపణజేసి, జైలు శిక్ష విధించారు. బెయిల్‌పై ఆయన బయటకొచ్చి తన వైద్యవిద్యను పూర్తిచేశారు. ఈ ప్రతిబంధకాల నడుమ కూడా వారు తమ ఉద్యమ దృక్పథం నుండి ఏనాడూ ప్రక్కకు వెళ్ళలేదు. డా॥వెంకట్రావు గుంటూరులో వుండి ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమ బాధ్యతలు తీసుకున్నారు. పార్వతీపురం, హైదరాబాద్ కుట్రకేసులలోని నిందితులకు డిఫెన్స్ కల్పించటంలో ఆయన తీవ్రంగా శ్రమించారు. అనేకమంది కామ్రేడ్స్‌కు దన్నుగా నిలిచారు. కా॥మారుతి వేగంగా అధ్యయనం చేసి, స్థూల విషయాన్ని గ్రహించగలగటంతోపాటు అసాధారణ జ్ఞాపకశక్తి కలిగి వుండేవారు. ఆమె సాహిత్యం, నవలలు, రాజకీయ గ్రంథాలు చదివేవారు.

ఆమె చిన్నవయసులోనే ఆమె తండ్రి చనిపోగా, ఆమె తల్లివద్ద, అమ్మమ్మవద్ద వుండి పెరిగారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరిగి, విశాల దృక్పథం కలిగిన ఒక బాధ్యతాయుత మహిళగా ఆమె నిలిచారు. ఆమె విప్లవోద్యమ కార్యకర్త కాకపోయినప్పటికీ, ఆమె పాత్రను తక్కువ చేసి చూడలేము. వారికి భాస్కర్, మల్లిక-ఇద్దరు పిల్లలు. వారి పిల్లలకు, ఆమె జీవిత భాగస్వామి డా॥వెంకటరావులకు 'జనశక్తి' గాఢమైన సంతాపాన్ని తెలియపరుస్తోంది.

మోర్బీ వంతెన ప్రమాదం

ప్రజల పాలిట ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్య నేరం

గుజరాత్‌లోని మోర్బీలో తీగల వంతెన కుప్పకూలిన ఘటనలో స్త్రీలు, పిల్లలు, వృద్ధులతో సహా వందలకొలది ప్రజలు మరణించటం తీవ్రంగా కలచివేస్తోంది. (పత్రిక ముద్రణకు వెళ్తున్న ఈ సమయానికి మృతులు 141 మంది అని చెప్తుండగా, ఆ సంఖ్య మరింతగా పెరగనుంది.) వీరి విషాద మరణంపట్ల 'జనశక్తి' తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, మృతుల బంధువులకు సానుభూతి తెల్పుతోంది.

గుజరాతీయుల నూతన సంవత్సరాది తొలినాడే జరిగిన ఈ ఘోర దుర్ఘటనను ప్రమాదంగా సరిపెట్టుకోలేము. 150 సం॥ల నాటి 230 మీటర్ల తీగల వంతెన నిర్వహణ పట్ల పాలకులు, ఉన్నతాధికార యంత్రాంగం ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యంగా ఉండటమే – ఇంత మంది మృత్యువాతపడటానికి కారణమైంది. ప్రైవేటు యాజమాన్యం, లాభాపేక్ష, నియంత్రణ లేని అధికారగణాలతో పాటు ప్రజల ప్రాణాల పట్ల లక్ష్యంలేని పాలకుల విధానాల ఫలితంగానే ఇలాంటి ఘటనలు పదే పదే పునరావృత మౌతున్నాయి. ఘటన జరిగిన తర్వాత విచారణ కమిటీల ఏర్పాటు, తృణ మోపణమో పరిహార ప్రకటనలు, కంటితుడుపు చర్యలతో సరిపెట్టటమే జరుగుతూ వస్తోంది. 600 అడుగుల ఉక్కుమనిషి విగ్రహాలను నెలకొల్పటంలో చూపిన శ్రద్ధలో కొంతైనా పాలకులు, ప్రజల ప్రాణాలు కాపాడటంలో చూపగలిగితే ఇలాంటి విషాదాలను ఎంతో కొంత నివారించటం సాధ్యమౌతుంది. ✱

భారతదేశ అర్థవలస, అర్థభూస్వామ్య రాజ్య స్వభావం సామాజికార్థిక రాజకీయ విశ్లేషణ

(ఈ పత్రాన్ని రెండేళ్ళ క్రితం సిపిఐ (ఎం-ఎల్) కామ్రేడ్ ఒకరు రాసారు. దీన్ని ఉపయోగకరమైన మంచి ప్రయత్నంగా మేము భావిస్తున్నాము. కా॥ తరిమెల నాగిరెడ్డి ప్రసిద్ధ పుస్తకం 'తాకట్టులో భారతదేశం' మరియు కొన్ని సర్వేల నివేదికల నుంచి సేకరించిన వివిధ వాస్తవాలు, గణాంకాలు, విశ్లేషణలను సంక్షిప్తీకరించి ఈ పత్రం రాసారు. 2022 జూలై సంచికలో ఒకటవ భాగం, ఆగస్టు సంచికలో రెండవ భాగం, సెప్టెంబర్‌లో సంచికలో మూడవ భాగం, అక్టోబర్ సంచికలో నాల్గవ భాగం ప్రచురించాం. ఇది 5వ (చివరి) భాగం.)

(జి)

భారతదేశ వ్యవసాయక వ్యవస్థ అర్థ భూస్వామ్య రకానిదా లేదా పెట్టుబడిదారీ రకానిదా? - ఒక సమీక్ష :

1965లో అప్పటి ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి హయాంలో మొదలిడిన "ఆకుపచ్చ విప్లవం" ప్రతిధ్వనితో భారతదేశ వ్యవసాయ వ్యవస్థలో గొప్ప మార్పు ప్రారంభ మయిందన్న గుసగుసలు మొదలయినాయి. ఆ తరవాత కాలంలో పివి నరసింహారావు ప్రధాన మంత్రిగా వున్నపుడు ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ 1991లో ఆర్థిక సరళీకరణ విధానాలను ప్రకటించి అమలు చేయనారంభించినపుడు ప్రచారం పొందనారంభించాయి. ఇటీవల కొంతమంది వామపక్ష మేధావులు, సంస్థలు కూడా అదే అభిప్రాయాన్ని లంకించుకున్నారు. మరి, బ్రిటిష్ పాలన నాటి అర్థభూస్వామిక వ్యవసాయ వ్యవస్థ నేడు పెట్టుబడిదారీ వ్యవస్థగా మార్పు చెందిందా?

ఈ వాదన చేసే వాళ్ళు వ్యవసాయంలో నాగళ్ళు బదులు ట్రాక్టర్లు ఉపయోగించడాన్ని, విద్యుత్ మోటార్లు, నూర్పిడి యంత్రాలు వంటి ఇతర సాధనాలు ఉపయోగించడాన్ని, ప్రభుత్వ రుణాలు అందుబాటులోకి రావడాన్ని, అదనపు వ్యవసాయ ఉత్పత్తుల్ని ప్రభుత్వం నడిపే మార్కెట్‌లలో సులువుగా అమ్ముకోగలగడం లాంటి మార్పుల్ని ఎత్తిచూపుతున్నారు. అదే విధంగా ప్రభుత్వ విధానాల్లో మైలు రాళ్ళ వంటి సంస్కరణల కేంద్రంగా 'ఆకుపచ్చ విప్లవం' విప్లవకర మార్పులు తెచ్చిందని ప్రకటిస్తున్నారు.

బ్రిటిష్ వాళ్ళు వదలివెళ్ళిన అర్థభూస్వామ్య వ్యవసాయక వ్యవస్థ పెట్టుబడిదారీ విధానంగా పరివర్తన జరిగిందంటే అర్థం- ఆ వ్యవస్థలోనే గుణాత్మక లేదా విప్లవకర మార్పు జరిగిందని అర్థం. హింసాత్మకమైన విప్లవం లేకుండా ఈ గుణాత్మక మార్పు ఎలా సాధ్యమైంది? లేదా భారతదేశ జమీందార్లు, దళారీ బడా బూర్జువా వర్గం కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ఈ విప్లవకర మార్పును నిశ్శబ్దంగా సాధ్యం చేశారా?

విషయాన్ని గందరగోళపరుస్తున్నందున సమంజసమైన నిర్ధారణకు రావడానికి మార్క్సిస్టు దృక్పథంతో వివరమైన విశ్లేషణ చేయాల్సి వుంది.

అటువంటి మౌలిక మార్పు జరిగిందా లేదా అని మార్క్సిస్టు దృక్కోణంతో తేల్చడానికి ఈ కింది ప్రశ్నలు వేసుకొని విశ్లేషించవలసి వుంది.

1) వ్యవసాయక వ్యవస్థ స్వభావంలో గుణాత్మకమైన తేడా లేక మౌలిక మార్పు అంటే అర్థమేమిటి?
2) 1947కి ముందు భారత వ్యవసాయక వ్యవస్థ స్వభావమేమిటి? ఆ తరవాతి సంవత్సరాల్లో భారత ప్రభుత్వం చేపట్టిన నిర్దిష్ట చర్యల వల్ల ఒనగూడిన లాభాలేవి?
3) ఆకుపచ్చ విప్లవం యొక్క నిజస్వరూప మేమిటి?
4) వ్యవసాయ వ్యవస్థలోకి పెట్టుబడి ప్రవేశించి వుంటే, వ్యవసాయ ఇన్‌పుట్స్ యాజమాన్యం విషయంలోను, ఉత్పత్తి సంబంధాల విషయంలోను ఎలాంటి మార్పులు వచ్చాయి?
5) ఆ మార్పులపై సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాద పెట్టుబడి పాత్ర ఏమిటి?

పై ప్రశ్నలకు వివిధ గణాంకాలు, సమాచారము ఆధారంగా సరైన సమాధానాలు వెదికే ప్రయత్నం చేద్దాం.

విశ్లేషణ (1) :

వ్యవసాయ వ్యవస్థలో గుణాత్మక లేదా మౌలిక మార్పు అనడంలో ఖచ్చితమైన అర్థమేమిటి?

వ్యవసాయ వ్యవస్థ పరివర్తన అంటే పాత స్థితి నుంచి కొత్త స్థితికి వ్యవసాయ స్వభావంలో జరిగే మౌలిక గుణాత్మక మార్పు. అంటే పాత ఉత్పత్తి శక్తుల విషయంలోనే గాక (ఇక్కడ మొత్తము భూమి, నాగళ్లు, ట్రాక్టరు, ఇతర వ్యవసాయ పరికరాలు, సాగు నీటి నిర్వహణ మొ॥) పాత ఉత్పత్తి సంబంధాలలో (భూయజమానికి, పరికరాలు, పాలు రైతు లేదా కౌలు రైతు లేదా వ్యవసాయ కూలీకి మధ్య సంబంధాలు) కూడా మార్పు జరిగిందా, కొత్త వ్యవసాయ వ్యవస్థ పుట్టుకొచ్చిందా అన్నది పరిశీలించాలి.

ఇందుకోసం 1947కి ముందు వ్యవసాయ రంగ పరిస్థితి ఎలా వుంది, ఆ తరవాత కాలంలో ఎలాంటి మార్పులొచ్చాయి అను విషయాన్ని సమగ్రంగా విశ్లేషించి నిగ్గుదేల్చాలి.

విశ్లేషణ (2)

1947కి ముందు భారతదేశ స్వభావ మేమిటి? దానిని అభివృద్ధి పరిచే పేరిట భారత ప్రభుత్వం చేపట్టిన నిర్దిష్ట చర్యల ప్రయోజనాలేవి?

1947లో బ్రిటిష్ వాళ్లు ఇండియా వదలి వెళ్ళిపోవడానికి కారణాలను చరిత్రలో పరిశీలిస్తే నూరేళ్ళుగా సాగిన రైతాంగ తిరుగుబాట్లు, ఇతర ప్రజా పోరాటాలు, బెంగాల్-బీహార్-పంజాబ్-మహారాష్ట్ర ప్రాంతంలో సాగిన అనేక విప్లవకర ఉద్యమాలు, దేశవ్యాప్త వలసవాద వ్యతిరేక పోరాటాలు అని తెలుస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో బలహీనపడి వుండడం మరొక కారణం. అప్పటికి వ్యవసాయ వ్యవస్థ అర్థ భూస్వామ్యంగా వుండేది. భారత రైతును తీవ్రమైన దోపిడీకి, వర్ణించనలవిగాని అణచివేతకు గురిచేసిన శాశ్వత శిస్తు విధానాన్ని, జమీందారీ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా అర్థ భూస్వామ్య వ్యవసాయ వ్యవస్థను స్థిరపరచారు. అది ఆర్థిక దోపిడీకి మాత్రమే పరిమితం కాకుండా అర్థభూస్వామ్యంలో

అంతర్భాగమైపోయిన కులవ్యవస్థ ప్రాతిపదికపై హరిజనులు, ఆదివాసీలపై చెప్పలేని అణచివేతను దోపిడీని జమీందార్లు అమలు జరిపారు.

ఈ పరిస్థితుల్లో బడాబూర్జువా, జమీందారీ వర్గాల ప్రతినిధి అయిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినపుడు, దున్నేవాడికే భూమి అని, ప్రజలకే అధికారం అంటూ రైతాంగ సముదాయాలు దేశమంతటా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దానిని పట్టించుకోకుండా, వ్యవసాయ వ్యవస్థను మౌలికంగా మార్చే ప్రయత్నం చేయకుండా భూసంస్కరణల పేరుతో ధనిక రైతులకు, జమీందార్లకు మరింత విశాల భూములను కట్టబెడుతూ, అర్ధభూస్వామ్య వ్యవస్థను పదిలం చేసింది. అదే కాలంలో బెంగాల్‌లో తెభాగ ఉద్యమాన్ని, తెలంగాణాలో రైతాంగ సాయుధ పోరాటాన్ని అణచివేశారు. అదీ ప్రజల పట్ల స్వదేశీ ప్రభుత్వం చూపిన సానుభూతి!

1947 తరవాత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో భూసంస్కరణ చట్టాలు చేసింది. అయితే అవేవీ అమలు జరగలేదు. ఉదాహరణకు 1950లో జమీందారీ చట్టాన్ని, కౌల్దారీ చట్టాన్ని చాలా రాష్ట్రాలలో తీసుకొచ్చారు. బెంగాల్‌లో బార్గాదార్ (కౌల్దారీ) చట్టాన్ని చేశారు. 1953లో ఎస్టేట్ల స్వాధీన చట్టం తెచ్చారు. ఈ చట్టం కింద ఇంతకుముందు జమీందార్లకు కౌలు చెల్లించిన వాళ్ళను రైతులుగా గుర్తించి ఆ భూమిపై హక్కును కల్పించారు. పశ్చిమ బెంగాల్లో 1954లో భూసంస్కరణ చట్టాన్ని తెచ్చారు. ఈ చట్టం ప్రకారం రైతులు 25 ఎకరాల వ్యవసాయ భూమిని, 15 ఎకరాల వరకు వ్యవసాయేతర భూమిని కలిగి వుండే హక్కు కల్పించారు. 1970లో ఆ చట్టంలో మార్పు చేస్తూ నీటిసాగు కలిగిన భూమిని 12.5 ఎకరాలకు పరిమితం చేసి, సాగునీటి సౌకర్యం లేని భూపరిమితిని 17.5 ఎకరాలుగా నిర్ణయించారు. ఈ సవరించిన చట్టంలో, పంటలో 75 శాతం పాలు చేసే రైతులకు చెందేట్లు పేర్కొన్నారు. 1980లో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వం వ్యవసాయ, వ్యవసాయేతర భూమినంతటినీ, నీటిసాగు వున్నా లేకున్నా కమతం 17.5-12.5 ఎకరాల మధ్య వుండేట్లు ఒక సవరణ చేసింది.

పెద్ద కమతాలు కలిగిన వారి నుండి భూమి తీసుకొని భూమిలేని రైతులకు పంచాలన్నదే ఈ చట్టం ఉద్దేశ్యం. అయితే కాంగ్రెస్‌లోని బడా భూస్వాములు అడ్డుపడినందువల్ల చాలా కాలం అది ఆచరణకు నోచుకోలేదు. 1970లలో పశ్చిమ బెంగాల్‌లో నక్సల్బరీ తదితర రైతాంగ ఉద్యమాల నేపథ్యంలో కొంత భూమి ఉద్యమ రైతుల చేతుల్లోకి, పాలు చేసే రైతుల పేరు మీదకు మారింది. అయినా, పశ్చిమ బెంగాల్‌లో పేద రైతులకు పంచిన భూమి, మొత్తం భూమిలో 8% మాత్రమే. బంజరు భూములు సాగు చేసుకుంటున్న వారు సుమారు 15 లక్షల మంది తేలారు. వాళ్ళ చేతులలో భూమి మొత్తం వ్యవసాయ భూమిలో 8% మాత్రమే. అంటే పశ్చిమ బెంగాల్లో భూసంస్కరణల వల్ల 15% భూమి మాత్రమే పేద, భూమిహీన రైతులకు దక్కింది. ఇది ఇతర రాష్ట్రాలలో కంటే హెచ్చుగానే వుంది. ఇతర రాష్ట్రాల్లో నామమాత్ర భూసంస్కరణలు అమలు జరిగాయి. భారతదేశంలో భూసంస్కరణల కింద పంచబడిన భూమి, మొత్తం భూమిలో 2% మాత్రమే.

వ్యవసాయక వ్యవస్థలో ఉత్పత్తి శక్తిలో ప్రధాన భాగమైన సాగుదాయకమైన భూమి యాజమాన్యం విషయంలో స్వల్ప మాత్రపు పరిమాణ సంబంధమైన మార్పు మాత్రమే జరిగింది. మౌలిక మార్పు జరగలేదు. స్వల్ప మాత్రపు కొత్త భూమి కౌలు రైతులకు ఇవ్వబడింది. ఇవి మెచ్చుకోదగిన, ప్రజా సంక్షేమ చర్యలే అయినా అవి పెట్టుబడిదారీ వ్యవసాయ వ్యవస్థ ప్రవేశ పెట్టబడిందనేందుకు సంకేతాలు కావు. ఆ చర్యలు వ్యవసాయక భూమిని కేంద్రీకరించే బదులు వ్యవసాయక పెట్టుబడిదారీ వర్గాన్ని ముక్కలు చేసింది. ఆ విధంగా గ్రామీణ కార్మిక వర్గాన్ని పెంపొందించే పెట్టుబడిదారీ క్రమాన్ని అడ్డుకొంది. సంప్రదాయక అర్ధ భూస్వామ్య వ్యవస్థ బలపడింది. సంప్రదాయక పద్ధతిని కొంత మెరుగు పరచిందని చెప్పవచ్చు.

ఉత్తర మరియు పశ్చిమ భారతదేశంలో, కృష్ణా-గోదావరి లోయలో జమీందార్లు, ధనిక రైతులు పెట్టుబడిదారీ పద్ధతిలో పంట సాగు ఆరంభించారు. అయితే విత్తనాలు, ఎరువులు, సాంకేతికత కోసం బహుళజాతి కంపెనీలపై ఆధారపడి వున్నందున అదనపు ఉత్పత్తిలో గణనీయమైన భాగం సామ్రాజ్యవాద కంపెనీల జేబుల్లోకి చేరింది. ఆ ప్రాంతాల్లో చాటింపబడిన "ఆకుపచ్చ విప్లవం" ఇపుడు స్తబ్దమైంది. ఈలోగా హైబ్రిడ్ విత్తనాలనుపయోగించి వరి తదితర పంటల దిగుబడిని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం భారత తూర్పు ప్రాంతంలో "రెండవ ఆకుపచ్చ విప్లవ"మంటూ ఒక ప్రణాళికను ప్రవేశపెట్టింది. రైతులు ప్రతి సంవత్సరం మోన్‌శాంటో కంపెనీ నుంచి హైబ్రిడ్ విత్తనాలు కొనుక్కోవలసి వచ్చింది. ఈ విత్తనాలను విస్తృతంగా వాడేటట్లయితే మన వ్యవసాయం మోన్‌శాంటో కంపెనీల ద్వారా సామ్రాజ్యవాద పెట్టుబడి నియంత్రణలోకి వెళ్ళిపోతుంది. ఇంకొక విధంగా చెప్పాలంటే సామ్రాజ్యవాద శక్తులపై యాంత్రికంగా ఆధారపడే వ్యవసాయ పద్ధతుల ద్వారా మన వ్యవసాయాన్ని పెట్టుబడిదారీ పద్ధతిలోకి మార్పు చెందించే ఏర్పాట్లు చేయబూనారు. అయితే అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను కలిగిన ఇండియా వంటి దేశాల్లో సామాన్య ప్రజల కొనుగోలు శక్తి అల్పంగా వుండి, భూస్వాములనలా వుంచి బడా పెట్టుబడిదారులు కూడా సామ్రాజ్యవాద మదుపులపై ఆధారపడి స్వతంత్రంగా వ్యవహరించలేని పరిస్థితి వుంది. ఈ పరిస్థితిలో పెట్టుబడిదారీ పద్ధతులను ప్రవేశపెట్టడమంటే రాలిన నెమలి ఈకలను ధరించి కాకి తను కూడా అందంగా వున్నానని భ్రమించడం వంటిదే. వాస్తవంలో ఈ ప్రణాళిక సామ్రాజ్యవాదానికి సేవ చేయడం తప్ప వేరు కాదు.

విశ్లేషణ (3)

ఇండియాలో "ఆకుపచ్చ విప్లవం" అనబడే దాని నిజస్వరూపమేది?

1965లో నాటి ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి పంజాబ్ ప్రావిన్స్‌లో బాజా భజంత్రీల మధ్య "ఆకుపచ్చ విప్లవం" ప్రణాళికను ప్రారంభించాడు. ఈ చొరవ ఆ తరవాత హర్యానాకు, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించబడింది. అధికోత్పత్తి గోధుమ రకాలను విదేశాల నుండి తెచ్చుకొని గోధుమ ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం దాని లక్ష్యం. మొదట్లో గోధుమ దిగుబడిలో సాధించిన గణనీయమైన పెరుగుదలపై హర్షం వ్యక్తమైంది. అయితే అది తర్వాత మొత్తమ్మీద విఫలమైంది. ఆ ప్రణాళికను నిలుపుదల చేశారు. వైఫల్యానికి ఈ కిందివి కారణాలు.

- దిగుమతి చేసుకొనే విత్తనం ధర ఆకాశాన్ని తాకటం
- పెద్ద విస్తీర్ణం గల భూఖండంలో పంట పెడితేగాని లాభాలు పెద్దగా వుండకపోవడం
- సాగులో రసాయన ఎరువులను అతిగా వినియోగించవలసి వున్నందున వాటి ప్రభావంతో భూమి నాణ్యత పాడవటం
- పంట కాలంలో మధ్యంతర ఖర్చులు అధికంగా వుండడం
- నిజానికి రైతులకు ఒనగూడే లాభం కంటే విత్తనాల కంపెనీకి హెచ్చు లాభాలుండటం
- సాగులో అధిక మొత్తంలో కష్టసాధ్యమైన పెట్టుబడి మదుపు చేయాల్సి రావటం
- విత్తన దిగుమతి తత్సంబంధ నిర్వహణలోని సమస్యలు రైతులను నిరుత్సాహ పరచటం

విశ్లేషణ (4)

భారతదేశ వ్యవసాయం పెట్టుబడిదారీ విధానంలోకి మారి వుంటే మదుపుల యాజమాన్యంలోనూ, ఉత్పత్తి సంబంధాలలోను ఎలాంటి మార్పులు వచ్చాయి?

అసలు వ్యవసాయ వ్యవస్థలోకి పెట్టుబడిదారీ విధాన ప్రవేశమంటే ఏమిటి? అంతకు ముందటి అర్థ-భూస్వామ్య వ్యవసాయిక వ్యవస్థకు సరైన అర్థం ఏమిటి? అను విషయాలను ఇంకొంత వివరంగా చర్చించాలి.

1757లో ఈస్టిండియా కంపెనీ బెంగాల్ నవాబు, సిరాజుద్దౌలాపై జరిపిన యుద్ధంలో ఆయన్ను ఓడించి బెంగాల్-బీహార్ ప్రాంతంపై అధికారం చేజిక్కించుకున్నాడు. తరవాత 1793లో శాశ్వత శిస్తు పద్ధతిని నెలకొల్పి బెంగాల్, బీహార్, మద్రాసు ప్రావిన్సు, యునైటెడ్ ప్రావిన్సెస్‌లో జమీందార్లను భూమి హక్కుదార్లుగా స్థిరపరచాడు. ఈ జమీందార్లు రైతుల నుండి మితిమీరిన భూమి శిస్తు వసూలు చేస్తూ రైతాంగాన్ని దోపిడీ చేశారు. అంతకు మునుపు భూస్వామ్య వ్యవస్థలో నవాబులు, రాజులు దళారీలు లేకుండా తక్కువ స్థాయి పన్నులు వసూలు చేసేవారు. ఈ జమీందారీ వ్యవస్థను తరవాత దేశమంతటా అమలు పరిచారు. ఈ అర్ధ భూస్వామ్య వ్యవస్థ రాజులు, నవాబుల కింది భూస్వామ్య వ్యవస్థా కాదు; పెట్టుబడిదారీ వ్యవస్థా కాదు. ఈ వ్యవస్థలో మొత్తం వ్యవసాయిక భూమిలో అతిపెద్ద భాగం చిన్నా పెద్దా జమీందారీ, ధనిక రైతుల అధీనంలో వుండి పోయింది. తక్కువగా కొద్దిపాటి భూమి పేద, మధ్య తరగతులకివ్వబడింది.

అంటే మొత్తం వ్యవసాయిక భూమి వివిధ వర్గాల మధ్య ముక్కలు ముక్కలుగా విభజితమై అస్తవ్యస్తంగా వుండిపోయింది. సమాజంలోని ఈ వర్గాల్లో అగ్రభాగాన జమీందార్లు, తాలుకాదార్లు, జోతేదార్లు, మల్గుజార్‌లు, ధనిక రైతులు వున్నారు. వాళ్ళ స్వాధీనంలో అత్యధిక భూమి వుండడమేగాక, బ్రిటిష్ ప్రభుత్వం నుండి అత్యధిక రక్షణ పొందటం వల్ల వాళ్ళ సామాజిక పరపతి అనూహ్యంగా వుండేది. ఈ భూమిని వాళ్ళు సాగుచెయ్యకుండా కౌలు రైతులకు, రైతు కూలీలకు ఇచ్చి సాగు చేయించారు. వారి కంటే దిగువన వున్న పేద, మధ్య తరగతి రైతులు స్వయంగా సాగు చేస్తూ తమ కుటుంబాలను ఏదో విధంగా పోషించుకున్నారు. భూమి లేని రైతుకూలీలు సమాజంలో కనిష్ట స్థాయిలో వుండిపోయారు. వారు ఆదివాసీ, దళిత, ఇతర నిమ్నకులాలకు చెందినవారు. వారు అత్యధిక దోపిడీ, అణచివేతలు, అవమానాల పాలయ్యారు. ఈనాడు వారిలో అత్యధికులు (దాదాపు 9 నుండి10 కోట్ల మంది) న్యాయమైన కూలీ, వేతనాలు పొందలేక వివిధ రాష్ట్రాల మారుమూల ప్రాంతాల్లోనో నగరాలనాశ్రయించో స్థిరమైన వేతనాలు లేకుండా ఏదో మాదిరి జీవితం వెళ్ళబుచ్చవలసి వస్తోంది.

జమీందార్లు, జోతేదార్లు, ఒకమేరకు ధనిక రైతుల చేతుల్లో సమాజ ఉత్పత్తి శక్తి బంధితమై వుంది. తక్కిన అత్యధిక జనావాళి దోపిడీ, అణచివేత, నిర్లక్ష్యం పాలయ్యారు. ఆనాడు వ్యవసాయ వ్యవస్థలో ప్రధాన సంఘర్షణ ధనిక జమీందార్లు, మధ్యతరగతి వడ్డీ వ్యాపారులు మరియు కౌలు రైతులు, రైతు కూలీలు, ఇతర పేదల మధ్య వుండేది.

ఇదీ ఆనాడు వుండిన ఉత్పత్తి శక్తుల,ఉత్పత్తి సంబంధాల పరిస్థితిగా వుండిన అర్థ-భూస్వామ్య వ్యవస్థ.

బ్రిటిష్ ఇండియాలోని వ్యవసాయ భూముల వివరాలను తెలుసుకోవడం కష్ట సాధ్యమైన పని అని ముఖ్యంగా గుర్తెరగాలి. భూమికి సంబంధించిన అందుబాటులో వున్న వివరాలు అన్నీ భారత ప్రభుత్వం సేకరించి తయారుచేసినవే. 1961లో జరిపిన కౌలుదారులు, భూకేంద్రీకరణ, జనాభా గణన; 1964-65లో జరిపిన గ్రామీణ శ్రామికుల విచారణ; 1911లో జరిగిన అఖిల భారత రుణ మరియు మదుపు సర్వే; 1978 జనాభా గణన మొదలగునవి. 1979లో సిఎంఐఇ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) తయారు చేసిన కొన్ని వివరాల పట్టీలు కూడా వున్నాయి. అయితే వీటినాధారంగా సూటి నిర్ధారణకు రావడం చాలాకష్టం. అయినా ఈ గణాంకాల ఆధారంగా తెలుసుకోగల ప్రయోజన కరమైన సమాచారం ఇలా వుంది:

పెద్ద జమీందార్లు, ధనిక రైతు కుటుంబాలు కలిగిన భూవిస్తీర్ణాలు ఇలా వున్నాయి. 4% మంది చేతుల్లో 31% భూమి వున్నది. తిరిగి ఆ 4% వారిలో 2.2% మంది 23% భూమి కలిగి వున్నారు. 1971-72 గణాంకాల ప్రకారం కేవలం 5% మంది 47.2% భూమిని కలిగి వున్నారు. అగ్రశ్రేణి 1% మంది 22.96% భూమిని కలిగి వున్నారు. దీని స్థూల అంచనా ప్రకారం 5% జమీందార్లు, జోతేదార్లు, ధనిక రైతులు కలసి సుమారు 50% భూమి కలిగి వున్నారు.

పేద, మధ్య తరగతి రైతుల చేతుల్లో వున్న భూమి వివరాలు : తాము స్వయంగా సాగు చేసే 75% రైతు కుటుంబాల చేతుల్లో 20%-30% సాగుభూమి వుంది. ఇందులోని 85% మందిలో మధ్యతరగతి, పేద, ఇతర వ్యాపకాలుగల భూమిహీన, అతిపేద కుటుంబాలు వున్నాయి. మధ్య తరగతి రైతుల్లో 2.5 ఎకరాల కంటే ఎక్కువ భూమి వున్న రైతులు మాత్రమే దాని ఆధారంతో జీవనం సాగించగలుగుతున్నారు. అంతకు లోపు వాళ్ళు గ్రామంలోనో, పట్టణంలోనో ఇతర ఉపాధుల్ని వెతుక్కోవలసి వస్తుంది.

గ్రామీణ కార్మిక వర్గం :

దేశంలోని మొత్తం వ్యవసాయ భూమిలో 9% భూమిని కలిగి వున్న 65% గ్రామీణ కుటుంబాలను గ్రామీణ కార్మికులుగా గుర్తించారు. వారు వ్యవసాయ కూలీలుగానో ఇతరత్రానో జీవనోపాధి వెతుక్కోవాలి. ఎన్ఎస్ఎస్-ఎఐఐఎస్ గణాంకాల ప్రకారం ఈ గ్రామీణ కార్మికుల సంఖ్య ప్రభుత్వాలు చేసిన కౌల్దారీ చట్టాలు, భూపరిమిత చట్టాల ప్రభావంతో 1953-54లో 22%కి 1971-72లో 9.6%కి తగ్గింది. భూమిహీన కుటుంబాల సంఖ్య అదే నిష్పత్తిలో 11% నుండి 27.4%నికి పెరిగింది. మొత్తం మీద ఎఐఐఎస్ సమాచారం ప్రకారం 1971-72లో రైతుకూలీల సంఖ్య 14.6% శాతంగానూ, భూమిలేని చేతివృత్తుల వారి సంఖ్య 2.4% శాతంగాను, ఇతర వ్యవసాయేతర కార్మికుల సంఖ్య 10.4 శాతంగాను, అంటే మొత్తంగా 27.4 శాతంగా వుంది.

2000వ సంవత్సరానికి ఈ గ్రామీణ కార్మికుల సంఖ్య స్వల్పంగా పెరిగి 30 శాతానికి చేరవచ్చని అంచనా వేయబడింది. వాళ్ళలో చాలాభాగం వలస కార్మికులుగా మారిపోయారు.

ఇప్పుడు మనం వ్యవసాయంలో పెట్టుబడిదారీ ప్రవేశం ఏమిటి? అది ఇండియాలో ఎంతమేరకు ప్రవేశించింది? అన్న విషయాలను పరిశీలిద్దాం.

పెట్టుబడిదారీ, వ్యవసాయం నిస్సందేహంగా ఒక అధునాతనమైన వ్యవసాయ వ్యవస్థ. అందులో ఆధునిక వ్యవసాయ యంత్రాలు, అత్యంత నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, విశాల వ్యవసాయ క్షేత్రాల్లో నవీన సాంకేతికతలను ఉపయోగిస్తూ పెద్దయెత్తున నాణ్యమైన వ్యవసాయోత్పత్తులు సాధిస్తారు. ఇందులో మూడు గమనించదగ్గ విషయాలున్నాయి- మొదటగా, పెద్దా, చిన్నా చెల్లాచెదురుగా వున్న భూములను కేంద్రీకరించి పెద్ద క్షేత్రాలుగా మార్చడం. రెండవది, వ్యవసాయ యంత్రాలను విస్తృతంగా ఉపయోగించడం, అత్యంత నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, మొ॥ వాడడం మరియు నవీన సాంకేతికతను ఉపయోగించడం. మూడవది, భూస్వాములు, వ్యవసాయ కూలీలు మాత్రమే కాకుండా కౌలు రైతులు, దళారీలు, ఇతర మధ్యవర్తులు మొదలగు అదనపు ఉత్పత్తిలో భాగం కోరే వారందరూ తొలగిపోతారు.

భారతదేశంలోని అర్థ - భూస్వామ్య వ్యవసాయ వ్యవస్థ పెట్టుబడిదారీగా మారిందీ అని నిర్ధారించాలి అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి కావడానికి అవసరమైన కొన్ని ముందస్తు అవసరాలు తీరినాయా అన్నది పరిశీలించాలి. అవి ఈ కింది అవసరాలుగా వుంటాయి:

ఎ). వ్యవసాయ భూమి కేంద్రీకరణ : వ్యవసాయోత్పత్తుల్ని పెద్దయెత్తున ఉత్పత్తి చేసేందుకు అవసరమైన పెట్టుబడి మదుపు చేయగల కొద్దిమంది సంపద్వంతుల చేతిలో అత్యధిక వ్యవసాయ భూమి కేంద్రీకరించబడి వుండాలి.

బి) మెరుగైన ఉత్పత్తి సంబంధాలు : వ్యవసాయంలో కౌలు రైతులు, వివిధ మధ్యవర్తులు మొ॥ వారి ప్రమేయం లేకుండా తగినంతమంది వ్యవసాయ కూలీలను నియమించుకోవాలి. ఎందుకంటే ఈ వ్యవస్థలో భూయజమానులు, వ్యవసాయ కూలీలు మినహా అదనపు ఉత్పత్తిలో భాగాన్ని కోరే కౌలు రైతులు, ఇతరులు అదృశ్యమవుతారు.

సి). ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతికతను ఉపయోగించడం : పాత పద్ధతిలో నాగలితో దున్నడం, పాత నీటి వినియోగ పద్ధతులు, కొడవలితో వరికోతలు, నూర్పిళ్ళు, సరుకుల రవాణా మొదలగు వాటి బదులుగా ట్రాక్టర్లు, డంపర్లు, విద్యుత్ మోటర్లు, త్రెషర్లు వంటి ఆధునిక వ్యవసాయ యంత్రాల వాడకం అవసరమవుతుంది. నవీన సాంకేతికత, అత్యంత నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వాడడం తప్పనిసరి.

డి). వ్యవసాయోత్పత్తుల అమ్మకం : కౌలు రైతులు, మధ్య దళారీలు లేనందువల్ల వ్యవసాయోత్పత్తుల్లో కనీసం 90% ప్రత్యక్షంగా వ్యవసాయ మార్కెట్‌లో అమ్మగలగాలి. మధ్యవర్తుల, దళారీల పాత్ర లేనందువల్ల లాభాల స్థాయి పెరుగుతుంది.

ఇ). జి.డి.పి (స్థూల జాతీయోత్పత్తి)లో వ్యవసాయోత్పత్తి వాటా : జిడిపిలో వ్యవసాయోత్పత్తుల వాటా గణనీయంగా పెరగాలి. దాని వల్ల వ్యవసాయంపై ప్రభుత్వం విధించే పన్నులు పెరుగుతాయి. ఇది ప్రభుత్వ సాంవత్సరిక ఆదాయ గణాంకాల్లో వ్యక్తం కావలసి వుంటుంది.

ఎఫ్). నూతన వర్గ చైతన్యం అభివృద్ధి కావాలి : ఆధునిక ఉత్పత్తి విధానాలు, పెట్టుబడిదారీ వ్యవసాయికోత్పత్తి మూలంగా ఏర్పడే మెరుగైన ఉత్పత్తి సంబంధాలు సమాజంపై ఫలవంతమైన ప్రభావాన్ని ప్రసరించగలగాలి. దాని వల్ల మన దేశ సంస్కృతిలో అనేక ద్వేషపూరిత ప్రవర్తనలు క్రమంగా అదృశ్యమై ఉన్నత వర్గ చైతన్యంతో పూరించబడాలి. అది సమాజంలో ప్రత్యక్షంగా ప్రతిబింబించాలి.

మనమిప్పుడు పైన పేర్కొన్న ఆ పరిస్థితులను ఎన్ఎస్ఎస్, ఎఐడిఐఎస్ మరియు సిఎంఐఇ అందించిన వివిధ గణాంకాల ఆధారంగా పరిశీలించి, పెట్టుబడిదారీ వ్యవసాయ స్థితి గతులనబడే ఈ అంశాలు ఇండియాకు ఏ మేరకు వర్తిస్తాయి, ఈ అంశాల్లో ఎంతవరకు ఈ మార్పు మన దేశంలో ప్రభావశీలంగా వుంది అన్నది సమీక్షిద్దాం.

ముందస్తు అవసరం (ఎ) – వ్యవసాయ భూమి కేంద్రీకరణ :

ఇప్పటికి లభ్యమైన సమాచారం ప్రకారం ఇండియాలో 50% వ్యవసాయ భూమి 5 శాతంగా వున్న జమీందార్లు, ధనిక రైతుల చేతుల్లో కేంద్రీకృతమై వుందని మనం తెలుసుకున్నాం. 30% భూమి మధ్య, పేద తరగతి రైతుల చేతుల్లో వుంది. అటువంటప్పుడు జమీందార్లుకు, ధనిక రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడానికవసరమైన తగినంత పెట్టుబడి పెట్టడం ఏమాత్రం కష్టం కాదు. పెట్టుబడిదారీ పద్ధతిలో సాగుచేయడం వాళ్ళకు సాధ్యమే. సమస్య ఏమిటంటే ఆ 5% మంది చేతుల్లో వున్న 50% భూమి ఒకే చోట కేంద్రీకృతం కాకుండా వివిధ రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో చెల్లాచెదురుగా వుంది. మరి పెట్టుబడిదారీ సాగుకు అవసరమైన పెద్ద కేంద్రీకృత వ్యవసాయ క్షేత్రాలు ఎలా సిద్ధిస్తాయి? అయితే, చిన్నా పెద్దా క్షేత్రాలలో ఎక్కడా పెట్టుబడిదారీ వ్యవసాయం జరగడంలేదని కాదు. అలా జరుగుతూ వుంటే అఖిలభారత స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తి పరిమాణంలో కొంత పెరుగుదల వుంటుంది. అయితే, పరిమాణంలో గాని, గుణంలోగాని పెద్ద మార్పును ఆశించలేము.

కావున, భూమి కేంద్రీకరణ ద్వారా జరిగే పెట్టుబడిదారీ వ్యవసాయానికి సంబంధించి 30-35% అవసరం మాత్రమే తీరింది. అంతకు మించి లేదు.

ముందస్తు సమీక్ష (బి) – మెరుగుపడిన ఉత్పత్తి సంబంధాలు :

మనం ఇంతకు ముందే చూసిన ఎఐడిఐఎస్ గణాంకాల ప్రకారం 1981-82లో భూమిలేని వ్యవసాయ కూలీలు 14.6% వున్నారు. భవిష్యత్ జనాభా పెరుగుదలను పరిగణిస్తే, 2000వ సంవత్సరంలో గ్రామీణ కార్మికుల సంఖ్య చాలా ఎక్కువ వుందనుకుంటే, అది దాదాపు రెట్టింపు అయిందని అందులో 10% నగరాల్లో వలస కార్మికులుగా వున్నారని అర్థమవుతుంది. ఒక వేళ దేశమంతటా పెట్టుబడిదారీ వ్యవసాయం సాగి వుంటే మిగిలిన 20% వ్యవసాయ కూలీల పరిస్థితి ఏమిటి? కనీసం 80% మంది రైతులు ప్రత్యక్షంగా వ్యవసాయం చేస్తున్నారు అని తెలిసినప్పుడు మిగిలిన 40% రైతులు ఎవరు? వాళ్ళు కౌలు రైతులు, దళారీలు మాత్రమే అయుంటారు. కావున కౌలు వ్యవసాయం మెండుగా సాగుతున్నదనే అర్థం. కావున పెట్టుబడిదారీ వ్యవసాయానికి సంబంధించిన ఈ ముందస్తు అవసరం కూడా తీరలేదు.

ముందస్తు సమీక్ష (సి)-ఆధునిక వ్యవసాయ యంత్ర సామగ్రి, సాంకేతికత వినియోగం :

వ్యవసాయ ఖర్చుల గురించి సిఎంఐఇ ఇచ్చిన సమాచారం ప్రకారం 1965-66లో ఒక హెక్టార్ పంట సాగులో వాడిన అన్ని రకాల ఎరువులు కలిపితే 5.1 కేజీలు, 1975-76లో 17.4 కేజీలు, 1978-79లో 29.4 కేజీలుగా వున్నాయి. ఒక లక్ష ఎకరాల సాగులో 1965-66లో 34 ట్రాక్టర్లు, 1975-76లో 166 ట్రాక్టర్లు వాడారు. 1978-79లో 234 ట్రాక్టర్లు ఉపయోగించారు. నీటి పారుదలకు 1 లక్ష హెక్టార్లకు వాడిన విద్యుత్ మోటార్లు 1965-66లో 362, 1975-76లో 1617, 1968-69లో 2306. ఈ గణాంకాలు అఖిలభారత స్థాయి పెట్టుబడిదారీ వ్యవసాయానికి చాలుతాయి అని భావించడం హాస్యాస్పదం. గూగుల్ సమాచారం ప్రకారం భారతదేశంలో సాగుయోగ్యమైన భూమి 159.7 మిలియన్ హెక్టార్లు (159700000 హె॥) 1978-79లో ఈ భూమిని సాగుచేయడానికి 1 లక్ష ఎకరాలకు 234 ట్రాక్టర్లు చొప్పున వినియోగించబడినాయి. ప్రస్తుతం ఈ సంఖ్య 2340కి పెరిగింది. అయినా వీటినుపయోగించి 68,248 ఎకరాలు (27,620 హె॥) మాత్రమే సాగు చేయగలం. 10 ఎకరాలకు రోజుకు 1 ట్రాక్టర్ ఉపయోగిస్తే, మొత్తం సాగు చేయబడిన భూమి 6,82,479 హెక్టార్లుగా వుంటుంది. అది ఇండియా మొత్తం సాగు భూమిలో 0.43% మాత్రమే వుంటుంది. పైన పేర్కొన్న ఎరువులు నీటి పారుదలను కూడా పరిగణిస్తే, ఇది మరీ హాస్యాస్పద స్థాయిలో వుంది. కావున ఈ విషయంలో కూడా పెట్టుబడిదారీ వ్యవసాయ ముందస్తు అవసరం పరిపూర్తి కాలేదు.

ముందస్తు సమీక్ష (డి) – వ్యవసాయోత్పత్తుల అమ్మకాలు :

ప్రథమంగా చెప్పాల్సింది ఏమిటంటే వ్యవసాయోత్పత్తుల అమ్మకాలకు సంబంధించి ఎక్కడా గణాంకాలు లభించడం లేదు. కావున వ్యక్తిగా నాకున్న అనుభవం నుండి నిర్ధారణలు చేస్తున్నాను. సగటు గ్రామీణ రైతు పంటలో పాతిక భాగం తన కుటుంబానికి వినియోగించుకొని ముప్పాతికభాగం చిన్న వ్యాపారులకు అమ్మేస్తాడు. పేద రైతులు ముప్పాతిక భాగం అమ్ముతారు. అంతా అమ్మినా వచ్చే ఆదాయం వారి కుటుంబ పోషణకు చాలకపోవచ్చు. భూస్వాములు, ధనిక రైతులు పంట దిగుబడి మొత్తం అమ్మేస్తారు. ఆ చిన్న వ్యాపారులు తాము కొన్న సరుకును ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్‌లలోనో లేదా దళారీల ద్వారానో అమ్ముకుంటారు. మరి వ్యవసాయోత్పత్తులు ఎక్కడికి చేరుతున్నాయి? ప్రత్యక్షంగా వ్యవసాయ మార్కెట్టుకా?

ప్రభుత్వానికా? లేదు. దీనికి బదులు మధ్య దళారీలు అదనపు ఉత్పత్తిలోని గణనీయభాగాన్ని వాస్తవ ఉత్పత్తిదారుల మరియు ప్రభుత్వాల భాగాలలోంచి లాగేస్తారు. కావున ఈ విషయంలో కూడా పెట్టుబడిదారీ వ్యవసాయోత్పత్తికి ముందస్తు అవసరం నెరవేరడం లేదు.

ముందస్తు సమీక్ష (ఇ)- జిడిపి(స్థూల జాతీయోత్పత్తి)లో వ్యవసాయోత్పత్తి వాటా :

జిడిపిలో వ్యవసాయోత్పత్తి నిష్పత్తి సమాచారం కేవలం గణాంకాలపై ఆధారపడి వుంది. విచారకరమైనదేమిటంటే ఎన్ఎస్ఎస్, ఎజిడిఐఎస్ లేదా సిఎమ్ఐఇ స్పష్టమైన సమాచార మివ్వడం లేదు. నేను గూగుల్ నుంచి సేకరించిన సమాచారం ఒక నిర్ణయానికి రావడానికి సరిపోతుందనుకుంటాను. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత మొత్తం జాతీయాదాయంలో సగకంటే ఎక్కువ వ్యవసాయ రంగం నుండి వచ్చింది. అది 2003-04లో 21.77% వుండగా, 2007-08లో అది 17.8%కి పడిపోయింది. 2008-09లో భారతదేశం మొత్తం జాతీయోత్పత్తి పెరుగుదల దాదాపు 7% వుండగా వ్యవసాయోత్పత్తి భాగం 1.6% మాత్రమే పెరిగింది. ఇందులో తృణధాన్యాల్లో 0.8%, పప్పు దినుసుల్లో 8.59 శాతం ఉత్పత్తి తగ్గింది. మొత్తమ్మీద దేశం జిడిపిలో జాతీయోత్పత్తి భాగం కీలకమైనది. నయా ఉదారవాద విధానాలు ప్రవేశపెట్టబడిన పదేళ్ళలో వ్యవసాయంలో మౌలిక వసతులపై ప్రభుత్వ మదుపు ఘోరంగా తగ్గిపోయింది. మరోవైపు వ్యవసాయపు అదనపు ఉత్పత్తిని బహుళజాతి కంపెనీల ద్వారా సామ్రాజ్యవాద పెట్టుబడి మింగేసింది. కావున ఈ విషయంపై సేకరించిన సమాచారం మేరకు వ్యవసాయోత్పత్తులు జిడిపికి గణనీయమైన దోహదం చేసినట్లు నిరూపితం కాలేదు. కావున ఈ అంశంలో కూడా వ్యవసాయోత్పత్తి పెట్టుబడిదారీ స్వభావం సంతరించుకోలేదని చెప్పవచ్చు.

ముందస్తు సమీక్ష (ఎఫ్)- నూతన వర్గ చైతన్యాభివృద్ధి :

పెట్టుబడిదారీ వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థలో అసహ్యకరమైన ఫ్యూడల్ కుల వ్యవస్థ నిర్మూలన కీలకమైనదే గాక, ఈ సమస్యను వివరంగా, సక్రమంగా చర్చించవలసిన అవసరముంది. ఎందుకంటే జాతీయ సంస్కృతి సామాజిక జీవితానికి దర్పణం వంటిది. సామాజిక జీవితం అందులో ప్రతిఫలిస్తుంది.

భారతదేశ చాతుర్వర్ణ కులవ్యవస్థ శ్రమ విభజనను నిర్వచిస్తుంది. అందులో బ్రాహ్మణులకు విద్యాభ్యాసం, పౌరోహిత్యం, క్షత్రియులకు యుద్ధం, పరిపాలన, వైశ్యులకు వ్యాపారం (వ్యవసాయం). శూద్రులకు శరీర కష్టంతో పై వర్గాలకు సేవచేయడం నిర్దేశించబడినాయి. హిందు మత గ్రంథాలు ఈ శ్రమ విభజన ఖచ్చితంగా పాటించ బడాలని బోధిస్తాయి. బ్రాహ్మణుడు నాగలిపట్టితే బహిష్కరణకు గురవుతాడు. శూద్రులు విద్య నభ్యసించ ప్రయత్నిస్తే మరణ శిక్షకు గురవుతాడు. యుగాల తరబడి ఇదంతా ధర్మసంగతంగా నడిచింది.

బ్రిటిష్ ఇండియాలో మాదిరే ఈ వ్యవస్థ పెద్దగా మార్పుచెందకపోవడమే గాక స్వతంత్ర భారత సమాజంలో పూర్తి ఊపుతో కొనసాగింది. సంప్రదాయిక శ్రమ విభజనకు ఆధునిక భారత రాజకీయ నాయకులు కూడా ఎంతో ప్రాధాన్యత నివ్వడం చూశాం. గాంధీ, అంబేద్కర్‌ల మధ్య జరిగిన సంవాదం ద్వారా ఈ సంగతి గమనించవచ్చు. అంబేద్కర్ తన రచన "అస్పృశ్యుల కోసం కాంగ్రెస్ పార్టీ, గాంధీ ఏం చేశారు"లో గాంధీ రచనలను ఉటంకించాడు. గాంధీ ఇలా రాసాడు : "నిమ్న కులాల వారికి విద్యాభ్యాసపరమైన అన్ని అవకాశాలను కల్పించాలి. అయితే ఇది వాళ్ళు వారి సంప్రదాయిక వృత్తులను వదిలేసి ఇతర వృత్తులను చేపట్టాలని చెప్పడం కాదు. జనం వాళ్ళ సంప్రదాయిక వృత్తులను వదిలేస్తే సమాజంలో పెద్ద అరాచకం ఏర్పడుతుంది". అంటే అర్థం కులాధారిత వృత్తులు భారతదేశంలో అన్ని యుగాల్లోనూ అవలంబించారు. ఆధునిక భారతదేశం భిన్నమైనదేమీ కాదు. ప్రాచీన కాలంలో భూమిపై ప్రైవేటు యాజమాన్యం లేదనీ, అది బ్రిటిష్ వాళ్ళ రాకతో ఏర్పడినదని మనం తప్పక చెప్పుకోవలసిన అంశం. అదనపు సంపదను రాజ్యవ్యవస్థ లాగేసుకొని కుల-వర్ణ వ్యవస్థలో హెచ్చుతగ్గులననుసరించి వివిధ సముదాయాలకు పంపిణీ చేస్తుంది. కుల వ్యవస్థ ఒక ప్రత్యేకమైన ఉత్పత్తి సంబంధాల వ్యవస్థ అని చెప్పవచ్చు, ఎందుకంటే అది మనిషికి మరొక మనిషికి మధ్య ఏర్పడే సంబంధం మూలంగా మానవులు సామాజిక ఉత్పత్తి, పంపిణీని నియమబద్ధం చేసే సంబంధం. ఈ పద్ధతిలోనే గత రెండువేల సంవత్సరాల్లో కొత్త కొత్త రాజ్యాలు జన్మ తీసుకున్నాయి.

నేటి యుగంలో కూడా జాతి, మతముల పేరు మీద ఎన్ని రకాల అన్యాయాలు, హత్యాకాండలు జరుగుతున్నాయో మనం చూస్తున్నాం. ఆదివాసీలు, దళితులు ఇప్పటికీ కష్టభూయిష్టమైన పొలం పనుల్లో, గనుల గర్భంలోని దుర్భర పనుల్లో చాకిరీ చేస్తున్నారు. కుల వ్యవస్థ, అస్పృశ్యత గ్రామాలు, పట్టణాల్లోని మన సమాజాన్ని వైకల్యం పాలుజేశాయి. అయినప్పటికి మన వ్యవసాయ వ్యవస్థ పెట్టుబడిదారీలోకి మారిందని ఇప్పటికీ మనం చెప్పగలమా? అలా ఏమాత్రం చెప్పలేము. కావున ఈ అంశం కూడా మన వ్యవసాయ వ్యవస్థ పెట్టుబడిదారీలోకి ప్రవేశించలేదనే సూచిస్తుంది.

కావున పైన ఇచ్చిన సమాచారమంతా వ్యవసాయంలో పెట్టుబడిదారీ వ్యవస్థకవసరమైన షరతులేవీ పూరించబడలేదని తెలుపుతుంది. ప్రత్యేకించి ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల్లో ఎట్టి మార్పు లేనందువల్ల సాగు పద్ధతుల్లో స్వల్ప మార్పులు జరిగినప్పటికీ భారతదేశంలో అర్ధ భూస్వామ్య వ్యవస్థ ఎప్పటిలాగే వుండిపోయిందని గట్టిగా చెప్పగలం.

విశ్లేషణ (5) :

వ్యవసాయంలో వచ్చిన కొద్దిపాటి మార్పులో సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాద పెట్టుబడి నిర్వహించిన పాత్ర ఎటువంటిది?

మన సమీక్షలో ఇంతకు ముందే గమనించినట్లు, వ్యవసాయ వ్యవస్థను మెరుగు పరచడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల వ్యవసాయోత్పత్తిలో కొంత పరిణామాత్మక పెరుగుదల మినహా వ్యవసాయ వ్యవస్థలో స్వాభావిక మార్పులు వచ్చిన సంకేతాలేవీలేవు. కావున దాన్ని ప్రభుత్వ వైఫల్యంగా యెంచాలా లేక దాని వెనుక మరేమైన కారణాలు వున్నాయా?

లేదు. అది వైఫల్యం కాదు. అది మార్పు పేరుతో వ్యవసాయ వ్యవస్థను సంస్కరించే ప్రయత్నం మాత్రమే. పాలకవర్గాలు దాన్ని పెట్టుబడిదారీ వైపు మళ్ళించాలని ఎప్పుడూ కోరుకోలేదు. ఎందుకంటే అందుకవసరమైన విప్లవ సద్భావన వారికి లేదు. అది వాళ్ళకు వుండగలదని ఆశించలేము కూడా. ఎందుకంటే స్వాభావికంగా సామ్రాజ్యవాదులకు దళారీలైన బడాబూర్జువా వర్గమూ, బడా భూస్వామ్య వర్గము మరియు నిరంకుశ అధికార వర్గముల యొక్క ఉమ్మడి శక్తికి ఈ ప్రభుత్వం ప్రతినిధి మినహా మరొకటి కాదు. దేశంలోని అన్ని రంగాల్లోను ఈ ప్రభుత్వం గావించే కొద్దిపాటి మెరుగులు సామ్రాజ్యవాదులకు సమ్మతమే. అయితే సామ్రాజ్యవాదం కళ్ళెర్ర జేయడాన్ని విస్మరించి చేపట్టే ఎటువంటి విప్లవకర చర్య అయినా అనూహ్యమే కాదు, అసాధ్యం కూడా. కావున వ్యవసాయ రంగంలోనూ, పారిశ్రామిక రంగంలోనూ మనం గమనించినట్లు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ప్రయత్నాలు కొంతదూరం వరకే నడిచాయి. మనం ఇదివరకే తెలుసుకున్నట్లు స్వాతంత్ర్యం వచ్చిన కాలం నుండి నెహ్రూ ప్రభుత్వం పంజాబ్‌లో భాక్రానంగల్ డ్యాం మొదలు వందలాది రిజర్వాయర్లు, డ్యామ్‌లు, రోడ్డు మార్గాలు, ప్రజోపయోగ ఆవాసాలు, విద్యుత్‌లైన్‌లు, రైల్వే మార్గాలు, ఇతర సౌకర్యాలు కల్పించడం దేశ ప్రగతికి పని చేసింది. దేశాన్ని కాస్తంత ముందడుగు వేయించడానికి వేలాది చొరవలు తీసుకొని ఐదు పెద్ద ఉక్కు కర్మాగారాల నిర్మాణం, నవరత్నాలుగా ప్రసిద్ధిగాంచిన కంపెనీల

తదితర పారిశ్రామిక విధానాలు చేపట్టారు. వ్యవసాయంలోను, పరిశ్రమ రంగంలోను ఓ మాదిరి అభివృద్ధి జరిగిన తదుపరి, అంతిమ లక్ష్యం చేరకుండా ఆగిపోయింది. ఈ స్తబ్దత ప్రత్యేకించి ఎక్కువగా 1990లలో ఎందుకు ఏర్పడింది? ఇక్కడే సామ్రాజ్యవాదం పాత్ర ఏమిటన్నది వెల్లడవుతుంది. దేశ నిర్మాణం కోసం 1947 నుండి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు క్రమంగా ముందుకు సాగడం ఎందువల్ల సాధ్యమైంది అంటే ప్రపంచం రెండు ధృవాలుగా తయారైంది - అమెరికా సామ్రాజ్యవాదం, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం. ఈ రెండు సామ్రాజ్యవాద శిబిరాల మధ్య తీవ్రమైన శతృత్వం, పోటీ మరియు ఉద్రిక్తత వుండేది. ఆ సంఘర్షణను అనుకూలంగా మార్చుకొని భారతదేశం సోవియట్ సోషల్ శిబిరం ఊతంతో దేశ ప్రగతిని ముందుకు నెట్టింది. సోవియట్స్ అడుగుజాడల్లో 1969 జూలై 19న అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఆర్థిక రంగంలో 14 పెద్ద బ్యాంకులను మరికొన్ని రంగాలను జాతీయం చేసే ముఖ్యమైన చర్య తీసుకుంది. అంతేగాక విద్య, సంస్కృతి నుండి పారిశ్రామిక రంగం వరకు, రైల్వే సేవలు, విమానయాన సేవలు, విద్యుత్తు, సమాచార రంగం, టెలివిజన్ విస్తరణలో గొప్ప ముందంజ వేయబడింది. సైన్యం ఆధునికీకరణతో రక్షణ రంగంలో కూడా గొప్ప ముందంజ వేయబడింది. ఆ సందర్భంలో ఇండియా ఒక అగ్రరాజ్యంగా రూపొందే కలలు కూడా కనింది. అయితే, ఆ వెంటనే అంతర్జాతీయ రాజకీయాల్లో భారీ మార్పు సంభవించింది. 1980లు దగ్గర పడేకొద్దీ సోవియట్ యూనియన్ రాజకీయంగా, సైనికంగా బలహీనపడింది.

ఆ పరిస్థితిలో అంతర్జాతీయ రాజకీయ సంతులనం కోసం అమెరికాతో రాజీ ధోరణితో అంతర్జాతీయ ఒప్పందాన్ని భారత ప్రభుత్వం ప్రతిపాధించింది. ఆ తరవాత 1987 డిసెంబర్ 8న రెండు దేశాల మధ్య అనేక అణ్వాయుధ నియంత్రణ ఒప్పందాలు కుదిరాయి. ఈ ఒప్పందాలు సోవియట్ యూనియన్ బలహీన పడిందనటానికి, ఒక విధమైన లొంగుబాటుకు సాక్ష్యంగా నిలిచాయి. ప్రపంచంతా దీన్ని నిస్సంకోచంగా అర్థం చేసుకుంది. జరిగిన ఈ మార్పు ప్రాధాన్యతను గుర్తించి ఇండియా అమెరికా శిబిరం వైపు మళ్ళింది. అప్పుడు 1991 జనవరి 26న సోషలిస్టు దేశం అనబడిన సోవియట్ యూనియన్ కూలిపోయింది. రష్యాలో పెట్టుబడిదారీ విధానం ప్రకటించబడింది. దాని ఫలితంగా ఏకధృవ ప్రపంచమేర్పడింది. అమెరికా సామ్రాజ్యవాదం అగ్రరాజ్యమైంది. ప్రపంచీకరణ విధానాల ద్వారా, ద్రవ్య పెట్టుబడి ఎగుమతి, మదుపు ద్వారా దాని ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా నెలకొల్పబడింది. ఈలోగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా క్రమంగా అమెరికా సామ్రాజ్యవాదం గొడుగు కింద ఆశ్రయం పొందింది. 1991లో ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా వుండిన మన్‌మోహన్‌సింగ్ ఆర్థిక సరళీకరణ విధానాన్ని రూపొందించి భారతదేశాన్ని నయా ప్రపంచ సామ్రాజ్యవాద శిబిరానికి నమ్మకమైన దేశంగా చేశాడు. అయితే ఈ ఆర్థిక సరళీకరణ అనబడేది ఏమిటి? సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

నిజానికి ఆర్థిక సరళీకరణ విధానం ఉద్దేశ్యం భారత ఆర్థిక వ్యవస్థకు ఉదార స్వభావాన్ని కల్పించడం, మార్కెట్లు సేవలను సులభతరం చేయడం, ప్రైవేటు, విదేశీ మదుపుల పాత్రను విశాలపరచడం. దేశాన్ని ఆర్థిక సంక్షోభాన్నుంచి గట్టెక్కించడానికి ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ అందించిన 500 మిలియన్ల డాలర్ల రుణానికి షరతుగా ఆర్థిక రంగంలో మార్పులు చేయ బడినాయి. దిగుమతి సుంకాలను తగ్గించడం, మార్కెట్ నియంత్రణను ఎత్తివేయడం, విదేశీ మదుపులపై పన్నులు తగ్గించడం, విదేశీ మదుపులకు అధిక అవకాశాలు కల్పించడం వంటి షరతులు ద్రవ్య విధాన మార్పుల్లో భాగంగా వుంటాయి. 1991-2000 కాలంలో భారీ ఆర్థిక అభివృద్ధికి దారివేసే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం ఇదంతా చేసింది. దేశీయంగా ఈ సరళీకరణ మొత్తం లక్ష్యం వ్యవసాయ సబ్సిడీలను తగ్గించడం, సుదీర్ఘ పోరాటాల ద్వారా కార్మికవర్గం సాధించుకున్న వివిధ కార్మిక హక్కుల చట్టాలను రద్దుచేసి స్వదేశీ విదేశీ పెట్టుబడికి మేలుచేసి ఆర్థిక వృద్ధిని సులభతరం చేయడం. అప్పట్నుంచి ఇప్పటి దాకా అన్ని ప్రభుత్వాలు, అవి ఏ రాజకీయ పార్టీకి చెందినవైనా, ఈ విధానాలను చేపట్టి సామ్రాజ్యవాద విధేయులుగా ప్రజావ్యతిరేక చర్యలను అమలు చేయడానికే సిద్ధపడినాయి.

సామ్రాజ్యవాద యుగంలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ ఆమెరికాలకు చెందిన వెనుకబడిన దేశాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న రాజీ లొంగుబాటు మార్గమే ఇది. మన దేశం కూడా అదే మార్గాన్నే అనుసరిస్తున్నది.

అటువంటి వెనుకబడిన దేశాల అభివృద్ధి క్రమంలో సామ్రాజ్యవాదులు ఆ అభివృద్ధిని నియంత్రించే దోపిడీదార్ల పాత్ర నిర్వహిస్తారు. ఇండియా వంటి దేశాలు వాటి వ్యవసాయ రంగాన్ని పరిశ్రమలను అభివృద్ధి చేసుకొని వాళ్ళతో పోటీ పడకుండా, వాళ్ళకు సేవచేసే వాళ్ళుగా వుండాలని వాళ్ళు కోరుకుంటారు. తాము అగ్రరాజ్యమనే ధీమాతో ఒక వైపు మన వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం గురించి మాట్లాడుతారు. మరోవైపు ధాన్యాలు, విత్తనాలు, ఎరువులు మాన్‌శాంటో వంటి బహుళజాతి కంపెనీల నుంచి దిగుమతి చేసుకోవాలని వత్తిడి తెస్తారు. ప్రపంచ బ్యాంకు నుండి రుణాలు తెచ్చుకొమ్మని ప్రోత్సహిస్తారు.

1970లలో వ్యవసాయరంగ అభివృద్ధి కోసం అంటూ ఇండియాకు ప్రపంచ బ్యాంకు గణనీయమైన మోతాదులో రుణాలందించింది. అయితే, రుణం ఎంత పెరిగింది, మొత్తం రుణభారమెంత అనే గణాంకాలు ప్రకటించలేదు. రిజర్వు బ్యాంకు అంచనాల ప్రకారం వ్యవసాయాభివృద్ధి కోసం తెచ్చుకున్న అన్ని రకాల ప్రత్యక్ష, పరోక్ష సంస్థాగత రుణాలు 1973-78 మధ్య రూ॥ 2621.8 కోట్ల నుండి రూ॥ 5722.3 కోట్లకు పెరిగాయి.

వ్యవసాయాభివృద్ధి పేరు మీద చేపట్టిన విధానాల మూలంగా రైతులు ఏ విధంగా రుణాల వలలో ఇరుక్కుపోయారో దీని వల్ల అర్థమవుతుంది. రైతుల ఆదాయంలో పెరుగుదల మాత్రం దరిదాపుల్లో లేదు. అది జీవనాధారంగా ఏ మాత్రం చాలడం లేదు. దీని ఫలితంగా రుణభారంతో రైతులు ఆత్మహత్యల బారిన పడుతున్నారు. 2016 మే నెల 3న కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన రాతపూర్వక సమాచారంలో 2013 నుండి సగటున ఏటా 12000 మంది రైతుల ఆత్మహత్యలు నమోదవుతున్నట్లు తెలిపింది. ధృవీకరణ లేని నివేదికల ప్రకారం ఇటీవలి సంవత్సరాల్లో బ్యాంకు రుణాలు చెల్లించలేక 1 లక్షా 50 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులు రుణాల పాలవడం వల్ల మన వ్యవసాయ వ్యవస్థలో సంభవిస్తున్న పరిణామాలివి. ఇది అభివృద్ధి చెందిన వ్యవసాయ వ్యవస్థ అని ఎవరైనా వాదించదలిస్తే ఇక చెప్పవలసింది ఏమీలేదు.

పై సమీక్ష వల్ల స్పష్టమవుతున్నదేమిటంటే సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాద పెట్టుబడి భారతదేశం, ఇతర వెనుకబడిన దేశాల వ్యవసాయ వ్యవస్థల్లో నిర్వహిస్తున్న పాత్ర ఒకటిగానే వుంది; ఆ దేశాల్లోని వ్యవసాయ వ్యవస్థలో గుణాత్మక మార్పును నిరోధించడం. ఆ దేశాల సమాజాల్లో వస్తువ్యామోహ సంస్కృతిని వ్యాపింపజేసి రుణగ్రస్తుల్ని గావించి సామ్రాజ్యవాదులకు అధీనమైన, చేవచాలని పిరికి దేశాలుగా మార్చడమే సామ్రాజ్యవాదుల లక్ష్యం. వెనుకబడిన దేశాల ప్రభుత్వాల పాత్ర సామ్రాజ్యవాదం ఆదేశాలను పాటించడం మాత్రమే.

చివరగా మనవంటి వెనుకబడిన దేశాలు, ఐక్య పోరాటాల ద్వారా సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనని యెడల అర్ధ భూస్వామ్య వ్యవస్థలోనే కాదు, ఏ వ్యవస్థలో కూడా మౌలిక గుణాత్మక మార్పుల్ని సాధించలేము. ★

మహిళలపై కొనసాగుతున్న దురాగతాలు

నేటి అర్థఫ్యూడల్ వ్యవస్థలో మూలాలు

గత రెండు నెలల కాలంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో మహిళలపై జరిగిన, పత్రికల ద్వారా వెలుగుచూసిన లైంగిక అత్యాచార ఘటనలు - దేశంలోని మహిళల స్థితిగతులు ఎంతటి ఘోరంగా, అమానవీయంగా, హృదయవిదారంగా వున్నాయో ఎత్తిచూపుతున్నాయి.

ఉత్తరాఖండ్ రాష్ట్రం-హృషీకేశ్ దగ్గర ఒక రిసార్టులో రిసెప్షనిస్టుగా పనిచేసే 19 సం॥ల అంకిత భండారీని, రిసార్టులో 'లైంగిక సేవలు' అందివ్వటానికి నిరాకరించిన నేరానికి, ఆ రిసార్టు యజమాని, ఆ రాష్ట్ర మాజీమంత్రి అయిన బిజెపికి చెందిన వినోద్ ఆర్య కుమారుడు సెప్టెంబర్ 18న ఆమెను ఒక కొండ శిఖరం నుండి క్రింద కాల్వలోకి త్రోసి చంపేశాడు.

సెప్టెంబర్‌లోనే ఉత్తరప్రదేశ్ రాష్ట్రం - లఖింపూర్ ఖేరీలో ఇద్దరు దళిత యువతులను అత్యాచారానికి గురిచేసి, చెట్టుకు ఉరేసి చంపేశారు. నేరస్తుల వివరాలను పోలీసులు వెల్లడించలేదు.

అక్టోబర్ మొదటివారంలో, దేశరాజధాని నగరం ఢిల్లీలో 8 సం॥ల వయస్సున్న ఒక బాలికను అపహరించి, ఆమెపై లైంగిక దాడి జరిపి, కొట్టి చంపారు.

అక్టోబర్ 2వ వారంలో చెన్నైలో కాలేజీ విద్యార్థిని అయిన సత్యప్రియను వెంటబడి తరిమిన ఒక యువకుడు, నడుస్తున్న రైలుకిందకు ఆమెను తోసివేయటంతో ఆమె శరీరం ఛిద్రమైపోయింది.

ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చేరిన నాలుగేళ్ళ బాలికను, ఆ స్కూలులోనే పనిచేసే వ్యాన్ డ్రైవరు లైంగికంగా దాడి జరిపి, ఆ పసిపిల్లను తీవ్రమైన కోలుకోలేని మానసిక భయానికి, క్షోభకు గురిచేశాడు.

ఇంతేగాక, మరో అమానవీయమైన దారుణ సామాజిక ఆటవిక ఆచరణ వెలుగులోకి వచ్చింది. స్త్రీలను లైంగిక బానిసలుగా వేలంపాటలు జరిపి అమ్మివేస్తున్న అంశం ఒడలుగగుర్పొడుస్తుంది. రాజస్థాన్ రాష్ట్రం - భిత్‌వారా జిల్లాతోపాటు మొత్తం ఆరు జిల్లాలలో గ్రామీణులు తమ కుటుంబ అవసరాలకోసం అప్పులుజేసి, అవి తీర్చేందుకు తమ ఇంటి ఆడపిల్లలను బలవంతంగా అమ్ముకుంటున్న సామాజిక దురాచారం వెలుగులోకి వచ్చింది. బాకీలు చెల్లించే విషయంలో కులపంచాయితీలు నిర్వహించబడుతూ, ఇంట్లోని ఆడపిల్లల్ని అమ్మి అయినా సరే రుణదాతకు డబ్బు చెల్లించాల్సిందేననే తీర్పును ఇస్తూ, అమ్మాయిలను అక్కడికక్కడే వేలంపాటలు నిర్వహించి, అధిక మొత్తం చెల్లించినవారికి వారిని అమ్మివేస్తున్నారు. సంతలో పశువుల మాదిరి ఆడబిడ్డలను కొనుగోలుచేసి వారిని మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ముంబయి, ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని వ్యభిచార కుపాల్లోకి నెట్టివేస్తున్నారు. వీరిలో కొందరిని మరింత అధిక ధరకు వ్యభిచారంకోసం విదేశాలకు కూడా తరలిస్తున్నారు.

వేలంపాటల్లో సాగుతున్న ఈ ఆడపిల్లల అమ్మకాలు స్టాంపుపేపరు మీదు వ్రాసుకొని మరీ జరగటం గమనార్హం! అమ్మాయిల వేలంపాటను అంగీకరించని ఇంటి యజమాని భార్యపై అత్యాచారం జరపాలనే తీర్పులను ఇస్తూ ఈ కుల పంచాయితీలు తమ అధికారం చెలాయిస్తున్నాయి.

భిత్‌వారా జిల్లా పంపేర్ గ్రామానికి చెందిన వ్యక్తి తాను అప్పుగా తీసుకున్న 15 లక్షల రూ॥లను తీర్చటానికి ముందుగా తన సోదరిని అమ్మాడు. అయినా అప్పుతీరకపోవటంతో తన ఆడపిల్లలలో ముగ్గురిని అమ్మాడు. ఇంకా అప్పు మిగిలి వుండటంతో 12 ఏళ్ళ అతని చిన్న కూతురిని బలవంతంగా లాక్కొచ్చి వేలంపాట వేశారు. ఈవిధంగా ఆ ఆరుజిల్లాల్లోనూ 8-18 సం॥ల ఆడపిల్లలు వ్యభిచార విషవలయంలోకి బలవంతంగా నెట్టబడుతున్నారు.

ఈ ఘటన ఇలా వుండగా, ఏనాడో నిర్మూలించామని చెప్పున్న దురాచారాలైన బసివి, జోగినిల గురించి ఇటీవల పోలీసు అధికారులు కొన్ని వివరాలు తెలియజేశారు. అనంతపురం జిల్లా పోలీసు సూపరెంటెండెంట్ ఇప్పటికి 270 మంది జోగినులను, దేవదాసీలను గుర్తించామని, ఇంకా అనేక మందిని గుర్తించాలని పేర్కొనటం గమనించాల్సిన విషయం.

జాతీయ నేర గణంకశాఖ వివరాల ప్రకారం 2021లో మహిళలపై, 4,28,278 నేరాలు జరిగాయి. ఈ నేరాలలో బలాత్కారాలు, బలాత్కారం జరిపి హత్యగావించటం, అపహరించటం, బలవంతపు వివాహాలు, వ్యభిచారానికి బలవంతంగా నెట్టటం, పరువు హత్యలు, ఆన్‌లైన్ వేధింపులు, కట్నంకోసం వేధింపులు, హత్యలు మొదలైనవి వున్నాయి.

వాస్తవానికి వెలుగులోకి వచ్చిన ఈ నేరాల సంఖ్యకన్నా ఎన్నోరెట్లు ఎక్కువగా ఈ దారుణాలు, నేరాలు దేశమంతటా యధేచ్ఛగా సాగుతూనే వున్నాయనేది వాస్తవం.

నిర్భయ, దిశ చట్టాలు, సిసి కెమేరాలు, 'షి' టీముల ఏర్పాట్లు ఎన్నివచ్చినా; మరణశిక్ష తీర్పులు వచ్చినా; నేరస్థులన్న వారిని 'ఎన్‌కౌంటర్లు' చేసినా ఈ దారుణాలు ఆగకపోగా, పెచ్చుమీరుపోతున్నాయి. 2016లో 3,38,954 మహిళలపై నేరాల కేసులు నమోదుకాగా, గత 6 సం॥ల కాలంలో ఆ సంఖ్య 26.35 శాతం పెరిగింది.

దేశంలోని వివిధ ప్రాంతాలలో విడివిడిగా జరిగిన సంఘటనలుగా ఇవి మనకు కన్పించినప్పటికీ, ఒకే రకపు దుర్మార్గ సంస్కృతి విష భావజాల ఫలితంగా జరుగుతున్నవేనని అర్థం చేసుకోవాలి. స్త్రీని దాసిగానూ, బానిసగానూ పరిగణించే ఫ్యూడల్ భావజాలంతోపాటు, స్త్రీని భోగ, విలాస వస్తువుగా పరిగణించే వినాశకర సామ్రాజ్యవాద సంస్కృతి కలగలిసిన నేటి అర్థవలస - అర్థఫ్యూడల్ విషసంస్కృతి భావజాల ఫలితంగానే ఇవన్నీ జరుగుతున్నాయని గ్రహించాలి.


అందువల్లనే ఈ దుర్మార్గాలను కొన్ని చట్టాలతోనో, అరాకొరా శిక్షలతోనో నిరోధించటం సాధ్యంకావటంలేదు. పైగా, ముఖ్యంగా గత 8 సం॥లుగా కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి నాయకత్వంలోని హిందూమతతత్వశక్తులు ఫ్యూడల్ భావజాలం, ఆచరణను మరింతగా పెంపొందిస్తున్నారు. ఈ కారణంగా మానవత్వానికే కళంకమైన, తిరోగమన అభివృద్ధి నిరోధక భావజాలం సమాజంలో బలంగా వేళ్ళూనుకుంటోంది. సమాజంలో మహిళలపై సాగుతున్న అనేకానేక దురాచారాలకు, దుర్మార్గాలకు ఈ భావజాలమే ప్రాతిపదికగా వుంటోంది.

కావున, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు, దురాచారాలకు వ్యతిరేకంగా అందుకు కారణమైన నేరస్థులను శిక్షించాలని డిమాండ్ చేస్తూనే, సమాజంలో ఇలాంటి అకృత్యాలకు కారణంగా వున్న ప్రస్తుత అర్థవలస -అర్థఫ్యూడల్ సామాజిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. ఆనాడే స్త్రీలకు సమాజంలో నిజమైన స్వేచ్ఛ, రక్షణ సాధ్యమౌతాయి. ★

Janasakti (Communist Revolutionaries' Monthly) RNI No. 8315/63 VJ-077/2022-24
No.of pages : 24 Date of publication : 1st & 2nd of Every Month Posting date : 5th or 6th of Every Month

'శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమ అమరులు కోరన్న, మంగన్నలకు జోహార్లు'

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో శ్రీకాకుళం, పార్వతీపురంలలో వర్ధంతిసభలు



శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న మంగన్నల 55వ వర్ధంతి సభ **శ్రీకాకుళం** - ఆముదాలవలస బైపాస్ రోడ్డు వద్ద ఉన్న అమరుల స్థూపం వద్ద స్ఫూర్తిదాయకంగా జరిగింది. ముందుగా భూమికోసం, భుక్తికోసం, విముక్తికోసం పోరాడి అమరులైనవారందరికీ జోహార్లు తెలియజేస్తూ నివాళులర్పించారు.

అమరులను స్మరిస్తూ ప్రజాకళాకారులు పాడిన పాటలు సభికులను ఉద్విగ్న వాతావరణంలోకి తీసుకెళ్లాయి.

అనంతరం జరిగిన సభకు జిల్లా కార్యదర్శి కా॥ టి. అరుణ అధ్యక్షత వహించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ ఈ సభలో మాట్లాడుతూ "అమరుల త్యాగాల ఫలితంగా గిరిజనుల రక్షణ కోసం చేసిన చట్టాలైన 1/70 చట్టం, పీసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టాలను పూర్తిస్థాయిలో అమలుజరపకపోగా, అడవుల నుండి ఆదివాసీలను ఖాళీ చేయించి, అడవిలోని సంపదలను అదానీ, అంబానీలకు, బహుళజాతి సంస్థలకు, సామ్రాజ్యవాదులకు అప్పచెప్పడానికి పూనుకుంటున్నారని, అందుకోసం పార్లమెంటులో చట్టం చేయబోతున్నారని, దీనికి వ్యతిరేకంగా అందరూ పోరాడాలని పిలుపు నిచ్చారు. అడవులు ధ్వంసం కావడం అంటే, కేవలం గిరిజన సమస్య మాత్రమే కాదని, పర్యావరణానికి, నీటివనరులకు నష్టం జరగబోతున్నదని తెలియజేశారు. ప్రజాఉద్యమాన్ని తీవ్ర నిర్బంధం [illegible]యోగించి, అణచివేయడానికి పాలకులు మొదటినుండి పూనుకుంటున్నారని, ఈ నిర్బంధమే [illegible]ళ గిరిజన ఉద్యమంలో 360 మంది ప్రాణాలను బలితీసుకున్నదన్నారు. ఈరోజు ఏ చిన్న ప్రజాసమస్యపైన కదిలినా కేసులు పెడుతున్నారని **(తరువాయి 11వ పేజీలో)**

నెల్లూరు ప్రభుత్వ విద్యుత్‌ప్లాంట్‌ను అదానీపరం చేయటాన్ని నిరసిస్తూ ఆందోళన

నెల్లూరుజిల్లా కృష్ణపట్నం పోర్టు సమీపంలో నేలటూరు గ్రామంలో ప్రభుత్వరంగంలో దామోదరం సంజీవయ్య పేరిట నెలకొల్పిన థర్మల్ విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. మరో 800 మెగావాట్ల సామర్థ్యం గల ఆధునిక యూనిట్ నిర్మాణం పూర్తికాగా అక్టోబర్ 27న దాన్ని ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు.

జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించిన ఈ కార్యక్రమం మోసపూరితం. 20 వేలకోట్ల రూ॥ విలువైన ఈ మొత్తం 3 యూనిట్లను 'అదానీ' గ్రూపుకు అప్పజెప్పేందుకు జగన్ ప్రభుత్వం రాజకీయంగా నిర్ణయం తీసుకున్నది. నిర్వహణ వ్యయం ఎక్కువ అవుతుందన్న సాకు చూపి తక్కువ రేటుకు ఉత్పత్తి చేసేవాళ్ళకు ప్లాంటును అప్పజెప్పడంగా ప్రభుత్వం తన చర్యకు సమర్థన చేసుకుంటోంది.

ప్లాంటు కోసం భూములు ఇచ్చిన రైతు కుటుంబాలన్నిటికీ ఇప్పటికీ ఉద్యోగాలు చూపలేదు. చూపిన 110 మందికూడా కాంట్రాక్టు కార్మికులుగానే ఉన్నారు. అందువల్ల కార్మికులు గత 280 రోజులకు పైగా ప్లాంటు ప్రైవేటీకరణ ప్రతిపాదనను ఉపసంహరించాలని కోరుతూ పలురూపాల్లో ఆందోళన సాగిస్తున్నారు. ప్రైవేటుకు అప్పజెపితే విద్యుత్ ధరలు పెరుగుతాయనీ, ప్రభుత్వం ఇప్పుడు ఇచ్చే రాయితీ విద్యుత్తు కూడా రద్దవుతుందనీ అందువల్ల ప్రభుత్వరంగంలోనే ప్లాంటును కొనసాగిస్తూ అవినీతిని అరికట్టి, సమర్థతను పెంచే చర్యలు తీసుకోవాలని జిల్లాలోని ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాలు ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాయి.

ముఖ్యమంత్రి పర్యటనను నిరసిస్తూ కార్యక్రమాలు చేపట్టాయి. ముఖ్యమంత్రి కార్యక్రమానికి ముందురోజు రాత్రినుండే పోలీసులు పలువురు కార్మిక, రాజకీయ పార్టీల నాయకులను నిర్బంధించారు. అరెస్టులను తప్పించుకుని 27వ తేదీ ఉదయం నెల్లూరులోని ముత్తుకూరు బస్టాండ్ సెంటరులో నిరసన తెలియజేసిన థర్మల్‌ప్లాంటు పరిరక్షణ కమిటీ నాయకత్వమంతటినీ అరెస్టుచేసి బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు సి. యానాదయ్య, సిఐటియు మోహనరావు, ఏఐటియుసి దామా అంకయ్య తదితరులున్నారు. ఈ అరెస్టులను ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యవర్గం ఖండించింది. ప్లాంటును అదానీకి అప్పజెప్పే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేసింది. ✶

Printed, Published and Owned by S. Seshamma
32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
Printed at SVR Offset Printers & Binders, D.No. 24-29-128B, Garimallavari Street, Gulabithota, Vijayawada-3
Editor : S. Seshamma, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M259
పుస్తకం పేరు	జనశక్తి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	25
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	sharmila
పేజీలు విడదీసినది	sharmila
స్కాన్ చేసినది	Afsar
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good